57414
57415

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మే 23, 2010

Entered

ఐస్‌క్రీం.. కావాలోచ్...

హ్యాపీ బర్త్‌డే

(2010 మే 23 నుంచి
2010 మే 29 వరకు)

బి. అమ్ములు
4సం॥, మే-24
హేమలత-వెంకట్రావు
సత్యనారాయణపురం-ఒంగోలు



ఎం. సాయి జశ్విత
మే
విజయకుమారి-మల్లిఖార్జునచారి
నేరేడ్‌మెట్-సికింద్రాబాద్

చరిత్
1సం॥, మే-2009
స్రవంతి-సురేష్
ఉయ్యూరు-విజయవాడ



ఎం.ప్రకృతి గౌడ్
1సం॥, మే-2009
ఉమ-వెంకటేష్
హైదరాబాద్

అభినయ్
మే-23
లక్ష్మి-సత్యనారాయణ
పతివాడపాలెం-శ్రీకాకుళం

ఆహ్వానం

మీ చిన్నారులకు కూడా ఇలా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాలని ఆశ పడుతున్నారా! అయితే ఆలస్యం ఎందుకండి! వెంటనే పోస్ట్ కార్డు తీసుకోండి. దాని మీద మీ బాబు- పాప పేరు , పుట్టిన తేదీ, నెల, సంవత్సరం, ఊరు , తల్లిదండ్రుల వివరాలు రాసి పోస్ట్ చేయండి. అన్నట్టు కార్డు పై కలర్ ఫొటో అతికించడం మరువకండి. అయితే మీ చిన్నారి వివరాలను 15 రోజుల ముందుగానే మాకు అందేవిధంగా పంపగలరు.

మా చిరునామా
హ్యాపీ బర్త్‌డే, ప్రజాశక్తి ప్లాట్ నెం. 21/1,
ఎం.హెచ్ భవన్
ఆజమాబాద్ ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి,
హైదరాబాద్-500 020
email- venkateshcartoon@gmail.com

ENTERED

మనలో మాట

ఐలా.. లైలా... ఎన్నాళ్లిలా?



ఏతావాతా పరిశీలిస్తే- వాతావరణం వ్యవహారం కూడా ఓట్ల నాయకుల్లాగానే ఉంటోంది! వాస్తవానికి వానా - ఎండా - చలి కాలాల సమయాసమయాలుంటాయనేది పాఠ్య పుస్తకాల్లోని ప్రబోధం. అనుభవమేమో అది నిజం కాదని చెప్తోంది! ఏడాదిలో రెండొంతుల కాలం ఉక్కబెట్టే ఎండలతోనే గడిచిపోతోంది! మిగతా కాలమంతా వానలకోసం ఎదురుచూపులకు, మన ఏలికల పథకాలు కూడా అచ్చం ఇలాగే ఉంటాయి. ఇచ్చేదేమో తెలీదు గానీ, ఊరింపులూ ఎదురుచూపులకే పుణ్యకాలం కాస్త హరించుకుపోతుంది.

ఎన్నికల వేళ అడక్కుండానే నాయకులు హామీల వర్షం కురిపిస్తారు. నిజానికి ఎన్నికల వాసనలు కూడా తగలకముందే వీరి వాగ్దానాల వాన మొదలవుతుంది. అలాగే మనం ఆశించకుండానే రుతుపవనాలు ముంగిట్లోకి వచ్చేసినట్లు ఊరిస్తాయి. మనం నిజమేననుకొని కరువులో కాలేస్తాం! రైతు విత్తనాలు సిద్ధం చేసుకొని, ఏరు పూసుకొని... వర్షం ఎప్పుడొస్తుందా? అని ఎదురుచూస్తాడు. రుతుపవనాలు అండమాన్‌లో ఆవరించాయని, కేరళలో కాలు మోపాయని... వార్తలు పరంపరగా వస్తూనే ఉంటాయి. ఆ భరోసాతో రైతు అప్పులు చేసి, అన్నీ సమకూర్చుకొని, ఈ ఏడాదైనా కష్టాలు గట్టెక్కాలని ఆశగా ఎదురుచూస్తుంటాడు. ఫీజు రీయంబర్స్‌మెంటుకోసం ఎదురుచూసే పేద విద్యార్థిలాగా.

నిజంగా రుతుపవనాలు రావల్సిన సమయం రానే వస్తుంది. అయినా, వాటి జాడ ఉండదు. అదును దాటిపోతుందన్న ఆదుర్దా బయల్దేరుతుంది. అయినా, వాటిలో కదలిక ఉండదు. కదిలే శక్తి ఉడిగిపోయి ఎక్కడివక్కడ స్తంభించిపోయాయన్న కబురు వస్తుంది. అవి కదలాలంటే అల్ప పీడనాలు ఏర్పడాలని, తుఫాన్లు రావాలని వాతావరణ కేంద్రాలు చెబుతాయి. రాష్ట్రం సజావుగా నడవాలంటే సంక్షేమ పథకాలు ఎత్తేసి, భారాలు మోపాలన్న రాష్ట్ర ముఖ్యమంత్రిలాగా.

ఇది పదేపదే సంభవించే దృశ్యం!

రుతుపవనాలు వచ్చినట్టే వచ్చి అజాపజా లేకుండా పోతాయి.

ఓట్ల ప్రభుత్వాలూ పథకాలు ఇచ్చినట్టే ఇచ్చి ఆఖర్లో చేతులెత్తేస్తాయి.

రైతులూ, విద్యార్థులూ, అన్ని తరగతుల ప్రజలూ మరోసారి మోసపోయినట్టు గ్రహిస్తారు.

పథకాలను ఎత్తేస్తారేమోనన్న భయంతో భారాలకూ; ఎండవేడిమినీ, కరువునూ తట్టుకోలేమన్న తాపత్రయంతో అల్పపీడనాలకూ, తుఫాన్లకూ సంసిద్ధమైపోతారు.

ఐలా, లైలా వంటి ముద్దు పేర్లతో తుఫాన్లు వస్తాయి.

బోగస్సూ, భారమూ వంటి కారణాలతో 'కోతలు' సాగుతాయి.

వీటివల్ల ఉపశమనం ఎంతో, ఉన్న దాంట్లో ఊడిందెంతో తీరిగ్గా లెక్కలు కడితేగానీ తేలదు!

★

ఈ సంచికలో....

టపా	...	2
కవిత్వమ్	...	6
చల్లచల్లగా	...	7
సీరియల్	...	8
క్రైమ్‌కథ	...	10
రుచి	...	11
అట్టమీది కథ	...	14
కొత్తపుస్తకాలు	...	17
కథ	...	18
బాలనేస్తాలు	...	22
మాటలకోట	...	24

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఆధ్యాత్మిక భావాలను వదిలించిన నవల

చూద్దామా ... 12

గోవా...
భూతల స్వర్గమా ఏమి!

లిఖిత పత్రికలు ... 20



కన్నీళ్లు తెప్పించిన 'కంటి పాపలు...'

మే 9 ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో అట్టమీది కథ 'కంటి పాపలే కరవైతే ఇంటి దీపమేది' చదివిన తర్వాత మన రాష్ట్రంలో కూడా అమ్మాయిల కోసం అబ్బాయిలు పొరుగు రాష్ట్రం వెళ్లాల్సిందేనా అనే సందేహం కలుగుతుంది. సమాజంలో ఆడపిల్లల సంఖ్య తగ్గడానికి ప్రభుత్వ విధానాలు కూడా కారణమౌతున్నాయి. ఆస్పత్రులలో లింగ నిర్ధారణ పరీక్షలు జరపకూడదన్న నిబంధన, చట్టం వున్నా యథేచ్ఛగా ఆ పరీక్షలు చేసి ఆడపిల్లలను గర్భంలోనో లేదా పురిటిలోనో చంపేస్తున్నారు. మొత్తానికి అట్టమీద కథ కన్నీళ్లు పెట్టించింది.

కె.సతీష్‌రెడ్డి, కె. శ్రీధరాచార్య, పరకాల, వరంగల్.

అలరించిన చూద్దామా

ఈ వారం సంచికలో క్రెమ్లిన్ నగరంలో ఎన్ని విశేషాలో... వ్యాసం అలరించింది. క్రెమ్లిన్‌కి గొప్ప చరిత్ర వుందనీ, రష్యాలో పురాతన నగరమనీ, అక్కడి టవర్లు, ఆర్మరీ, లెనిన్ స్మారక చిహ్నాలు, చర్చి... అన్నీ విశేషాలను చక్కగా వివరించారు. ధన్యవాదాలు.

ఆచార్య. ఎన్. నారాయణరావు, గడ్డి అన్నారం, హైదరాబాద్.

కవర్‌స్టోరీ బాగుంది

చదవడమనేది ప్రధానమని ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ చెప్పారు. కాలేజీలో ఇంగ్లీషు చదవడం వల్ల ప్రపంచ రాజకీయాల చరిత్ర, సాంఘీక పుస్తకాలు ప్రీతితో చదివారు. ఇందువల్ల తోటి విద్యార్థులతో గాని, మిత్రులతో గాని తిరగాలని వుండేది కాదు. ఆయనో విజ్ఞాన గని. ఆయన స్ఫూర్తితో నాకు తెలిసిన తెలుగు భాషలో కొన్ని పుస్తకాలు చదివాను. నంబూద్రిపాద్ గారిని యువజనులు స్ఫూర్తిగా తీసుకుంటే గొప్పవారు కాగలరని ఆయన గురించి చదివిన తర్వాత అనిపించింది. భారత దేశంలో ఆడవాళ్లను బానిసలుగా అమ్మడమనేది లేదని వాదించేవారున్నారు. మన హరిశ్చంద్ర కథలో చంద్రమతిని అమ్మే కథ వుంది. సమాజంలో ఆ పద్ధతి లేకపోతే ఆ కథ వుండేది కాదు. సమాజం ఆ కథను అంగీకరించేది కాదని చెప్పినా వినరు వారు. ఈ వారం అట్టమీది కథ 'కంటి పాపలే కరవైతే...' చదివితే భారతదేశంలో స్త్రీల అమ్మకం వుందని తెలుస్తుంది. దరిద్రం పోతే అప్పులు పోతాయి. అప్పుడు ఆడవాళ్లను అమ్మడం కూడా పోతుంది. మార్చురీ కథలో కత్తి పోట్లు లెక్కపెట్టడానికి ఒక పాత్ర వస్తుంది. 16 సంవత్సరాల కుర్రాడు కుళ్లిపోయిన తండ్రి శవం మీద పడి ఏడుస్తాడు. సూరిబాబు ఈ కుర్రాడి మాటలతో బుద్ధి తెచ్చుకుంటాడు. మొత్తం ఈ కథ చదివిన తర్వాత ఇందులో పాత్రలేవీ సహజ పాత్రలుగా లేవు. అన్నీ అతికించినట్లుగా వున్నాయి.

ఇ.సూర్యనారాయణ, విజయవాడ.

స్త్రీ శక్తి మహోన్నతమైంది

ఆదివారం ప్రజాశక్తి స్నేహలో ప్రచురించిన అట్టమీది కథ వ్యాసం "కంటి పాపలు కరవైతే.." చాలా బాగుంది. ఇంటికి దీపం ఇల్లాలు, కంటికి వెలుగు ఆడపిల్లలు. ప్రస్తుత సమాజంలో ఆడపిల్లలు అన్ని రంగాల్లో వున్నారు. తమకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ప్రేమకు, ఆప్యాయతకు, సహనానికి చిరునామా ఆడపిల్లలు. వీరి చదువు, పెళ్లి, కట్నం భారంగా ఉండవచ్చు. కానీ వారి శక్తి మహోన్నతమైంది. ప్రపంచంలో స్త్రీలు సాధించలేనిది ఏదీ లేదు. ప్రధాని, రాష్ట్రపతి దాక ఎదిగారు. అన్నింటా విజయం సాధించారు. కానీ ప్రస్తుత సమాజంలో వారిని చిన్నచూపు చూస్తున్నారు. అదే అబ్బాయిలకు అడిగినది ఇస్తారు. పెద్ద పెద్ద చదువులకు అధిక ధనం ఖర్చు చేస్తారు. కానీ ఆడపిల్లను కొంతవరకు చదివించి వంటింటి బానిసను చేస్తున్నారు. అందుకే ఆడపిల్లలు ఉన్న వారికి రాయితీలు, ఉద్యోగ, ఉపాధి మార్గాలు కల్పించాలి. ఆడపిల్ల పుట్టగానే ఆనందపడే రోజులు రావాలి. అప్పుడే కంటికిరెప్ప, ఇంటికి వెలుగు, కుటుంబానికి శుభం అవుతుంది. రచయితకు, ప్రజాశక్తికి ధన్యవాదాలు.

డి.వై. రాజు, గణపవరం, గుంటూరు.

మంచి పుస్తక విశేషాలు

ఈ ఆదివారం అనుబంధంలోని 'కొత్త పుస్తకాలు' శీర్షిక అద్వితీయంగా వుంది. ఇందులో ముఖ్యంగా అడవి బాపిరాజు రచనలు వున్నాయి. మంచి పుస్తక విశేషాలనందించినందుకు మీకు ధన్యవాదాలు. ఈవారం 'చల్లచల్లగా' శీర్షికన నోరూరించే నారింజ అంటూ నారింజ పండును గురించిన ఆరోగ్య సూత్రాలు, దాని వాడకం ద్వారా ఒనగూరే ప్రయోజనాలతో పూర్తి సమాచారాన్ని తెలిపినందుకు హ్యాట్సాఫ్. 'సినిమా కబుర్లు'లో 'మాభూమి' చిత్రం విడుదలై 30 సంవత్సరాలు గడిచిపోయినా ఆ చిత్రం ఎప్పటికీ నిలిచి వుంటుంది. సినీ కబుర్లు ఆకట్టుకున్నాయి. 'కవిత్వమ్'లోని సూర్యుని నీడ,



ష్...' కవితలు నేటి పరిస్థితికి అద్దం పట్టాయి.

టి.వి.డి.ఎన్.ఎస్.రామారావు, విజయవాడ.

ఆలోచన రేకెత్తించింది

మే 9 నాటి స్నేహ 'అట్టమీది కథ'గా అంజనగారందించిన రచన ఆలోచింపజేసింది. షుగర్ పేషెంట్లకు కూడా మేలు చేసే నారింజ గురించి 'చల్లచల్లగా' అంశంలో ఉపయుక్త సమాచారమందించింది. 'బాలనేస్తాలు'లో 'చేసేద్దాం, చిత్ర విచిత్రం' మాకు బాగా నచ్చే అంశాలు. వైకల్యం ఓడిపోయింది స్ఫూర్తివంతంగా వుంది. 'ష్...ష్... ష్..., సూర్యుని నీడ' కవితలు భావగర్భితంగా వున్నాయి. 'సలహాలు' శీర్షిక న్యాయ సంబంధ సమస్యలు అడిగిన వారికే కాక, చదివిన వారికీ ప్రయోజనకరంగా వుంటుంది. 'సినిమా కబుర్లు' శీర్షిక మా భూమి జ్ఞాపకాలలోకి పంపించింది. 'చూద్దామా' ద్వారా క్రెమ్లిన్ నగరాన్ని గురించి తెలుసుకున్నాం. మార్చురీ కథ ఆసక్తికరంగా సాగింది. స్కీముల్లో చౌకగా వస్తున్నాయి కదాని అవసరం లేకపోయినా కొనే అలవాటున్నవారు 'వికాసం' చదవాల్సిందే. నేటి భారతంలో 'నీటి భారతం' కష్టాల కడగండ్లు... నిండిన 'మనలోమాట' పాలకుల మతికి ఎక్కాలని ఆశిస్తున్నాం.

ఎన్.ఎస్.సి.బోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

★

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...

ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...

సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.



స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

☞ **ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:**

CHENNAI:

044-42121947

ఫాలో: 0-9789099589

లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని SMS చేయండి

చెన్నై ఫోన్ నెంబరుకు చేసినా తెలుగులోనే మాట్లాడతారు. యస్.టి.డి. చార్జీలు ఇప్పుడు నామమాత్రమే కనుక మీ పూర్తి పేరు, ఇంటి నెం. ఊరి పేరు, పిన్‌కోడ్‌లను తెలియజేసి రూ.1000/-ల కు వి.పి.పి. ద్వారా పంపమని ఫోన్ ద్వారా తెలపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి కోర్స్ పేకెట్ పొందగలరు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE™

AWARD WINNER

5118-282

No.76 (TLCD), Habibullah Road, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్, ఫ్రీ సి.డి. మరియు మెమరీ కోర్స్ ఇవన్నీ మొత్తం కలిపి వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు మొత్తం రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

.... Pin Code: ☐☐☐☐☐☐

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ●**KARIMNAGAR** :D.No.2-6-286, C.V.R.N Road, Near:Inspection Bunglow. **Cell**:9392441 7745 ,90304 55603. ●**SURYAPET**:D.No.2-263/1, Near: Mahatma Gandhi Statue, K.K.Road. **Cell**:9246965030. ●**KHAMMAM**:Beside:KaveriRestaurant,WyraRoad,**Cell**:9440911478. ●**ONGOLE**: UpStairs Of Corporation Bank, GandhiRoad, **Ph**:2281948,**Cell**:9291535101. ●**CHIRALA**: D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex , **Cell**:9848835625. ●**RAVULAPALEM**: LICBuildingBackside,**Cell**:9394838630,9912703182.●**TANUKU**:D.No.27-8-11,JeediguntavariStreet,**Cell**:9392210039.●**PALAKOL**:Beside: ChaitanyaHospital,Near:TelephoneExchange.**Ph**:228800, **Cell**:9247463900.●**CHITTOOR**:M.B.R.Complex,D.I.Road,**Ph**:232502.**Cell**:9885281530, 9052180134.●**NANDIKOTKUR**: D.NO.16-59B,College Road,**Cell**:93904 44252,98494 92298. ●**ALLAGADDA**: T.B.Road, Cell:9392559607.●**ADONI**: D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell**:9391644633, 9885512384.●**KURNOOL**: **Shop** No.C-45, RMK Plaza,OPP: Kalukura Hotel. **Cell**:99855 01587. ●**DHONE**:Opp: Raja Theatre, Kothapeta, **Cell**:9390495239 ,9948032431 ●**HINDUPUR**:II Floor, Karnataka Bank Upstairs, Opp:Parigi Bus Stand, **Cell**:9849596842,9347221617●**TADIPATRI**: Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell**:9347353709,9290091456.

కె.వి.ఆర్ ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.

స్ఫూర్తి

ఎమ్వీయస్ శర్మ
సిపిఎం రాష్ట్రకమిటీ సభ్యులు,
శాసన మండలి సభ్యులు.

ఆధ్యాత్మిక భావాలను వదిలించిన నవల

ఒక్కో పుస్తకాన్ని చదివినపుడు ఒక్కొక్క అనుభూతి కలుగుతుంది. బద్ధకాన్ని వొదిలించి పనిలోకి నెట్టే పుస్తకాలు కొన్ని ఉంటాయి. నీరస వాతావరణం ఉంటే దాని నుండి బయటికి లాగి ఉత్సాహాన్ని కలిగించి వీపుమీద ఒక్క చరుపు చరిచి మనని మళ్లీ ఉరకలెత్తించే పుస్తకాలు మరికొన్ని. విప్లవాల విజయగాథలు ఒక విధంగా, విప్లవవీరుల అమర గాథలు మరో విధంగా స్ఫూర్తిని కలిగిస్తాయి. అయితే ఒక నవలని చదివాక దాని సారాంశం మన మెదడులో జొరబడి మనని కుదురుగా కూచోనివ్వక, నిలబడనివ్వక ఉక్కిరి బిక్కిరి చేసే అనుభూతి కలగడం చాలా అరుదు. సాధారణంగా ఒక సత్యం మనకి మొదటిసారి అర్థం అయినపుడు అటువంటి అనుభూతి కలుగుతుంది. సిద్ధాంత గ్రంథాలను అధ్యయనం చేసేటపుడు కలిగే అనుభవం ఇది. కాని ఒక నవలను చదివినపుడు అటువంటి అనుభవం కలగడం అరుదు. 'భూలోకంలో శని' అన్న నవలను చదివినపుడు నేను అటువంటి అనుభూతినే పొందాను. ఆంటన్ టామ్ సారే అన్న రచయిత నవలకు కేశవరెడ్డిగారు చేసిన తెలుగు స్వేచ్ఛానువాదం ఈ నవల. 172 పేజీల ఈ నవలను 1985లో ప్రజాశక్తి బుక్‌హౌస్‌వారు ప్రచురించారు.

చిన్నప్పటినుంచి నాకు కథలు చదవడం అలవాటైంది. ఈ అలవాటు మా అమ్మ చేసింది. ఎండాకాలం ఇంటి దగ్గర ఏమీ తోచేది కాదు. ఆడుకోడానికి బయటికి పోతానని మారాం చేస్తుంటే ఎండలో బయట తిరగొద్దనేది అమ్మ. మరి ఏం చెయ్యాలని గొడవ చేస్తుంటే ఆంధ్రప్రభ వీక్లీ ఇచ్చి అందులో పిల్లల కోసం రాసిన కథ చదువుకోమంది. ఆ తర్వాత చందమామ కోసం దగ్గర్లో వున్న రైల్వే లైబ్రరీకి వెళ్లేవాడిని. అలా వార, మాస పత్రికలు రెగ్యులర్‌గా చదవడం ఆరో తరగతికి అలవాటుగా మారింది. ఎనిమిదో తరగతి సెలవుల్లో స్నేహితుడు బుచ్చిబాబుతో ద్వారకానగర్ శాఖ గ్రంథాలయం కొత్తగా తెరిస్తే అక్కడికి వెళ్లాను. కొత్త పుస్తకాలు చాలా వున్నాయక్కడ. ఆ సెలవుల్లో దాదాపు రోజుకో నవల చదివాను. అడివి బాపిరాజు నవల గోన గన్నారెడ్డి, తెన్నేటి సూరి రాసిన చంఘిజ్‌ఖాన్, కాశీమజిలీ కథలు నాకు బాగా ఇష్టమైనవి. చంఘిజ్ ఖాన్ ఇప్పటికో ఏభైసార్లైనా చదివి వుంటాను. చక్రవర్తుల రాజగోపాలాచారి ఇంగ్లీషులో రాసిన రామాయణం, మహాభారతం పుస్తకాలను మా తాతగారు తెలుగులో అనువదించారు. ఆ రాతప్రతులు మా చిన్నాన్న ఇంట్లో వుంటే తీసుకొచ్చి వాటిని చదివాను. ఒకసారి కాదు, పదిహేను సార్లు చదివివుంటాను.

బుచ్చిబాబు ఇంట్లో కొమ్మూరి సాంబశివరావు డిటెక్టివ్ పుస్తకాలు వుండేవి. వాటిని చదవడం నాకు చాలా ఇష్టం. ఫిఫ్త్ ఫారానికి వచ్చేసరికి శరత్‌బాబు నవలలు, రంగనాయకమ్మ, కోడూరి కౌసల్యాదేవి నవలలు చదవడానికి ఇష్టపడేవాడిని. రంగనాయకమ్మ కూలినగోడలు, అంధకారంలో, డా॥ కొమ్మూరి వేణుగోపాలరావు హౌస్‌సర్జన్, పెంకుటిల్లు ఒకటికి పదిసార్లు చదివాను.

మా నాన్నగారితో బాటు చిన్మయానంద స్వామి ఆధ్యాత్మిక ఉపన్యాసానికి వెళ్లేవాడిని. ఆయనేమో ఇంగ్లీషులో మాట్లాడేవాడు. నాకు సరిగ్గా అర్థమయ్యేది కాదు. అయినా వెళ్లేవాడిని. ఈ క్రమంలో ఆధ్యాత్మిక భావాలు కొన్ని వంటబట్టాయి. దాంతో ఎన్నో ప్రశ్నలు, సందేహాలు వచ్చేవి. నన్ను ఇంప్రెస్ చేసిన అభ్యుదయ సాహిత్యానికి, మా నాన్న చాలా గొప్పగా పరిగణించే ఆధ్యాత్మికతకు ఎక్కడా పొంతన కుదిరేది కాదు. ఈ సందిగ్ధ దశలోనే కాలేజీలో డిగ్రీ చదివేటప్పుడు మిత్రుడు సి.వి. సుబ్బారావు మహాప్రస్థానం పుస్తకం ఇచ్చి చదవమన్నాడు. నాకు అది ఏమీ అర్థం కాలేదు. అదే ముక్క అతగాడితో చెప్పాను. అతడిచ్చిన రావిశాస్త్రి కథలు చదివాను. అందులో వున్న శైలి ఆకట్టుకుంది. వ్యంగ్యం నచ్చింది. కానీ అంతకు మించి నాకేమీ ఎక్కలేదు. 1971లో మా నాన్న మరణం నాపై చాలా ప్రభావం కలిగించింది. ఫస్టియర్ డిగ్రీ సెలవుల్లో సుబ్బారావు 'గతితార్కిక భౌతికవాదం' అన్న పుస్తకాన్ని ఇచ్చాడు. కంభంపాటి రాసినది. ఆ ఒక్క పుస్తకాన్ని చదవడానికి నెలరోజులు పట్టింది నాకు. ఒక్కొక్క పేజీ చదువుతుంటే ఎంతో కన్విన్సింగ్‌గా వుండే, కొత్తగా అనిపించే భావాలు కనపడేవి. అవి అంతకుముందే నేను ఏర్పరచుకున్న అభిప్రాయాలకు పూర్తి విరుద్ధంగా వుండేవి. బుర్ర వేడెక్కిపోయేది. కానీ మొత్తానికి ఒక కొత్త ప్రపంచం ఏదో వుందని అర్థమైంది.

నేను చదువుతున్న పుస్తకాల్లో మార్పు ఇంట్లోవాళ్లు కనిపెట్టారు. సృజన, చార్వాక, నాస్తిక యుగం లాంటి పత్రికలు నా దగ్గర చూసి ఇలాంటివి చదవడం తప్పు అని చెప్పేవారు. చాలా ఘర్షణ జరిగేది. అయినా నేను వినిపించుకునేవాడిని కాదు. ఈ ఘర్షణ మధ్యలోనే డిగ్రీ పూర్తయింది. ఎల్.ఐ.సీలో వుద్యోగం వచ్చింది. స్వతంత్రత ప్రకటించుకోడానికి అదే మంచి ఛాన్సు. వెంటనే ఉద్యోగంలో చేరిపోయాను. అక్కడి నుండి క్రమంగా యూనియన్‌లో చురుకుగా పాల్గొనడం పెరిగింది. ఎల్.ఐ.సీ ఏజెంటుగా వైదాడ లచ్చయ్యగారు (విశాఖ జిల్లా ఉద్యమ నిర్మాతల్లో ఒకరు) వుండేవారు. ఆయన ద్వారా ప్రజాశక్తి వారపత్రిక చందా దారుణ్ణి అయ్యాను. ఇక అక్కడినుండి నా కథ క్రమంగా మారి రూట్లోకి వచ్చింది.

నేను పుట్టి పెరిగిన సాంప్రదాయ మధ్యతరగతి ఆధ్యాత్మిక తాత్విక వాతావరణానికి పూర్తి విరుద్ధమైన వాతావరణంలో నేనిప్పుడున్నాను. కులతత్వం వంటివి మా పెద్దలు నాకు ఎప్పుడూ ఎక్కించలేదు. కానీ ఆచారాలు, పవిత్రత, ఆధ్యాత్మికత బాగానే ఎక్కించారు. వాటిని వదిలించుకోవాలంటే దానికి తగినంత మోతాదులో భౌతికవాదం, వర్గదృక్పథం అధ్యయనం చేయడం మినహా వేరే దొరకలేదు. ఈ రెండింటినీ ఒక నవల రూపంలో శక్తివంతంగా అందించిన నవల 'భూలోకంలో శని'. దీని గురించి వివరంగా చెప్పాలి.

ఒక్కో పుస్తకాన్ని చదివినపుడు ఒక్కొక్క అనుభూతి కలుగుతుంది. బద్ధకాన్ని వొదిలించి పనిలోకి నెట్టే పుస్తకాలు కొన్ని ఉంటాయి. నీరస వాతావరణం ఉంటే దాని నుండి బయటికి లాగి ఉత్సాహాన్ని కలిగించి వీపుమీద ఒక్క చరుపు చరిచి మనని మళ్లీ ఉరకలెత్తించే పుస్తకాలు మరికొన్ని. విప్లవాల విజయగాథలు ఒక విధంగా, విప్లవవీరుల అమర గాథలు మరో విధంగా స్ఫూర్తిని కలిగిస్తాయి. అయితే ఒక

నవలని చదివాక దాని సారాంశం మన మెదడులో జొరబడి మనని కుదురుగా కూచోనివ్వక, నిలబడనివ్వక ఉక్కిరి బిక్కిరి చేసే అనుభూతి కలగడం చాలా అరుదు. సాధారణంగా ఒక సత్యం మనకి మొదటిసారి అర్థం అయినపుడు అటువంటి అనుభూతి కలుగుతుంది. సిద్ధాంత గ్రంథాలను అధ్యయనం చేసేటపుడు కలిగే అనుభవం ఇది. కాని ఒక నవలను చదివినపుడు అటువంటి అనుభవం కలగడం అరుదు. 'భూలోకంలో శని' అన్న నవలను చదివినపుడు నేను అటువంటి అనుభూతినే పొందాను. ఆంటన్ టామ్ సారే అన్న రచయిత నవలకు కేశవరెడ్డిగారు చేసిన తెలుగు స్వేచ్ఛానువాదం ఈ నవల. 172 పేజీల ఈ నవలను 1985లో ప్రజాశక్తి బుక్‌హౌస్‌వారు ప్రచురించారు.

నవల ప్రారంభం చాలా కొత్తగా ఉంటుంది. దేవుడికి సందేహం కలిగిందట. భూమి మీద తాను చేసిన సృష్టిలో లోపాలు ఉన్నాయేమో అందువల్లనే మానవులు తప్పులు చేస్తున్నారేమో. ఒకవేళ అదే వాస్తవమైతే ఆ తప్పులకు మానవులను శిక్షించకూడదు గదా. వాళ్లని నరకానికి పంపకూడదు కదా. కాబట్టి కొత్తగా నరకానికి పాపుల్ని పంపకూడదు. ఇది దేవుడి నిర్ణయం. ఈ నిర్ణయం వల్ల నరకాధిపతి సైతాన్ (హిందువుల పురాణాల్లో నరకం యముడి ఆధీనంలో ఉంటుంది. క్రైస్తవ మతంలో నరకాధిపతి సైతాన్. ఇతడిది దైవాజ్ఞను ధిక్కరించిన చరిత్ర) పదవికి ఎసరొచ్చింది. సైతాన్ తన పదవిని కాపాడుకోవాలంటే ఏం చేయాలి? దేవుడి సృష్టిలో ఏ లోపమూ లేదని, మానవులే తప్పులు చేస్తున్నారని, దానికి వారిని శిక్షించాల్సిందేనని రుజువు చేయాలి. తన సృష్టిని సమర్థించాల్సిన బాధ్యత సైతాన్ మీద వేశాడా దేవుడు. ఎక్కడైనా అధికార పార్టీని సమర్థించే విశ్వాస తీర్మానాన్ని ప్రతిపక్షాలు బలపరుస్తాయా? కానీ ఇక్కడ అలా సమర్థించకపోతే సైతాన్ పదవే ఊడిపోయే పరిస్థితి దాపురించింది. ఇక తప్పేదేముంది? దేవుడి సృష్టిలో లోపమేమీ లేదని రుజువు చేయడం ఎలా? ఆ ప్రొసీజరు కూడా దేవుడే నిర్ణయించాడు. సైతాను మానవుడిగా భూమ్మీద తప్పు చేయకుండా జీవించగలగాలి. ముక్తి సాధించాలి. అంటే స్వర్గాన్ని చేరే అర్హత. భూమ్మీద ఉన్నంత కాలమూ తాను సైతానుని అన్న స్పృహ ఉంటుంది. కానీ అతీత శక్తులుండవు. సైతాను అంగీకరించి భూమికి బయలుదేరుతాడు.

భూమి మీద జానయ్యగా జీవితం ప్రారంభిస్తాడు. సైతాన్. ఎవరికీ చెందని ఒక దిబ్బమీద్ద కాపురం పెడతాడు. వ్యవసాయం వృత్తిగా ఎంచుకుంటాడు. వ్యవసాయం చేయాలంటే నాగలి, పనిముట్లు, పశువులు కావాలి. ఎవరిస్తారు? అటువంటివన్నీ జార్జి దగ్గర దొరుతాయని ఊరిలో జనం సలహా ఇచ్చారు. ఎవరీ జార్జి? ఊరి భూస్వామి. ఆ విధంగా జార్జితో సంపర్కం ప్రారంభమౌతుంది. వ్యవసాయానికి అవసరమైనవన్నీ జార్జి అప్పుగా ఇస్తాడు. ఆ అప్పు తీర్చడానికి జానయ్య జార్జి దగ్గర పాలేరుగా మారతాడు. అప్పులు, మళ్లీ అప్పులు, వడ్డీలు, -వీటిని తీర్చలేకపోవడం. -మన దేశంలో పేదరైతులు పడే బాధే సైతాన్‌కీ ఎదురైంది. తాను, తన భార్య, పిల్లలు అందరూ చాకిరీ చేసినా అప్పు తీరదు. తాను సాగులోకి తెచ్చిన భూమి, కట్టిన ఇల్లు - అన్నీ జార్జీ స్వాధీనమైపోతాయి. తనతోబాటు భార్య, పిల్లలు అందరూ జార్జి దగ్గర-ఇంట్లోనో, ఫ్యాక్టరీలోనో, పొలాల్లోనో పనిచేయాల్సి వస్తుంది. ఇంత చేసినా మళ్లీ మళ్లీ జార్జికే బకాయిపడిఉంటాడు జానయ్య. బాకీ తీర్చడానికి కొత్తగా భూమిని బాగుచేసి సాగులోకి తేవడమూ, తీరా తెచ్చాక ఆ భూమి కూడా జార్జి ఆధీనంలోకి వెళ్లిపోవడమూ జరుగుతూనే ఉంటుంది.

జానయ్య కొడుకుల్లో ఒకడు జార్జి ఫ్యాక్టరీలోని యంత్రం దగ్గర ప్రమాదానికిగురై చనిపోతాడు. కూతుర్ని జార్జి కొడుకు పాడుచేస్తాడు. కడుపు తీయించుకోబోయి ఆమె కూడా చనిపోతుంది. భార్యలిద్దరూ చనిపోతారు. ఇంత జరుగుతున్నా జానయ్యకు జార్జిమీద విశ్వాసం సడలదు. అతడు తనకు మంచి మిత్రుడనే నమ్ముతాడు. అతడి సలహాలనే పాటిస్తాడు. దైవభక్తి, దేశభక్తి జార్జికి మెండుగా ఉన్నాయని అందువల్ల అతడిని నమ్మవలసిందేనని అనుకుంటాడు. ఒక స్వతంత్రుడైన వ్యక్తిని ఈ దోపిడీ వ్యవస్థ పరాధీనుడిగా ఎలా మార్చివేస్తుందో నవలలో అద్భుతంగా వివరించాడు రచయిత. పాలకవర్గం మీద, పాలక వర్గ భావజాలం మీద, ముఖ్యంగా మోక్షం పొందాలన్న లక్ష్యం మీద చెక్కు చెదరని విశ్వాసం కష్టజీవులు కలిగి ఉండడం ఈ దోపిడీని ఎంత సులభతరం చేస్తుందో, దోపిడీ పద్ధతులనే సరైనవిగా ఎలా సమర్థిస్తుందో శక్తివంతంగా చిత్రీకరించాడు. చివరిలో జార్జి తనని, తన బిడ్డని తానుంటున్న ఇంటి నుండి, పొలం నుండి ఖాళీ చేయించి వెళ్ల గొట్టాలని చూసినపుడు జానయ్యకి జార్జి అసలు రూపం అర్థమవుతుంది. అతడు తన మిత్రుడు కాదని, శత్రువని తెలుస్తుంది. జార్జి ఆస్థుల్ని, ఫ్యాక్టరీని తగులబెట్టి ఆ మంటల్లో జార్జిని విసిరేస్తాడు. తానూ ఆ మంటలకే ఆహుతైపోతాడు. జానయ్య జీవితం ముగిసింది. మళ్లీ స్వర్గ ద్వారం దగ్గర సైతానుగా నిలిచి దేవుడి తీర్పుకోసం ఎదురు చూస్తూ ఉంటాడు. ఎప్పటికీ తీర్పురాదు. సైతానుకి అసహనం పెరుగుతుంది. వెనక్కి పోదామనుకుని వెనక్కి తిరుగుతాడు. బయలుదేరే ముందు దేవదూత పీటర్‌తో జరిపిన సంభాషణ ఇలా ఉంటుంది.

సైతాన్:"మిత్రమా నేనెక్కడున్నాను? బయలుదేరిన చోటుకి నాలుగడుగులు వెనక్కి"

పీటర్: "నీలో ఇంకా విశ్వాసం చావలేదు".

సైతాన్: "ఏమిటా విశ్వాసం?"

పీటర్: "ముక్తిని ఆశించడం, స్వర్గనరకాల అస్థిత్వం కాపాడబడటం సాధ్యం అనే విశ్వాసం"

ఆ మాటలతో సైతాన్ ఆలోచనలో పడిపోయాడు. రెండు నిమిషాలు మౌనంగా ఉండిపోయాడు. విశ్వాసం... స్వర్గం... నరకం... పీటర్... సైతాన్ అన్నింటికీ మూలం విశ్వాసం.

ఎందుకు? ఏమిటి? -లాంటి ప్రశ్నలకు అవకాశం లేని విశ్వాసం. ఆలోచనలకు అవకాశం ఇవ్వని విశ్వాసం. చెప్పేవాళ్ల ప్రయోజనాలను రక్షించుకునేందుకు వినేవాళ్లపై రుద్దే విశ్వాసం.

విశ్వాసాన్ని తోసేయగలిగితే?

ఈ ఆలోచన తలలో దూరి కాస్త స్థిరపడగానే ఎదురుగా స్వర్గ ద్వారం లేదు, పీటర్ లేడు. సైతాన్ లేదు. ఉంది మానవులు మాత్రమే. జానయ్య లాంటి మూగజీవులు-వారి విశ్వాసాలను సొమ్ము చేసుకునే జార్జిలు -ఇదీ నవల ముగింపు. -కరెంట్ షాక్ లాంటి ఈ ముగింపు నవల స్థాయిని అమాంతం పెంచి వేసింది. దోపిడీ వ్యవస్థను సరైనదేనని విశ్వసించడం, యజమానుల వల్లనే తాము బతుకుతున్నామని విశ్వసించడం, కోర్టులు న్యాయం చెప్తాయని విశ్వసించడం, మోక్ష సాధనే అసలు లక్ష్యమని విశ్వసించడం, పాపం చేసిన వాళ్లు నరకానికి, పుణ్యం చేసినవారు స్వర్గానికి పోతారని విశ్వసించడం. అన్నీ దేవుడే చూసుకుంటాడని, అతడే నిర్ణయిస్తాడని విశ్వసించడం -ఈ విశ్వాసమే దోపిడీ వర్గాల రక్షణకి కంచుకోటలా నిలుస్తున్నదని, రచయిత అద్భుతంగా చూపాడు. అంతే గాదు; తన అనుభవం ద్వారానే జానయ్య జార్జి దోపిడీ స్వభావాన్ని గ్రహించి, తిరగబడి జార్జిని అంతం చేయడాన్ని కూడా చూపాడు.

నవల ఆద్యంతం ఈ దోపిడీ వ్యవస్థను వ్యంగ్యంగా ఎత్తి చూపుతూనే ఉంటుంది. ఒక సందర్భంలో జార్జి, జానయ్యలిద్దరితోనూ మాట్లాడిన పాస్టర్ ఇలా ఆలోచించాడు : "ఒకడు తానే సైతాన్‌నని నమ్ముతూ మామూలు మనిషిలా జీవిస్తున్నాడు. ఇంకొకడు తాను మనిషినని నమ్ముతూ సైతాన్‌లా జీవిస్తున్నాడు. వారి విశ్వాసంలోనైనా దోషం ఉండాలి. లేదా వారి జీవన విధానంలోనైనా దోషం ఉండాలి. అందరూ మంచిగా జీవించేలా భగవంతుడు ఎందుకు చేయడు? ఇంతకాలం ఎందుకు ఉపేక్షించాడు?" ప్రజలందరికీ దేవుడిమీద విశ్వాసాన్ని పెంపొందించే వృత్తిలో నిరంతరం ఉండే ఒక మతాధికారికే వచ్చిన సందేహం ఇది.

కేవలం కథకోసం ఈ నవల చదివితే అసంతృప్తి కలుగుతుంది. అలాగాక నవలలో వివిధ సంఘటనల సందర్భంగా ఆయా పాత్రల చేత వలికించిన సంభాషణల్ని, వాటి ద్వారా వ్యక్తమైన భావాల్ని చూస్తేనే ఈ నవల గొప్పదనం బోధపడుతుంది. ఈ సంభాషణల్లో ఎక్కువ భాగం తరచు మన చుట్టూ వినబడేవేనని, వాటిని మనం వర్గ దృష్టితో గమనించనందువల్ల వాటి ప్రాధాన్యతను గమనించలేకపోతున్నామని బోధపడుతుంది. గుడ్డి విశ్వాసం చుట్టూ అల్లిన దోపిడీ వర్గాల వాదనలను శక్తివంతంగా పటాపంచలు చేసిన రచయిత నైపుణ్యం విదితమౌతుంది.

★

కవిత్వమ్

కవి హృదయం

కవిత పాఠం మరో కవికే తప్ప
సగటు మనిషికి అర్థం కాదన్నది ఓ వాదన
పదాడంబరంతోనో ఆవేశ పారవశ్యంతోనో
వక్రగర్భితంగా చెప్పకుపోతుంటాడు కవి
నేరుగా చెబితే కవిత్వం కాదంటాడు
అది ఏ సగటు శ్రోతకీ అర్థం కాని పరిస్థితి!
స్తబ్దత ఉన్నంతసేపూ నేను తల గోక్కుంటూ
కాగితంతో కుస్తీ పడుతూనే ఉంటాను
అర్థం కాని వాక్యానికి అద్దంలో ప్రతిబింబం వెతుకుతూ
అర్థం కానిదే కవిత్వమేమోనని గొణుక్కుంటాను

టీవీ ఛానెళ్లు ప్రభవించి, విజృంభించాక
చదివే శ్రమ తగ్గిందంటూ సరదా పడ్డవాడే కానీ
చదివి తరించేవాడు లేకుండా పోయాడు
చదివించగలిగే స్థాయి కవిత్వానికి లేదా
రాయగలిగే భాష కలానికి వంటబట్టలేదా అని తర్కించుకుంటాను
ఇప్పుడు వాణ్ణి చెంపమీద కొట్టో, హిప్నటిజం చేసో
టీవీ ఛానల్ ముందు నుంచి బయటకు లాగి,
చదివించగలిగే స్థాయి నీ కవితకు కలగాలి
చుట్టలు చుట్టేవాడు కూడా నీ కవితలోని ఆల్కెమీకి
ఆనందించగలగాలి
బాలీవుడ్ పాటకున్న క్రేజ్ నీ కవితకు ఉండాలంటే
నేరుగా పాఠకుడిలో పరకాయ ప్రవేశం చేసి
ప్రతిరోజు జ్ఞాపకం చేసుకునే డైరీలోని పేజీలా
అక్షరం మనసు తోటను హత్తుకోవాలి
స్నేహసౌరభంలా గుబాళించి ముమ్ముందుకు సాగిపోవాలి.

- పెంటకోట లక్ష్మీనారాయణ

ఓ చింతా



ఓ చింతా నీవు
నాచెంత లేకుంటే
కలదు నాకు మదిలో చింత
చిన్న విత్తుతో నీవు
కొండంత అవుతావు
నీలేలేత చిగురు
తింటూ నా మదిలో
కలుగు ఎంతో పులకింత
నీ చింతకాయ చూడగానే
నా నోటిలో ఊరట
తెంచి తిందామని
కొరికితే నోరంతా ఒగరేగా
ఇక నీచింత పండు
చిన్న పడుచు, పెద్దలకు
ప్రతిరోజూ కనువిందు
పంచభక్ష పరమాన్న
భోజనాలైనా నీ
చింత పులుసు తరువాతేగా
పరమాన్న భోజనమున
నీ చింతపులుసును
జిహ్వకు అందిస్తుంటే
దేవతలకు అమృతం
వలె కనిపించును కదా
ఓ చింతా అంతేనా
మానవ జంతు జాలానికి
నీడనిచ్చి రక్షించే
మంచి గీముని కదా
ఓ చింతా నీ జననం
వందల సంవత్సరాలు
న సంపద తరగని కామధేనువు
నీ పుల్లదనం దేవతల అమృతం
మరి ఓ చింతా నీవు
నా చెంత ఎల్లవేళలా ఉంటావుకదు

- ఉండ్రాల రాజేశం

ఆనవాలు తెలిశాక...

పైకి కనిపించనిదేదీ రహస్యం కాదు
బయటికి కనిపించిందంతా నిజం కాదు
అంతరంగాన్ని స్పృశిస్తూ
మూలమూలలనూ తడుముతూ
అవిశ్రాంతంగా చేస్తున్న ప్రయత్నమే
నిజమైన ప్రయాణం
మాటల మధ్య మౌనం మధ్య
ఊహల మధ్య చేతల మధ్య
కదిలిపోయే దృశ్యాలన్నీ వాస్తవం కాదు
సందర్భానికి తగినట్టుగా
సన్నివేశం రూపుకట్టే విధంగా
లోలోపల మనసులోపట
నిరంతరం సాగించే సంభాషణ
కొత్త దృశ్యం పుట్టుకకు కారణమవుతుంది
జీవితాన్ని రెండు చేతులుగా జోడించి
కాలానికి నమస్కరిస్తుంటే
తడితడిగా తగిలే జ్ఞాపకాలు
పొడిపొడిగా రాలిపడే అనుభవాల దొంతర్లు
సంభాషణాత్మకంగా రాటుదేలి
ఆద్యంతాల నడుమ శ్వాసిస్తుంటే
గాలి మబ్బుల్లాంటి ఊహల
శూన్యంలో తేలిపోతూ
అనుభూతులుగా విచ్చుకుంటాయి

జీవితాన్ని నిట్టూర్చి శ్వాసించడం
ఇవాల్టి మనిషి జన్మహక్కు
స్వాగతించి అక్కున చేర్చుకోవడం
ఈనాటి వారసత్వపు కల
బహుశా
ఈ కోర్కెల రెక్కల ప్రపంచంలో
మనిషి కొన్ని సమూహాలుగా విడిపోవడమంటే
అందనంత దూరాలకు
ఆశల గుర్రాలతో దూసుకుపోవడమే!

కడసారి ప్రశ్నకు సమాధానంగా
రహస్యమొక్కటే బింబ ప్రతిబింబంగా
పరుచుకొని
నిశ్శబ్ద దృశ్యంగా ముడుచుకుపోయింది!

- మానాపురం రాజా చంద్రశేఖర్

పసందైన పనసపండు



తల్లి గరగరా, తండ్రి పీచుపీచు, బిడ్డలు రత్నమాణిక్యాలు. ఏంటో చెప్పుకోండి చూద్దాం. అదేనండి... పైన గరుకుగా, లోపల పీచుపీచుగా దానిలో మనకిష్టమైన తియ్యని తొనలు, వాటి లోపల రుచికరమైన గింజలు ఉండే పనసపండు. మరి ఇవాళ పనసలోని ఔషధ విలువలు, వంటలో దాని స్థానమేంటో చూద్దాం.

పనస మల్బరీ కుటుంబానికి చెందిన చెట్టు. తూర్పు ఆసియా దీని జన్మస్థలం. ప్రపంచంలోనే అతి పెద్ద పండును ఇచ్చే చెట్టు ఇదే. దాదాపు ఒక్కోటి 36 కేజీలుంటుంది. 90 సెంటీమీటర్ల పొడవు, 50 సెంటీమీటర్ల వ్యాసం కలిగి ఉంటాయి. పనసపండును కోసేప్పుడు చాకుకు, చేతులకు నూనె రాసుకోవడం మంచిది. దీనివల్ల దాని జిగురు చేతులకు అంటదు.

ఔషధ విలువలు

పనసలో విటమిన్లు, ఖనిజాలు ఎక్కువగా ఉండడం వల్ల మంచి ఆరోగ్యాన్నిస్తుంది. దానిలోని యాంటీఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్స్ క్యాన్సర్ వ్యాధిని నిరోధిస్తాయి. అజీర్తి, అల్సర్లను కూడా నయం చేస్తుంది. పొటాషియం మెండుగా లభించడం వల్ల అది రక్తపోటును తగ్గిస్తుంది. పనస ఆకులు, మొక్క జొన్న, కొబ్బరి చిప్పలను కాల్చి చేసిన పొడి పుండ్లను నయం చేయడానికి ఉపయోగిస్తారు. పనస ఆకులను వేడి చేసి గాయాల మీద పెట్టుకుంటే త్వరగా ఉపశమనం లభిస్తుంది. చర్మవ్యాధులు, ఆస్తమా, జ్వరం, డయేరియా నివారణకు పనస వేర్లు ఉపయోగపడతాయి. అధిక బరువును, టెన్షన్‌ను, మలబద్ధకాన్ని తగ్గిస్తుంది.

పనస రకాలు

మన దేశంలో రెండు రకాల పనసను పండిస్తారు. ఒకటి కూజా చక్క. దీనిలో చిన్న చిన్న తొనలుంటాయి. అవి చాలా తియ్యగా, పీచుగా ఉంటాయి. అవి మృదువుగా ఉండడం వల్ల అందులోని తొనలను వలవడానికి చాకు వంటి పరికరాల అవసరం లేదు. వీటిని బార్కా, బెర్కా అని కూడా అంటారు. రెండవది కూజా పాజమ్. ఇవి వాణిజ్య పరంగా ముఖ్యమైనవి. వీటిలో తొనలు పెళుసుగా ఉంటాయి. వీటిని వలవడానికి చాకును తప్పకుండా ఉపయోగించాలి. వీటిని కప, కపియా అని అంటారు.

పనస కాయలు పండిన తరువాత త్వరగా పాడవుతాయి. అయితే వీటిని 11 నుండి 13 డిగ్రీల ఉష్ణోగ్రత దగ్గర నిల్వ ఉంచితే 3 నుండి 6 వారాల వరకు ఉంటాయి. పచ్చివాటిని ముక్కలుగా కోసి బాగా ఎండబెడతారు. వాటిని డబ్బాల్లో వేసుకుని సంవత్సరమంతా ఉపయోగించుకుంటారు.

ఎన్నిరకాలుగా తినొచ్చో...

పనసను పచ్చిగానైనా, పండుగానైనా తినొచ్చు. దీని కండ గంజి గంజిగా, పీచు పీచుగా ఉండి పథ్యానికి బాగా పనికివస్తుంది. పనసపండులోని తొనలను నేరుగా తినొచ్చు. లేదా వాటిని కొబ్బరిపాలతో ఉడకబెట్టి కూడా తినొచ్చు. వాటితో ఐస్‌క్రీమ్, పచ్చడి, జామ్, జెల్లీ కూడా చేసుకోవచ్చు. ఇంకా పనస తొనలను తేనెతో కలిపి తినొచ్చు.

దక్షిణ భారతదేశంలో మామిడి, అరటి తరువాత ఎక్కువగా ఉపయోగించేది పనస. వీరు పనసకాయలను వంటల్లో ఎక్కువగా ఉపయోగిస్తారు. పనసకాయ పైతొక్క తీసి లోపలి భాగాన్ని చిన్న చిన్న ముక్కలుగా కోసి కూర చేస్తారు. దీన్ని పనస పొట్టు కూర అంటారు. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, ఇండోనేషియా, కంబోడియా, వియత్నాం దేశాలవారు పనసను వంటల్లో విరివిగా వాడతారు. కొందరు దీన్ని ప్రధానమైన వంటగా చేసుకుంటారు. అయితే పచ్చిగా ఉన్నప్పుడు మనం నేరుగా తినలేం. దాని రుచి వెగటుగా మాంసంలా ఉంటుంది. అందుకే దీన్ని 'శాఖాహార మాంసం' అంటారు. పనస గింజలను వేయించి లేదా ఉడకబెట్టి తింటారు. అవి పల్లీల రుచిని కలిగి ఉంటాయి. బెంగుళూరులో పనసతో అప్పడాలు, చిప్స్ చేసుకుంటారు.

ఎప్పుడు కాస్తాయి?

వాతావరణాన్ని బట్టి ఒక్కో ప్రాంతంలో ఒక్కో సమయంలో పక్వానికి వస్తాయి. కొన్ని చోట్ల మార్చి నుండి జూన్ మధ్యలో, మరి కొన్ని చోట్ల ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మధ్యలో, ఇంకొన్ని చోట్ల జూన్ నుండి ఆగస్టు మధ్యలో అవి కాస్తాయి. వెస్ట్ ఇండీస్‌లో జూన్‌లోనూ, ఫ్లోరిడాలో వేసవి చివరిలోనూ వస్తాయి.

ఇతర ఉపయోగాలు

పనస పండే కాదు ఆ చెట్టులోని అన్ని భాగాలూ మనకు ఉపయోగపడేవే. పనస కలపతో మృదంగం, కంజీర వంటి సంగీత పరికరాలను తయారు చేస్తారు. ఫర్నిచర్, తలుపులు, కిటికీలు వంటి గృహోపకరణాల తయారీలోనూ ఉపయోగిస్తారు. ఫిలిప్పైన్స్‌లో కుతియాపి అనే పడవ భాగాలను కూడా తయారు చేస్తారు. పనస ఆకులను, పండ్లను పశువులకు మేతగా వేస్తారు. మనదేశంలో పనసాకులను వంటల్లో ఉపయోగిస్తారు. వీటిని ఇస్తరాకులుగా కూడా ఉపయోగిస్తారు. పనస జిగురును పింగాణి పాత్రలకు, బకెట్‌లకు పడిన చిల్లులను మూయడానికి ఉపయోగిస్తారు. దీన్ని వార్నిష్‌లలో కూడా ఉపయోగిస్తారు. పనస చెట్టు వేర్లను చెక్కి ఫొటో ఫ్రేములు తయారు చేస్తారు. కొన్ని ఉత్సవాల్లో ఎండిన పనస కొమ్మలను రాకుతూ నిప్పును పుట్టిస్తారు. బౌద్ధ సన్యాసుల దుస్తులకు పనస బెరడుతో తయారు చేసిన డై వేస్తారు. ★

చక్కకురు-మంగ కరీ

పనసగింజలు, పచ్చి మామిడి కాయలతో కలిపి పనసతో కేరళవాసులు ఒక రుచికరమైన కూర (చక్కకురు-మంగ కరీ)ను చేసుకుంటారు.

కావలసిన వస్తువులు

మామిడి కాయ - 1,
పనస గింజలు-2 కప్పులు,
పచ్చి మిర్చి-2,
కారం- ముప్పావు స్పూను,
పసుపు - పావు స్పూను,
చిలికిన పెరుగు-పావు కప్పు,
ఆవాలు- 1 స్పూను,
ఉల్లిగడ్డలు- 2
కరివేపాకు - 1 రెమ్మ
పచ్చి కొబ్బరి ముద్ద - ముప్పావు కప్పు,
ఎండుమిరపకాయలు - 2,
నూనె - సరిపడినంత,
ఉప్పు, - తగినంత

తయారు చేసే పద్ధతి

ముందుగా ఒక గిన్నెలో శుభ్రంగా కడిగిన పనస గింజలు, 1 కప్పు నీరు, పచ్చిమిర్చిముక్కలు, ఉప్పు వేసుకుని పొయ్యి మీద పెట్టాలి. అవి సగం ఉడికిన తరువాత మామిడి ముక్కలు, పసుపు, కారం కూడా అందులో వేసి మెత్తగా ఉడకనివ్వాలి. ఇప్పుడు దానిలో కొబ్బరి ముద్దను వేసి బాగా కలపాలి. తరువాత పెరుగు (పులుపు ఎక్కువగా కావాలనుకుంటే) వేసి సిమ్‌లో మరో రెండు నిమిషాలు ఉడకనివ్వాలి. ఇప్పుడు దాన్ని దించి పక్కన పెట్టుకోవాలి. తరువాత ఒక పాన్‌లో నూనె వేసి కాగనివ్వాలి. ఆవాలు, ఎండు మిరపకాయలు, కరివేపాకు వేసి ఎర్రగా వేయించాలి. ఇప్పుడు దీనిలో ముందుగా ఉడకబెట్టిన మిశ్రమాన్ని వేసుకోవాలి. దీన్ని అన్నంలో తింటే చాలా రుచిగా ఉంటుంది.

వియత్నాం గెరిల్లా

సీరియల్



18వ భాగం

జరిగినకథ:

హోవ్ తన పిల్లల గురించి తెలుసుకోమని స్నేహితులను కోరుతుంది. నిద్రలో కూడా వారిని గురించే కలవరిస్తుండేది. తొత్తులు పిల్లలకు ఏవేవో చెప్పి భయపెడుతుండేవారు. ఒక్కోసారి కొట్టేవారు కూడా. అది తెలిసిన హోవ్ చాలా కుమిలిపోయేది. ఇక భరించలేక పిల్లలను విడిచిపెట్టినా, చంపినా ఫర్వాలేదు కాని కొట్టొద్దని, తను మాత్రం లొంగనని తొత్తులకు ఉత్తరం రాస్తుంది. కానీ ఆ పని చేసినందుకు హోవ్ చాలా బాధపడుతుంది. ఆ ఉత్తరం ఒక సైనికుని భార్య ద్వారా కమిటీవాళ్లకు చేరుతుంది. ఇది తెలిసిన డువాంగ్ ఎందుకీ పని చేశావని, ఇలా చేయడం వల్ల దళంలో పనిచేస్తున్నట్టు ఒప్పుకున్నట్టే కదా అని విచారిస్తుంది. ఆమె హోవ్ బాధను పై కమిటీ వారికి చెప్తుంది. పిల్లలను కాపాడడమొక్కటే మార్గమని వారికి తెలియజేస్తుంది. అందుకు కమిటీవారు గెరిల్లాల సహాయం కోరతారు. సైనికులు తమ కోసం రొయ్యలను కొనుక్కురావడానికి అప్పుడప్పుడు పిల్లలను బయటికి పంపించేవారు. అలా రొయ్యలకోసం వచ్చినప్పుడు గెరిల్లాలు సైనికుల కంటపడకుండా పిల్లలను ఎత్తుకుపోతారు. ఈ విషయం హోవ్‌కు చెప్పగానే ఎంతో సంతోషిస్తుంది. వెంటనే పిల్లల దగ్గరకెళ్లి వారిని తన హృదయానికి హత్తుకుంటుంది. హోవ్ వారిని హాయ్ వాళ్ల ఇంటికి తీసుకెళ్తుంది. ఆ తర్వాత...

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

హాయ్ దంపతుల సంతోషానికి మేరలేక పోయింది. వంట చేయడం కోసం హడావుడిగా ఇంట్లోకి వెళ్లింది. వాళ్ళిద్దరినీ విడిచిపెట్టి వుండలేకపోయాను. ఇద్దరికీ స్నానం చేయించాను. హాయ్ పిల్లల బట్టలను మార్చింది. అన్నం తినేప్పుడు నేను తినకుండా వాళ్లు తింటుంటే చూస్తూ ప్లేట్ ముందు కూర్చున్నాను. పలురకాల వంటలు. వాళ్లేమో ఆకలిగొని వున్నారు. థై నెమ్మదిగా తిన్నది కానీ, బాబు మాత్రం ఆవురావురుమంటూ తిన్నాడు. అది చూస్తున్న నాకు కళ్లలో నీళ్ల తిరిగాయి. వాళ్లు నా పిల్లలని మాత్రం కాదు. ఆకలిగొన్న పిల్లలను చూస్తే నేను చాలా బాధపడిపోతాను. పెద్దవాళ్లయితే ఆకలికి తట్టుకుంటారు కానీ, పిల్లలైతే అన్నం పెట్టమని గోల చేస్తారు. గత మూడు నెలల్లో అన్నం కోసం పిల్లలు ఏడ్చి వుంటారు. ఇప్పుడు ఆకలితో వాళ్లు తింటుంటే నాకు ఏడుపు వచ్చింది. వాళ్ల భోజనం చేసివచ్చి నా పక్కన నిలబడ్డారు. చెరొక చేయి పట్టుకున్నారు. నేను ఏడవడం చూసి వాళ్లూ ఏడవసాగారు. ఆశ్చర్యంతో చాలాసేపు నేను అలానే నిలబడిపోయాను.

"ఇంక ఏడ్వకండి. ఇంకెప్పుడూ మిమ్మల్ని బాధపడనివ్వను" అని ఓదార్చాను.

నా మాటలు వాస్తవ రూపం దాల్చసాగాయి. ఇప్పుడు పరిస్థితిలో అనేక గొప్ప మార్పులు వచ్చాయి. ఉత్తరాన డీన్‌బిన్‌ఫూపైన దాడి జరుగుతోంది. దక్షిణాన శిబిరాలను ఒకదాని తర్వాత ఒకటి శత్రువు ఎత్తివేస్తున్నాడు. మేమున్న ప్రాంతంలో గెరిల్లా వుద్యమం ప్రారంభమైంది. చిన్న పెద్ద శత్రు క్యాంపులను తుడిచిపెట్టాం. శత్రువు ఆక్రమించిన అనేక గ్రామాలు తిరిగి గెరిల్లాల స్వాధీనమయ్యాయి. హేప్‌లాంగ్, హేప్‌లో ప్రాంతాలలో సగం గెరిల్లాల స్వాధీనంలోకి వచ్చాయి.

డీన్‌బీన్‌ఫూ యుద్ధం ముగిసింది. శాంతి పత్రంపై సంతకాలు జరిగాయి. మా ప్రాంతంలో లాంగ్‌హేంగ్ క్యాంపును అయిదు రోజులపాటు చుట్టుముట్టి యుద్ధ విరమణకు నాలుగు గంటల ముందుగా గెరిల్లాలు ఆక్రమించుకున్నారు. యుద్ధ విరమణ ఒడంబడిక అమలులోకి వచ్చినందువల్ల హేప్‌లో ప్రాంతంలోకి ఇతర శత్రు క్యాంపుల జోలికి మేం పోలేదు.

విజయం సాధించాం. నాకు సంతోషంగానే వుందిగానీ, ఒంటరితనంతో చాలా బాధపడుతున్నాను. పోరాట సమయంలో అనేక మంది దగ్గరబంధువులు వెళ్లిపోయారు. తిరిగి రాలేదు.

ఒక్కొక్కప్పుడు సంతోషం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేది. మళ్లీ మరి కొద్ది సేపటిలోనే ఎంతో బాధపడేదాన్ని. పాత రోజులు జ్ఞప్తికి వచ్చేవి. ఆ విధమైన పరిస్థితి నువ్వు అనుభవించావేమో నాకైతే తెలియదు కానీ, నేను మాత్రం తరచు అనుభవిస్తూ వుండేదాన్ని.

సంతోషంతోపాటు, ఆందోళన, ఒంటరితనం నన్ను వెంటాడేవి. యుద్ధంలో విజయంవల్ల దేశంలో మొత్తం పరిస్థితి మారిపోయింది. దానితోపాటు నా జీవితంలోనూ పూర్తి మార్పు వచ్చింది. శాంతి ఏర్పడిన నెలరోజుల తర్వాత విదేశాలలో విద్యనభ్యసించటానికి పిల్లలకు అర్హత ఇచ్చినట్టుగా నాకు వుత్తరం వచ్చింది. ఆ అర్హత ఏంటో నాకు అర్థం కాలేదు. నా భర్త చనిపోవడం వల్ల బహుశా ఇది వచ్చిందేమోననుకున్నాను. పిల్లల భవిష్యత్తును గురించి ఆలోచించగానే నా హృదయం ఉప్పొంగింది. అయితే అది మెరుపులాగే వుంది. పిల్లలు నన్ను విడిచివెళ్లిపోతారు అన్న ఆలోచన నన్ను ఆందోళన పరిచింది.

ఏమీ తోచని పరిస్థితి. ముందు రోజుల్లో పిల్లలకు చాలా దూరంగా ఒంటరిగా నేను ఎలా వుండగలను? ఇప్పటి వరకూ పిల్లల్ని విడిచి ఎన్నడూ మూడు నెలలకు మించి వుండలేదు. అంతమాత్రానికే నేను ఎంత బాధపడ్డానో చెప్పలేను. ఇప్పుడు వాళ్లు వెళ్లినట్టయితే వేలకొలది కిలోమీటర్ల దూరంలో రెండు సంవత్సరాలపాటు వాళ్లను విడిచి వుండవలసి వస్తుంది. అంతకాలం ఎడబాటు భరించగల ధైర్యం నాకుందని చెప్పలేను. చివరకు వాళ్లను పంపించకూడదని నిర్ణయించుకున్నాను.

"నేను అనాథను. పిల్లలను విడిచి వుండలేను. వాళ్ల బదులు ఇతరులను పంపించండి" అని పార్టీ జిల్లా కమిటీకి ఉత్తరం రాయడం మొదలుపెట్టాను.

అంత తేలికగా ఈ ఉత్తరం రాశానని అనుకోవద్దు. అనేక సార్లు దానిని చింపేశాను. తిరిగి ఆలోచించాను. మళ్లీ రాశాను.

"అమ్మా! ఏంటి రాస్తున్నావు?" అని

పిల్లలిద్దరూ అడిగారు. ఉత్తరం రాస్తున్నప్పుడు వాళ్ల వంక చూసి, మీ గురించే రాస్తున్నా అని లోన అనుకున్నాను. వాళ్లనుంచి దూరంగా ఉండవలసి వస్తుందని ఒక పక్క బాధ, వాళ్ల భవిష్యత్తును గురించి మరొక పక్క భయం. చివరకు రాసిన ఉత్తరం చించేసి కలం అవతల పెట్టాను. వణుకుతున్న చేతులతో వాళ్లను కౌగిలించుకున్నాను.

"అమ్మా! విషయమేంటి?" అని ధై అడిగింది. సమాధానం చెప్పక తప్పిందికాదు. 'ఏమీలేదు' అన్నా. కొంచెం సేపు బయటికిపోయి ఆడుకోండి అని చెప్పా. అందుకు సంతోషంగా చేతులు పట్టుకుని బయటికి వెళ్లిపోయారు. ఒంటరిగా మంచంపై పడుకుని అటూ ఇటూ దొర్లాను. ఏమీ తోచడం లేదు. సముద్రపు అలల ఘోష వినపడుతోంది. అటువంటి ప్రశాంత సమయంలో ఆ అలల ఘోష రాబోయే ఒంటరితనాన్ని గురించి ముందుగానే హెచ్చరిస్తున్నట్లుగావుంది. అది తలచుకోగానే భయంతో శరీరం జలదరించింది. అటువంటి పరిస్థితిలో నేను మామూలుగా డువాంగ్‌ను గుర్తుకు తెచ్చుకుంటాను. పాత కథల్లో చెప్పే మోహినిలా నాకు ఆమె తోస్తూ వుంటుంది. ఎప్పుడు కష్టమొచ్చినా వాటిని అధిగమించడానికి ఆమె తోడ్పడేది.

ఏమీ తోచని పరిస్థితిలో ఆమె ఇంటికి వెళ్లాను. ఆమె ఏదో పనిలో మునిగి వుంది. అయినా ఆమె ఎప్పుడూ నవ్వుతూ ఉత్సాహంగా వున్నట్లు కనపడేది. నన్ను చూడగానే "ఎంత అదృష్టవంతురాలను. వెతకబోయిన వస్తువు కాలికి తగిలినట్లు నీ కోసం వద్దామనుకుంటుంటే నువ్వే వచ్చావు" అన్నది.

"ఎందుకు?"

డువాంగ్ నా వంక చూసి "వెళ్లడానికి నీకు ఇష్టమేనా?" అని అడిగింది.

"ఎక్కడికి వెళ్లాలి? ఉత్తర ప్రాంతంలో మళ్లీ దళంలో చేరడానికా?"

"అవును"

"అక్కడికి పోయి నేను చేసేదేముంది?"

డువాంగ్ తన వేళ్లు లేని చేతితో నా చెయ్యి పట్టుకుని, అసలు సంగతి విను. "మొదట్లో నువ్వు ఇక్కడే వుండాలని నిర్ణయించారు. ఇక్కడ వుండడం నీకు ఉపయోగకరం కాదని మన కామ్రేడ్స్ తర్వాత భావించారు. ఇప్పటి వరకు శత్రువు నిన్ను కనిపెట్టి ఉంటున్నాడు. అందువల్ల నిన్ను శాంతంగా వుండనివ్వడు. పైగా పిల్లలు నిన్ను విడిచి దూరంగా వుండడం కష్టం. నువ్వూ చాలా బాధపడతావు. మరొక కారణమేమిటంటే నీలో ఒక ప్రత్యేకత వుంది. ఉత్తర ప్రాంతంలో ఆ ప్రత్యేకత అవసరం ఎక్కువగా వుంది. అందువల్ల పార్టీ జిల్లా కమిటీ మంచి చెడ్డలన్నీ ఆలోచించి నిన్ను పంపించడం మంచిదనే అభిప్రాయానికి వచ్చింది. అదే సరియైనదని నేనూ అభిప్రాయపడుతున్నాను. నువ్వు ఇక్కడి నుండి వెళ్తున్నందుకు విచారంగా వుంది" అని చెప్పింది చివరకు. నేను సమాధానం చెప్పలేదు. అనుకోకుండా నేను వెళ్లే విషయం చెప్పింది. ఇక్కడ నుండి వెళ్లాలనిగానీ, వెళ్తాననిగానీ ఎన్నడూ అనుకోలేదు. ఏమైనప్పటికీ పిల్లల నుండి దూరమవుతున్నానని భయపడుతున్న సమయంలో ఈ వార్త వల్ల మళ్లీ పిల్లలతో కలిసి వుండే అవకాశం ఉన్నట్లుగా తోచింది. పిల్లలకు దూరం అవుతానన్న భయం తొలగిపోయింది. కానీ నేను చాలా వ్యాకులపాటు చెందాను. ఆ సమయంలో నా మనసు నిలకడగా లేదు. అనుకోని సంఘటనలు జరుగుతూ వుండడంతో ఆ విధంగా ఉండడం కూడా సహజమే. ఇక్కడే వుండాలని నిర్ణయించుకుని తగిన ఏర్పాటు చేసుకున్నాను. ఏవిధంగా వుండాలో కూడా నిర్ణయించుకున్నాను. కానీ ఇప్పుడు అన్నీ తలకిందులయ్యాయి. అటువంటప్పుడు నా మనసు స్థిమితంగా ఎలా వుంటుంది?

పార్టీ నిర్ణయంలో ఇంక మార్పులేదు. నేను ఉత్తర ప్రాంతం వెళ్లాలని నిర్ణయం అయింది.

బాబు, పాప ముందు వెళ్లిపోతారు. నేను మాత్రం కొద్ది కాలం ఆగవలసి వచ్చింది. పిల్లల ప్రయాణానికి ఏర్పాట్లు చేయవలసి వుంది. ఉత్తర ప్రాంతంలోని చలికాలం పరిస్థితి గుర్తుకు రాగానే భయమేసింది. నా దగ్గర ఎక్కువ డబ్బు కూడా లేదు. ప్రతిఘటన పోరాటం అయిపోయిన తర్వాత చిన్న గుడిసె, కొన్ని ఎకరాల మల్బరీ చెట్లు మాత్రం నాకు వచ్చాయి. వీటన్నింటినీ అమ్మితే మూడు వందల రూపాయలు వచ్చాయి. పిల్లలకు కావల్సినవన్నీ కొన్న తర్వాత నా దగ్గర వంద రూపాయలు మిగిలాయి. ప్రధాన విషయమేమింటే పిల్లలకు పూర్తిగా డ్రెస్ వుండాలి. నా విషయమంటావా ఎలాగైనా జరుపుకుంటాను.

పిల్లలు ప్రయాణమై వెళ్లే రోజు రాత్రి ఎంతో హాయిగా వుంది! ఆ రాత్రంతా కూర్చునే వున్నారు. పిల్లరిద్దరూ నా చేతులు పట్టుకు కూర్చున్నారు. బాబు ఏడ్వకుండా నన్ను ముద్దుపెట్టుకుని నిద్రపోయాడు. కానీ ధై ఏడుస్తూనే ఉంది. అయితే పెద్దగా ఏడ్వలేదు. నా రొమ్ములపై తల పెట్టుకుని ఏడుస్తూనే వుంది. ఆ కన్నీళ్లకు నా జాకెట్ తడిచిపోయింది. నా నుండి విడిపోయినప్పుడు ఒకటి రెండు సార్లు కష్టాలు అనుభవించింది. అది గుర్తుంది. అందుకని ఏమీ అనలేకపోయాను. అయితే ఆమె ఏడుపు నన్ను భయపెట్టింది. ఆ వయసుగల పిల్లలు ఏడ్వడం అరుదు. తొమ్మిది సంవత్సరాల వయసే. అయినప్పటికీ ఆ వయసుకంటే మించిన దానిలా కన్పిస్తుంది. పోయి పడుకోమని చెప్పినా, ఆ రాత్రంతా మేల్కొనే వుంది.

"అమ్మా! నువ్వు కూడా వస్తానంటున్నావు. కానీ నువ్వురావు. బాబుతో కూడా నన్ను పంపుతావు" అన్నది చివరకు. ఆమె మాటలు నన్ను భయపెట్టాయి. వాస్తవానికి భర్తపోయిన తర్వాత నాకున్న ఆశ వాళ్లిద్దరే. నేను విప్లవ కార్యక్రమంలో పాల్గొనడం వల్ల వాళ్లు కష్టాలు అనుభవించవలసి వచ్చింది. ఇది వాళ్ల బాగుకోరేగా! వాళ్లనుండి దూరంగా వుండడం అంటే నాకు భయమేసింది. ఇప్పుడు నేను కూడా వెళ్తున్నాను. కానీ నేను వస్తానని పాపకు నమ్మకం లేదు. పాప ముఖం పైకెత్తి చేతిరుమాలుతో ఆమె కళ్లు తుడిచి...

"మీరు వెళ్లే ఓడలో నేను రానని చెప్పాను. రెండో ఓడలో వస్తాను. వివరంగా చెప్పినా నువ్వు ఏడుస్తూనే వున్నావ్. నీతో ఎప్పుడైనా అబద్ధం చెప్పానా?" అన్నాను గంభీరంగా. ఎంత గారాబంగా వుంటానో ఇప్పుడు అంత కఠినంగా మాట్లాడాను. నా మాటల్లోని తీవ్రతనుబట్టి నేను బాధపడుతున్నట్లు ధై అర్థం చేసుకుంది. తన మూలంగా నాకు కోపం రావడం పాపకు ఇష్టముండేది కాదు. అందుకని ఏడుపుమాని, పోయి మంచంమీద పడుకుంది. కళ్లు మాత్రం తెరుచుకునే వుంది.

పిల్లలు వెళ్లిపోయారు. చివరి ఓడలో వెళ్లడానికి సిద్ధమయ్యాను. వెళ్లిపోతున్న ఆ సమయంలో నేను పడిన ఆందోళన వర్ణించలేను. సాయంత్రం కాగానే వార్పు దగ్గరకు ప్రయాణమయ్యాను. నాకు వీడ్కోలు చెప్పడానికి అనేకమంది స్నేహితులు, పరిచయస్తులు అక్కడకు వచ్చారు. హీప్‌మీ, హీప్‌లో ప్రాంతాలనుండి కూడా చాలా మంది వచ్చారు. శత్రు సైనికుల భార్యలు కూడా కొంతమంది వచ్చిన వారిలో వున్నారు. కొంతమంది చంటిపిల్లలను ఎత్తుకుని వున్నారు. కొంతమంది పిల్లల్ని నడిపించుకుని వచ్చారు. "నిన్ను సాగనంపడానికి వచ్చాం. అక్కడకు వెళ్లిన తర్వాత మమ్మల్ని మర్చిపోకు. రెండు సంవత్సరాల తర్వాత తిరిగి వచ్చెయ్" అన్నారు వాళ్లు. ఆ మాటలు వింటుంటే నా కళ్లలో ఆనందభాష్పాలు నిండాయి. గత పది సంవత్సరాలుగా మేమందరం కలిసి వున్నాం. ఒకప్పుడు మల్బరీ తోటల్లోనూ, మరొకప్పుడు పురిటి సమయంలోనూ మంచం పక్కన కాలం గడిపాం. వాళ్ల కష్టసుఖాలు నాకు తెలుసు. చేతుల్లో వున్న పిల్లల్ని, నడిపిస్తున్న పిల్లల్ని పుట్టినప్పటినుండి నేను ఎరుగుదును. ఈ ప్రపంచంలోకి అడుగు పెట్టినప్పుడు ఏ విధంగా ఏడ్చిందీ, చిన్ని పెదవులు ఏవిధంగా ఆడించిందీ నాకు గుర్తుంది. వాళ్లలో చాలామంది స్పష్టంగా మాట్లాడగలరు. బాగా నడవగలరు. వాళ్లంతా కలిసి బీచ్‌లో ఆడుకున్నారు. లేడి పిల్లల్లా గంతులు వేశారు. సంతోషంతో కేరింతలు కొట్టేవారు. అందరినీ విడిచివెళ్తున్నాన్న బాధ ఒక పక్కవున్నా, ఆ సమయంలో ఎంతో ఆనందం కూడా పొందాను. మంత్రసాని పని విడిచిపెట్టి జీవితంలో మరొక పని చేయకూడదని నాలో నేను నిర్ణయించుకున్నాను.

బీచ్ చివర పడవ నిలబెట్టి వుంది. పిల్లలంతా గుంపుగా అక్కడకు చేరారు.

(ఇంకా వుంది)

క్రైమ్ కథ

సంచిడాక్టర్

"బాగానే ఉంది. నువ్వు పడుకో వైద్యంలో ఉన్నాను కనుక నాకు తప్పదు" అని చెప్పి దొంగచూపులు చూశాడు. రుద్రయ్య దొంగనిద్ర నటించాడు. వెంటనే మళ్లీ తాళం గుత్తి తీసుకుని దేవుని గదిలోని వెండివస్తువులు సంచి నింపేశాడు. ఇదంతా రుద్రయ్య గమనిస్తున్నాడు. ఇదన్నమాట వీడి నాడి చూడడమని మళ్లీ నిద్ర నటించాడు. సంచిడాక్టర్ వెనక్కివచ్చి రుద్రయ్యను తట్టిలేపి "రేయ్ దొరను చూసుకోరా గాబరాపుడుతోంది. నాడి దొరకట్లేదు. మరోరెండు భస్మాలు తెస్తాను" అనిచెప్పి ఇంటికి వెళ్లిపోయాడు.

సంచి నిండా ఏవేవో మాత్రలు, నాటుమందుకు సరిపడా ఇంజక్షన్లు పెట్టుకుని వచ్చే సంచిడాక్టరే ఆ వూరికి పెద్దదిక్కు.

మస్తానయ్యకు జబ్బు చేసింది. వచ్చిచూడమని కబురు అందింది. సంచిడాక్టర్ హడావుడిగా బయల్దేరి ఆ లంకంత కొంపకు చేరాడు.

ఉన్న ఒక్కగానొక్క కొడుకు పెద్దచదువుల కోసం విదేశాలకు పోయాడు. తండ్రిచేస్తున్న గ్రామపెద్దరికాన్ని వదులుకుని ఎప్పుడో తనతో వచ్చేయమన్నాడు. మస్తానయ్యకు గ్రామ పెద్దరికం, పంటల మీద రాబడిని వదులుకోలేక పనోళ్లతో చేయించుకుని ఒంటరిగా ఉంటున్నాడు. భార్య ఎప్పుడో చనిపోయింది.

సంచిడాక్టర్ దొరను పరీక్షించి సింహంలాంటి దొర ఇలా అయిపోయాడేంటి?' అని ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

"ఒళ్లంతా నొప్పులతో విలవిలలాడుతున్నాను. నిద్రపట్టేందుకు ఏదైనా చిన్నమాత్ర ఇవ్వవయ్యా!" పూడుకుపోయిన గొంతుతో అడిగాడు మస్తాన్.

తలగడదిండుకింద తాళాలగుత్తిని చూసిన సంచిడాక్టర్‌కు ఆశ పుట్టింది. "దొరకు రోగం ముదరపెట్టింది. మరేం ఫర్వాలేదు. రాత్రి నేను ఇంటికిపోకుండా ఇక్కడే ఉంటాను. గంటకు, ఘడియకు నాడి చూడాలి" అని పనోళ్లకు చెప్పాడు.

"అంటే దొరకు సావుకష్టం వచ్చేసిందా?"

"ఉదయానికి గాని చెప్పలేం"

"ఉదయం వరకు కళ్లల్లో వత్తులు పెట్టిచూసుకో"

"దొర ప్రాణంకు నా ప్రాణం అడ్డు"

సంచిడాక్టర్ ఒక మత్తు ఇంజక్షన్ ఇవ్వడంతో దొర మత్తులో ఒదిగిపోయాడు. అప్పుడు రాత్రి పదైంది. ఇద్దరు పనోళ్లు పగలంతా పొలం పనుల్లో ఉన్నందువల్ల ఆవులిస్తూనే ఉన్నారు. వారికి నిద్రపొమ్మని, తాను రాత్రంతా జాగారం చేయాల్సిందేనని చెప్పాడు. వారు ఇలా పడుకున్నారో లేదో అలా నిద్రపోయారు. సంచి డాక్టర్ తాళాలగుత్తి అందుకున్నాడు. మెల్లగా మేడ మీది గదిలోకి పోయి ఇనుప బీరువాలోని నగలు, నోట్లకట్టలు సంచిలో పెట్టుకుని కిందికి దిగాడు. తాళంగుత్తిని యథాస్థానంలో పెట్టేసి పనోళ్లలో ఒకణ్ణి తట్టి లేపాడు. "ఏమైంది దొర సచ్చిపోనాడా?"

"ప్రస్తుతానికి చావలేదు. చచ్చేట్టున్నాడు. నేను ఇంటికివెళ్లి కొన్ని లేపనాలు తీసుకుని వస్తాను" అని నమ్మపలికాడు.

అతడు వెళ్లమన్నాడు. సంచితో సహా ఇంటికి వెళ్లాడు సంచిడాక్టర్.

పనోళ్లలో ఒకడు రుద్రయ్య, దొరను అటు నుంచి ఇటు తిప్పాడు. కోమాలో ఉన్నట్టు నిద్రపోతున్నాడు. 'ధర్మం లేదు. న్యాయం లేదు. నువ్వెందుకు బతకాలి!" అని తలగడ దిండుతో మస్తాన్ ముఖంపై వేసి గట్టిగా అదిమాడు. అసలే అనారోగ్యం, ఆపైన మత్తు ప్రభావం ఏమాత్రమూ ప్రతిఘటించకుండానే మరణించాడు. చచ్చాడని నిర్ధారణ అయ్యాక తలగడదిండు కింద తాళాలగుత్తి అందుకుని ఇనుపబీరువా తెరిచి హతాశుడయ్యాడు. సాయంత్రం చూసినప్పుడు ఉన్న నోట్లకట్టలు, బంగారం ఇప్పుడు లేకపోవడమేమిటి? అని అన్ని అరలూ చూశాడు.

సంచిడాక్టరే దోచుకునుంటాడనుకుని వాడి నుండి ఎలాగైనా ఆ సొమ్మును రాబట్టాలనుకున్నాడు. ఇంతలో సంచిడాక్టర్ వచ్చాడు. రెండు లేపనాలు మస్తాన్‌కు పెట్టచూశాడు. అప్పటికే శవం ఒకింత గట్టిగా అయిపోయింది.

ఏమీ తెలియనట్టు "ఎలా ఉంది దొరగారికి?" అని రుద్రయ్య అమాయకంగా అడిగాడు.

"బాగానే ఉంది. నువ్వు పడుకో వైద్యంలో ఉన్నాను కనుక నాకు తప్పదు" అని చెప్పి దొంగచూపులు చూశాడు. రుద్రయ్య దొంగనిద్ర నటించాడు. వెంటనే మళ్లీ తాళం గుత్తి తీసుకుని దేవుని గదిలోని వెండివస్తువులు సంచి నింపేశాడు. ఇదంతా రుద్రయ్య గమనిస్తున్నాడు. ఇదన్నమాట వీడి నాడి చూడడమని మళ్లీ నిద్ర నటించాడు. సంచిడాక్టర్ వెనక్కివచ్చి రుద్రయ్యను తట్టిలేపి "రేయ్ దొరను చూసుకోరా గాబరాపుడుతోంది. నాడి దొరకట్లేదు. మరోరెండు భస్మాలు తెస్తాను" అనిచెప్పి ఇంటికి వెళ్లిపోయాడు. ఇలా సంచిడాక్టర్ రాత్రి ఇల్లంతా దోచాడు. మళ్లీ మధ్యలో ఒకసారి "దొర ఎలా ఉన్నాడు?" అని అడిగాడు రుద్రయ్య.

"ఉదయానికి గాని చెప్పలేం"

తూరుపు తెలవారుతుండగా ఊళ్లో జనాలు వచ్చి చేరారు. అప్పుడు "ఇంతవరకు బాగానే మాట్లాడాడు. ఇప్పుడే మస్తాన్ చనిపోయాడు" అని సంచిడాక్టర్ ప్రకటించాడు. ఆ ఊళ్లో మెడిసిన్ చదివే కుర్రాడు వచ్చి చూశాడు. "ఇదేమిటి నేచురల్‌గా లేదు ఎవరో ఊపిరాడనీయకుండా చంపేశారు" అని చెప్పాడు.

దాంతో ఆ పల్లె మొత్తం కదిలింది. "దొరకు చంపేసారంట! ఎవరు చంపుతారు? ఆడిలాంటి పరమ పాపిని చంపేయడానికి పనోళ్లకే తప్ప ఎవరికీ అవకాశముండదు. నూరు గొడ్ల తిన్న రాబందు ఒక్కరోగానికి చచ్చినట్టు చిన్న రోగంతో వీడిని సఫా చేసేరు" అని రకరకాలుగా అనుకోసాగారు.

సంచిడాక్టర్ ఇంటికి చేరుకున్నాడు. వాడెవడో హత్య అంటాడేంటి? అని ఆశ్చర్యపడుతుండగా రుద్రయ్య వచ్చాడు. "నీవు దొర ఇల్లు దోచుకున్నావు నేను వాడిని తలగడదిండుతో చంపేశాను. వాడి హింసకు మాలాంటోళ్లెంతమందో నరకం చూశారు. నాకు అవకాశమొచ్చింది. వేసేశాను. ఇప్పుడు దోచినదానిలో ఎంతో కొంత పడేయ్. దూరంగా పారిపోతాను" అని చెయ్యి చాచాడు. సంచిడాక్టర్ తప్పదని చిన్నబ్యాగులో సర్ది ఇచ్చాడు. రుద్రయ్య పొలాల గుండా పడిపోతుండగా మట్టిరోడ్డులో పోలీస్‌వ్యాన్ కన్పించడంతో పరుగెత్తాడు. దాంతో పోలీసులకు అనుమానం వచ్చి కిందికి దిగి పట్టుకున్నారు. గట్టిగా అడిగేసరికి రుద్రయ్య నిజం చెప్పడంతో సంచిడాక్టర్‌ను మూసేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు.

- యర్నాగుల సుధాకరరావు

వంకాయ ఊరగాయ

కావలసిన పదార్థాలు

తెల్ల వంకాయలు పెద్దవి - 2
కారం - 1 గ్లాసు
చింతపండు - పావుకేజీ
ఇంగువ - చిన్న ముక్క
మెంతులు - 1గరిటెడు
ఆవాలు - 1గరిటెడు
వెల్లుల్లి - 1గరిటెడు
ఉప్పు - 100 గ్రా
నూనె - 1కేజీ

తయారుచేసే విధానం

వంకాయలను కడిగి ముక్కలుగా తరగాలి. చింతపండు నానబెట్టి చిక్కని గుజ్జు తీయాలి. మెంతులు, ఆవాలు నూనె లేకుండా వేయించి మెత్తగా పొడి చేసుకోవాలి. కొంచెం నూనె బాగా వేడిచేసి అందులో కారం, ఉప్పు, మెంతిపొడి, వంకాయ ముక్కలు అన్నీ వేసి చింతపండు గుజ్జు కూడా వేసి కలపాలి. వెల్లుల్లి నూనెలో వేయించి పోపు పెట్టి కలిపి తడిలేని జాడీలో పెట్టుకోవాలి.



టమాట ఆవకాయ



కావలసిన పదార్థాలు

టమాటాలు - కిలో
పసుపు - 2 స్పూన్లు
ఆవపిండి - 2 స్పూన్లు
కారం - పావుకిలో
చింతపండు - నిమ్మకాయంత
మెంతిపిండి - చిన్న గరిటెడు
నూనె పావుకిలో
ఉప్పు - 1 కప్పు
పోపు సామాను - అరకప్పు

తయారుచేసే విధానం

టమాటాలు దోరగా వుండేవి తీసుకుని ఒక్కోదాన్ని నాలుగు ముక్కలు చేయాలి. ఈ ముక్కలకి ఉప్పు, పసుపు కలిపి వుంచాలి. మర్నాడు ముక్కలలోని రసం పిండి ఎండలో ఒక గంట ఆరబెట్టాలి. అవి తెచ్చి మళ్లీ రసంలో వేయాలి. బాణలిలో నూనె వేసి స్టౌమీద పెట్టి కాగాక ఇంగువ వేసి నూనెని కొద్దిగా ఆరనివ్వాలి. కొద్దిగా గోరువెచ్చని నూనెలో ఆవపిండి, మెంతిపిండి వేయాలి. ముక్కల మిశ్రమం ఒక పళ్లెంలో వేసి నూనెలో వేసిన ఆవపిండి, మెంతి పిండిని నూనెతో పాటు ముక్కల మీద పోయాలి. స్టవ్ మీద మళ్లీ బాణలిని పెట్టి నూనె కాగిన తర్వాత తిరగమోత చేసి దోరగా వేగిన తర్వాత అది చల్లార్చి టమాట ఊరగాయలో వేసి కలపాలి. ఇది ఇడ్లీలలోకి, దోసెలలోకి చాలా బాగుంటుంది.

గుమ్మడి ఆవకాయ

కావలసిన పదార్థాలు

బూడిద గుమ్మడికాయ ముక్క - 1కిలో
కారం - 100 గ్రా, నూనె - 100 గ్రా
ఆవాలు - 100 గ్రా, పసుపు, ఇంగువ - చిటికెడు
ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం

బూడిద గుమ్మడికాయని శుభ్రం చేసి గింజలు తీసెయ్యాలి. కాయ ముదురు లేత కాకుండా వుండాలి. చెక్కు తియ్యనక్కరలేదు. సన్నగా ముక్కలు తరగాలి. దీనిలో నీరు బాగా వుంటుంది. కాబట్టి ముక్కలకు కొంచెం ఉప్పురాసి ఒక బట్టలో చుట్టి గట్టిగా పిండాలి. ఒక అరగంటలో నీరు కారిపోతుంది. ఆవాలు పొడిచేసి కారం, ఉప్పు, నూనె, పసుపు, ఇంగువ వేసి బాగా కలిపి ముక్కలకు పట్టించాలి. ఒక జాడీలో వేసి రెండు రోజుల తర్వాత మరోసారి కలియబెట్టి వేడి వేడి అన్నంలో కలుపుకుని తింటే చాలా రుచిగా వుంటుంది.



కూరగాయల ఆవకాయ

కావలసిన పదార్థాలు

క్యాబేజీ - అరకేజీ, టమాటాలు పెద్దవి - 2
క్యాలిఫ్లవర్ - పావుకేజీ, కారం - పావుకప్పు
పసుపు - కొద్దిగా, ఆవపొడి - పావుకప్పు
ఇంగువ - కొద్దిగా
పల్లీనూనె - 1 కప్పు

తయారుచేసే విధానం

కూరగాయలు ముక్కలుగా తరిగి కాసేపు ఎండలో పెట్టాలి. కారం, ఉప్పు, పసుపు, ఇంగువ, కాస్త నూనె వేసి బాగా కలిపి మిగిలిన నూనె కూడా పోయాలి. ఒక రోజంతా కదపకుండా అలాగే వుంచాలి. ఇది వారం రోజులు నిల్వ వుంటుంది. నచ్చిన వారు కాస్త వెనిగర్ వేసుకుంటే నెల రోజులు కూడా వుంటుంది.

గోవా.... భూతల స్వర్గమా ఏమి!

గోవా బీచ్

ఎగసిపడే అలలు, బారులు తీరిన పక్షులు, పర్యాటకుల కేరింతలతో ఎప్పుడూ అందంగా కనిపిస్తుంది గోవా బీచ్. సముద్ర తీరం పొడవునా కొబ్బరి తోటలు, పచ్చని పంటపొలాలు, స్వచ్ఛమైనగాలి... సందర్శకులను మైమరిపింపజేస్తాయి. ఆ ప్రశాంతమైన వాతావరణం భూతల స్వర్గాన్ని తలపిస్తుంది. నిత్యం పిల్లలు, పెద్దలతో బీచ్ వాతావరణమంతా సందడిగా ఉంటుంది. బొంబాయి, మద్రాసు... ఇలా పెద్ద పెద్ద నగరాలలో బీచ్‌లు ఉన్నా గోవా బీచ్ ప్రత్యేకతే వేరు.

భారతదేశంలోని చిన్న రాష్ట్రం గోవా. 107 కిలోమీటర్ల సముద్రతీరం వ్యాపించి ఉండడంతో ఈ రాష్ట్రం అందాన్ని సంతరించుకుంది. ఈ సముద్రతీర ఆహ్లాదాన్ని అనుభవించడానికి ప్రతి సంవత్సరం వేలాది మంది విదేశీ యాత్రికులు (బ్రిటన్, ఆస్ట్రియా, యూరప్, పశ్చిమ జర్మనీ దేశాల నుండి) గోవాను సందర్శిస్తుంటారు. నిజానికి గోవాను ఎక్కువగా సందర్శించేది విదేశీయులే.

పల్లెటూరి వాతావరణం

పాతకాలపు ఇళ్లతో కళకళలాడే గ్రామాలు, ప్రశాంతమైన వాతావరణం, ప్రాచీన కోటలు, పెద్ద పెద్ద చర్చిలు, గలగల పారే అందమైన నదులు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తుంటాయి. మరో పక్క సందర్శకులకు అనుకూల వాతావరణం ఉండేవిధంగా అధునాతన కట్టడాలనూ నిర్మించారు.

బొంబాయి నుండి గోవాకు ఓడ ద్వారా వస్తుంటారు. ఈ ప్రయాణం పర్యాటకులకు ఓ మరపురాని అనుభూతిని మిగులుస్తుంది. గోవాను సమీపిస్తుండగా అదో రకమైన ఆనందాన్ని పొందుతారు. మాండవి నది సముద్రంలో కలిసే ప్రదేశంలో ఓడ ఒక రకమైన కుదుపుకు గురవుతుంది. అది ఎప్పుడైతే వస్తుందో అప్పుడు ప్రయాణికులకు గోవా రాజధాని పనాజీ వచ్చిందని గుర్తు. ఓడలో ప్రయాణం చేస్తుంటే సుదూరంగా కనిపించే గోవా భవనాలు, ఎత్తైన కట్టడాలు, గోపురాలు, చర్చిలను చూసి ఆశ్చర్యచకితులవుతారు. విమానంలో వచ్చిన వారూ గోవా సమీపిస్తుందనగా ఓ రకమైన అనుభూతిని పొందుతారు. డబోలిమ్ విమానాశ్రయం దగ్గరికొచ్చిందనగానే ఒక నూతన ప్రదేశానికి వచ్చినట్లు భావిస్తారు.

గోవాను పోర్చుగీసువారు దాదాపు 450 సంవత్సరాల పాటు పాలించడంతో ఇక్కడి వాతావరణం మనదేశానికి కొంచెం భిన్నంగా ఉంటుంది.

పనాజీ

పూర్వం పోర్చుగీసు వారు పనాజీని పాంజిమ్ అనేవారు. మాండవి నది ఒడ్డున ఈ అందమైన నగరాన్ని తీర్చిదిద్దారు. ఈ నగరం విశాలమైన భవనాలతోనూ, చర్చిలతోనూ ఆకర్షణీయంగా ఉంటుంది. ఈ చక్కటి, చల్లని వాతావరణానికి ఇక్కడికి వచ్చిన సందర్శకుల మనసులు ఆహ్లాదంతో నిండిపోతాయి.

పాంజి లేక పనాజీ అంటే ఐదు కోటలు అని అర్థం. అంతకుముందు గోవాను పరిపాలించిన ఇస్మాయిల్ ఆదిల్‌షా అనే సుల్తాన్ ఇక్కడ ఐదు కోటలను నిర్మించాడని అందుకే ఈ నగరానికి పనాజీ అనే పేరు పెట్టారని కొందరంటారు. కొంతమందేమో 'పాంజి' అంటే వరదలు రావడానికి వీలు లేని చోటు అని- అందుకే దీనికా పేరు వచ్చిందని అంటారు. చూడచక్కని ఇళ్లతో, ఇళ్లముందు అందమైన పూలతోటలతో పనాజీ సుందరంగా ఉంటుంది.

పాంజిమ్ సముద్రతీరంలో అబ్బెఫారియా విగ్రహం పర్యాటకులను తొలిచూపులోనే ఆకట్టుకుంటుంది. సందర్శకులు కాసేపు ఆ విగ్రహాన్ని అలా చూడకుండా అక్కడి నుంచి తిరిగిరారంటే ఆశ్చర్యం లేదు. అబ్బెఫారియా అనే ఆయన గోవాలో ఉండి ఫ్రెంచ్ విప్లవానికి తెరవెనుక నుండి ప్రోత్సాహం అందించాడట. అలెగ్జాండర్ డ్యూమస్ తన నవల "కౌంట్ ఆఫ్ మాంటక్రిస్టో"లో ఆయన్ని పోలిన ఓ పాత్రను సృష్టించాడు.

పూర్వం యాసఫ్ ఆదిల్‌పాషా అనే సుల్తాన్ ఇక్కడ ఒక కోటను నిర్మించాడు. దాన్ని నేడు సెక్రటేరియట్ భవనాలుగా ఉపయోగిస్తున్నారు. ఇవి కూడా పర్యాటకులు చూడాల్సిన ప్రదేశాలే. ఇక్కడ పెట్టిన ఫిరంగులు నేటికీ చెక్కు చెదరకుండా ఉన్నాయి.



మంగేష్ టెంపుల్



రోమ్ ఆఫ్ ది ఓరియంట్

గోవాలో అనేక చర్చిలు ఉన్నాయి. అందుకే గోవాను "రోమ్ ఆఫ్‌ది ఓరియంట్" అని అంటారు. సెయింట్ కాజెటన్, సెయింట్ కాథరిన్ వంటి చర్చిలు కళానైపుణ్యంతో, పవిత్ర వాతావరణంతో పర్యాటకులను ఆకర్షిస్తాయి.

సెకాథడైల్ చర్చిని క్రైస్తవ భక్తులు విశేషంగా సందర్శిస్తుంటారు. ఈ చర్చిలోని శిలువను ప్రస్తుతం శిలువ ఆకారంలో ఉన్న ఒక పెద్ద చెక్క పెట్టెలో ఉంచారు. అది ఆ చర్చికి వచ్చే సందర్శకులను, భక్తులను ఆకట్టుకుంటుంది.

ఇక్కడ ఓ చిత్రశాల ఉంది. దీనిలో గోవా చిత్రకారుడుగా గొప్ప పేరు పొందిన డామ్ మార్టిన్ చిత్రాలను ప్రదర్శిస్తారు. ఇది చూడ్డానికి చిన్నగా ఉన్నా ఆ చిత్ర కళానైపుణ్యం మనసుకు హత్తుకుంటుంది.

గోవా నుంచి మార్గోవాకు వెళ్లే దారిలో జురాయి నదిమీద ఉన్న బోరిమ్ బ్రిడ్జి ఉంది. అక్కడి అందాలను తిలకించాలంటే బస్సులో ప్రయాణం చేయడమే మేలు. గోవా విమోచన ఉద్యమం సందర్భంగా విప్లవకారులు ఈ బ్రిడ్జికి ఒక బాంబు పెట్టడం వల్ల అది కాస్త దెబ్బ తిన్నది. అందుకే మళ్లీ అదే పేరుతో మరో బ్రిడ్జిని నిర్మించారు.

ఆలయాలకు నిలయం పొండా

పనాజీకి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొండా ఆలయాలకు నిలయం. ఇక్కడ అనేక ఆలయాలున్నాయి. నిజానికి గోవాలో ఉన్న ఆలయాలన్నీ ఇక్కడే ఉన్నాయని చెప్పుకోవచ్చు. ఇక్కడ మతసామరస్యం వెల్లివిరుస్తుంది. హిందువులు, క్రైస్తవులు సఖ్యతగా ఉంటారు. కొన్ని పండుగలను ఇద్దరూ కలిసి చేసుకుంటారు. ఇంత చక్కటి పొండాలను గోవా వెళ్లినవారెవరూ మిస్ చేసుకోరు.

ఇక్కడ ఫెన్నీ అనే ఒకరకమైన మద్యాన్ని సేవిస్తుంటారు. దీన్ని బీడీ గింజలు, కొబ్బరి కాయల నుండి తయారుచేస్తారు. పండుగ సమయాల్లోనూ, ఇతర ఉత్సవాల్లోనూ దీన్ని సేవించి ఉత్సాహంగా నృత్యగానాలు చేస్తుంటారు.

ప్రతి సంవత్సరం గోవాలో మే నెలలో సన్ ఆఫ్ లెంట్ అనే పేరుతో ఉత్సవాలను జరుపుకుంటారు. మూడు రోజుల పాటు గోవా వాసులు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా జరుపుకుంటారు. గోవా, మార్గోవా, వ్యాస్కో... ఏ నగరమైనా, ఏ ఊరైనా ఈ మూడు రోజులూ నృత్యగానాలతో, కోలాహలంగా, ఉత్సాహంగా ఉంటాయి. ఈ మూడు రోజులూ గోవా వాసులు ఇళ్లలో కంటే వీధుల్లోనే ఎక్కువగా కనిపిస్తారు. ధనికా పేదా, పెద్దా చిన్నా అనే తేడా లేకుండా అందరూ ఉత్సవాలలో ఉత్సాహంగా పాల్గొంటారు. పాటలు, డ్యాన్సులు, గుర్రపు స్వారీలు వంటి కార్యక్రమాల్లో మునిగితేలతారు. ప్రసిద్ధి చెందిన గోవా బెల్లంతో తయారుచేసిన కొబ్బరిలౌజును ఇచ్చిపుచ్చుకుంటూ ఇతరత్రావన్నీ మరిచిపోయి సరదాగా ఈ మూడు రోజులూ గడుపుతారు.

రాయల్ మోనస్టరీ

వెల్హాగోవాలోని సెయింట్ మోనికా అనే చర్చిని అతిపవిత్రంగా భావిస్తారు. దానికి అనుబంధంగా రాయల్ మోనస్టరీ ఆఫ్ సెయింట్ మోనికా అనే మఠం ఉంది. క్రైస్తవ సన్యాసినుల కోసం ఏర్పాటు చేసిన మొదటి ఆశ్రమం ఇది. పోర్చుగీసు సామ్రాజ్యంలోనే అతి గొప్ప సన్యాసినుల మఠంగా పేరు పొందింది.

ఇంత గొప్ప పేరున్న ఆశ్రమంలోనే ప్రేమాయాణం సాగించబోయి విఫలమయ్యాడు హాలీవుడ్ నటుడు రిచర్డ్‌బర్టన్. ఆ నటుడు ఆశ్రమంలోని ఓ నన్‌ను ప్రేమించి ఆమెను తన వెంట తీసుకెళ్లాలని అనుకున్నాడు. కానీ ఆయన ప్రయత్నం ఫలించలేదు. స్థానికులు ఈ ప్రేమప్రహసనాన్ని చెప్పి సందర్శకులను నవ్విస్తుంటారు.

ఇక్కడివారు చేపలను ఎక్కువగా తింటారు. ఆఖరికి శాఖాహారులు కూడా జలపుష్పాల పేరుతో చేపలను తింటారు.

గోవాలో సందర్శనీయ స్థలాలను చూడ్డం కోసం కంటే పర్యాటకులు ముఖ్యంగా బీచ్ వాతావరణాన్ని ఎంజాయ్ చేయడానికే ఎక్కువగా వెళ్తుంటారు.

ప్రతి సంవత్సరం ఇంతమంది గోవాను సందర్శిస్తున్నప్పటికీ బసకు ఎటువంటి ఇబ్బందీ ఉండదు. కాకపోతే ఎక్కువగా హోటళ్లు, స్టార్ హోటళ్లే వుంటాయి. ★



గోవా చర్చి



వేసవి వచ్చిందంటే చాలు పసిపిల్లల దగ్గరి నుంచి పండు ముదుసలుల వరకు ఒక చల్లని పదార్థం కోసం ఎదురుచూస్తారు.ఆ పేరు వింటేనే వళ్లు పులకరిస్తుంది. చూస్తేనే నోరూరుతుంది. నోట్లో పడితే ఆహా... ఆ అనుభూతిని చెప్పతరంకాదు. ఓ పక్క పిల్లలను ఎక్కువగా తినొద్దంటూనే మరో పక్క పెద్దలు ఎంచక్కా లాగించేస్తారు. ఎంత అనారోగ్యంగా ఉన్నవారికైనా సరే దాన్ని చూస్తే ప్రాణం లేచొస్తుంది. ఏమీ తిననని మారాం చేసే పిల్లలు కూడా ఆ పేరు పేరు వినగానే చెప్పిన మాట వింటారు. అంతెందుకు స్లిమ్‌గా ఉండాలనుకుంటూ డైటింగ్ చేసే నేటి యువతరం కూడా దాని పేరు వింటే చాలు అవన్నీ పక్కన పెట్టేస్తుంది. అదేంటో మీకు అర్థమయ్యే ఉంటుంది. ఆ... అదే ఐస్క్రీం. అటు శరీరాన్నీ, ఇటు మనసునూ వేసవి తాపం నుండి కాపాడుతుంది. మరి దాని చల్లచల్లని కబుర్లు ఈ వారం...

ఐస్క్రీం.. కావాలోచ్...

ఇదివరకు వేసవికాలం వచ్చిందంటే చాలు ఎప్పుడెప్పుడు ఐస్‌ఫ్రూట్ బండొస్తాయా అని పిల్లలు ఎదురు చూసేవారు. వారు ఏ కోతి పనిలో మునిగి ఉన్నా సరే ఒక చెవిని వీధి వైపు పడేసేవారు. ఐస్.. ఐస్.. అన్న కేక వినపడగానే అప్పటివరకూ అమ్మ చెప్పినవన్నీ పక్కకు నెట్టేసి అంతలోనే మాయమయ్యేవారు. పాలైసిస్తే రంగైసని, రంగైసిస్తే ఆ రంగు కాదు ఇంకో రంగని ఆ బండి వాణ్ణి విసిగించి విసిగించి తమకిష్టమొచ్చింది కొనుక్కుని అక్కడే తినేసి ఏమీ తెలియనట్టు ఇంట్లోకి వచ్చి కూర్చునేవారు. అయితే నేడు ఆ ఐస్‌ఫ్రూట్లు దాదాపు కనుమరుగైపోయాయి. నేడు వాటి స్థానాన్ని ఐస్‌క్రీంలు భర్తీ చేస్తున్నాయి.

పాలు, మీగడ, పంచదార, ఇంకా ఇతర స్వీటనెర్స్ వంటివి కలిసిందే ఐస్‌క్రీం. అయితే పండ్లు, ఇతర పదార్థాలు, ఫ్లేవర్లు కూడా కలిపి వాటిని మరింత రుచికరంగా తయారుచేస్తారు. కొన్నిటిలో కృత్రిమ ఫ్లేవర్లు, రంగులు కూడా వేస్తారు. దీన్ని మధ్య మధ్యలో కలుపుతూ ఫ్రీజ్ చేస్తారు. ఐస్‌క్రీంలో 9 నుండి 12 శాతం పాలపొడి, 12 నుండి 16 శాతం స్వీటనర్స్(పంచదార వంటి తీపి పదార్థాలు), 0.2 నుండి 0.5 శాతం ఎముల్సిఫయర్స్, 55 నుండి 64 శాతం వరకు పాలు, ఇతర పదార్థాలు ఇచ్చే నీళ్లు, కొంచెం గాలి ఉంటాయి. ఐసుక్రీములో 3-15శాతం గాలి ఉంటుంది.

పాత రోజుల్లో...

క్రీ.శ ఏడో శతాబ్దంలో చైనా రాజు షాంగ్ దగ్గర 94 మంది వంట వాళ్లుండేవారు. వారు గేదె పాలు, పిండి, హారతి కర్పూరం, మంచుతో ఒక చల్లని వంటకాన్ని తయారుచేసేవారు. రోమన్ చక్రవర్తి నీరో తన సేవకులను అలపెన్నెనైన్ పర్వతాలకు పంపి మంచును తెప్పించేవారు. దానికి, తేనె, పప్పులు కలిపి ఆస్వాదించేవారు. క్రీ.శ. 13వ శతాబ్దంలో మార్కోపోలో చైనాను సందర్శించినప్పుడు ఈ పద్ధతిని ఇటలీకి తీసుకొచ్చారని కొందరంటారు. అలా ఇటలీ నుండి ఫ్రాన్సుకు, అక్కడి నుండి ఇంగ్లాండుకు పాకిందని అంటారు. అదేం కాదు. మొదటి ఐస్‌క్రీంను తయారు చేసింది రోమ్‌ను పాలించిన నీరో చక్రవర్తేనని మరికొందరంటారు. ఐస్‌క్రీంలో ఎక్కువ భాగం పాలను ఉపయోగించింది మొదట అరబ్బులే. పండ్లకు బదులుగా పంచదారను వేయడం మొదలు పెట్టింది కూడా వీరే. 10వ శతాబ్దం ప్రారంభంలోనే బాగ్దాద్, డమాస్కస్, కైరో వంటి అరబ్ ముఖ్య నగరాలలో ఐస్‌క్రీం వ్యాపించింది. వీరు ప్రాచీన గ్రీకు వంటకం పెరుగు వంటి పుల్లటి పదార్థాన్ని, పండ్లు, రోజ్ వాటర్ ఫ్లేవర్, ఇంకా బాదం వంటి పప్పులు కూడా ఐస్‌క్రీంలో వాడేవారు. మొఘల్ చక్రవర్తులు కూడా ఢిల్లీకి మంచును తెప్పించుకుని పండ్ల రసాల్లో కలుపుకునేవారు. ఫ్రాన్సులో 17వ శతాబ్దం చివరిలోనే ఫ్లేవర్డ్ ఐస్‌క్రీంలు తయారయ్యాయి.

ఇంగ్లాండు, అమెరికాలలో నిజమైన ఐస్‌క్రీంను 18వ శతాబ్దంలో రుచిచూశారు. చిన్న కుండలో తమకిష్టమైన క్రీం, స్వీటనర్ లేదా పండ్లు వేసి గాలి చొరబడకుండా దాన్ని మూసి మంచు, ఉప్పు మిశ్రమంలో ఉంచేవారు. అలా నాలుగు గంటల పాటు ఎండ, వెలుతురు తగలకుండా ఉంచితే చక్కని ఐస్‌క్రీం

తయారయ్యేది. 20వ శతాబ్దంలో ఐసుక్రీం చరిత్రే మారిపోయింది. అంతేకాదు బాగా ప్రాచుర్యం పొందడమే కాకుండా విస్తృతంగా లభ్యమైంది. రిఫ్రిజిరేషన్ ఖర్చు తగ్గడంతో ప్రపంచవ్యాప్తంగా ఐస్‌క్రీమ్ ప్రియులు పెరిగారు. ఐసుక్రీమ్ షాపులు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. రకరకాల ఫ్లేవర్లు పుట్టుకొచ్చాయి. వెరైటీల్లో తామే ముందంజలో ఉండాలని వ్యాపారులు పోటీ పడసాగారు. అమెరికాలో ఓ రెస్టారెంట్ 28 ఫ్లేవర్లను తయారుచేస్తున్నానని చెప్పడంతో బాస్కిన్-రాబిన్స్ అనే కంపెనీ నెలలో రోజుకొకటి చొప్పున 31 ఫ్లేవర్లను తయారు చేసింది. ప్రస్తుతం అది వెయ్యి రకాల రుచుల్ని ఉత్పత్తి చేయగలుగుతోంది.

ప్రపంచ దేశాలలో...

ప్రపంచంలో దాదాపు అన్ని అభివృద్ధి చెందిన దేశాల్లోనూ ఐస్‌క్రీంను పెద్ద మొత్తంలో తయారుచేసి ఐస్‌క్రీం షాపుల్లో, చిన్న చిన్న కిరాణా షాపుల్లో, బండ్లమీద, వ్యాన్ల మీద... అమ్ముతున్నారు. టర్కీ, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో బీచ్‌ల దగ్గర చిన్న చిన్న పవర్‌బోట్లలో అమ్ముతుంటారు. కొంతమంది రిఫ్రిజిరేటర్ వ్యాన్లు, బండ్ల మీద(అమెరికాలో వీటిని ఐస్‌క్రీం ట్రక్కులంటారు), మరి కొంతమంది వాటి మీద చిన్న పిల్లల మ్యూజిక్ స్పీకర్లు పెట్టి అమ్ముతుంటారు. బ్రిటన్‌లో ఐస్‌క్రీమ్ వ్యాన్లకు సాధారణంగా వచ్చే శబ్దం బదులు పిల్లలను ఆకర్షించేందుకు ఒక రకమైన సంగీతం పెడతారు.

ఎవరెన్ని చెప్పినా ఐస్‌క్రీం ముందుగా ఇటలీలోనే తయారైందంటారు. అక్కడ ఐస్‌క్రీంలో పాలు, పంచదార, ఒక్కోసారి గుడ్లు, సహజమైన ఫ్లేవర్లు కూడా ఉపయోగిస్తారు. కోన్ ఐస్‌క్రీం రాకముందు ఇటలీలో వీధి వ్యాపారులు ఐస్‌క్రీంను గ్లాసులో గానీ, మైనపు పేపర్లలో గానీ పెట్టేవారు. ఇటలీ వాసుల ద్వారానే అర్జెంటీనావారికి ఐస్‌క్రీంను తయారుచేసే పద్ధతి అబ్బింది. అక్కడ ప్రతి నగరంలోనూ రకరకాల క్రీములు నోరూరిస్తాయి. కొన్ని వందల రకాల వెరైటీలున్నా అక్కడివారు, విదేశీయులూ ఎక్కువగా ఇష్టపడేది మాత్రం 'డుల్సి డి లిచి'. అమెరికా ఐస్‌క్రీం ప్రియులకు ఆ వెరైటీ అంటే ప్రాణమట. అక్కడ రెండు రకాల ఐస్‌క్రీం పార్లర్లు ఉంటాయి. కృత్రిమ పదార్థాలతో చేసే పార్లర్ ఒకటి. వాటిలో ఐస్‌క్రీములు తక్కువ ధరకే లభిస్తాయి. రెండోది ప్రకృతి సహజమైన పదార్థాలతో చేసే పార్లర్. కోన్ లేదా కప్ ఐస్‌క్రీములు రెండు ఫ్లేవర్లలో దొరకుతాయి. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో ఒక్కొక్కరు సంవత్సరానికి 18 నుండి 20 లీటర్ల ఐస్‌క్రీం జుర్రేస్తారు. పారిస్‌లో 1651లోనే ఐస్‌క్రీం కేఫ్ వెలిసింది. అది పెట్టిన 50 సంవత్సరాల్లోనే మరో 250 కేఫ్‌లు వెలిశాయట. క్రీముకు బదులు వెన్నను ఉపయోగించడం ఇక్కడి పద్ధతి. ఇక్కడ కొందరు న్యూ ఇయర్‌కి హృదయాకారపు లేదా ముద్దు ఆకారంలో ఉండే ఐస్‌క్రీములను ఎక్కువగా తయారుచేస్తారు. 1920 నుంచీ జర్మనీలో ఇటాలియన్ ఐస్‌క్రీమ్ పార్లర్లు ప్రాచుర్యం పొందాయి. ఇటాలియన్‌లు అక్కడికి వలసపోయి వ్యాపారం ప్రారంభించారు. ఇటాలియన్‌లు ఐస్‌క్రీమ్‌ను సాంప్రదాయక వంటగా భావించడంతో ఇప్పటికీ చేతితోనే తయారు చేస్తారు. ఐస్‌క్రీమ్‌కు ఆధునిక రూపం ఒక నూతన సృష్టి. అయితే క్రీ.శ. 5వ శతాబ్దంలోనే ప్రాచీన గ్రీకులు ఏథెన్స్ మార్కెట్లో తేనె, పండ్లను మంచుతో కలిపి తినేవారు. నేటి గ్రీసు ఐస్‌క్రీమ్‌లు అసాధారణమైన ఫ్లేవర్లలో వస్తున్నాయి. నమిలే విధంగా, తొందరగా కరగకుండా ఉండే కొత్త రకం ఐస్‌క్రీమ్‌లను రూపొందిస్తున్నారు. వారు అత్తి పండ్లతో తయారయ్యే ఆలివ్ నూనె, ద్రాక్ష రసం ఐస్‌క్రీమ్ తయారీలో వాడతారు. జపాన్‌లో మోచి అనే ఐస్‌క్రీమ్‌ను ప్రతి ఐదుగురు పెద్దల్లో ఇద్దరు వారానికి ఒకసారైనా తింటారట. ప్రపంచంలో ఐస్‌క్రీమ్‌ను అధికంగా గుటకాయస్వాహామనిపించేది అమెరికన్లే. మీగడ, పంచదార, ఫ్లేవర్లతో చేస్తే 'ఫిలడల్ఫియా పద్ధతి' అని, గుడ్లతో చేసే ఐస్‌క్రీమ్‌ను 'ఫ్రెంచి' ఐస్‌క్రీమ్ అని అంటారు. అమెరికాలో ప్రతి సూపర్ మార్కెట్‌లో ఫ్రీజర్లు ఐస్‌క్రీములతో నిండి ఉంటాయి.

మనదేశంలో... ఐస్‌క్రీ'మూ'

నగరీకరణ పెరిగిన తరువాత మనదేశంలోనూ ఈ ఐస్‌క్రీము ప్రియులు పెరిగిపోయారు. బెజ్ జెర్రీ, క్యాడ్‌బరీస్, నెస్లే, హేజన్ డేజ్స్ వంటి విదేశీ కంపెనీలతో పాటు క్వాలిటీవాల్స్, అమూల్, వాడిలాల్, హేవ్‌మర్, మదర్ డెయిరీ వంటి జాతీయ బ్రాండ్లు బటర్ స్కాచ్, స్ట్రాబెర్రీ, వెనీలా, చాకొలెట్, కాఫీ, చాకొలెట్ ఆల్మండ్, చెర్రీ... వంటి పాత ఫ్లేవర్లతోపాటు ఆల్ఫాన్సో మ్యాంగో, డేట్ హనీ, ఫిగ్, చీజ్ విత్ ఆల్మండ్స్, రాజ్‌భోగి... వంటి కొత్త కొత్త రుచుల్లో ఐస్‌క్రీమును అందించేందుకు పోటీపడుతున్నాయి. కొన్నేళ్లుగా హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్ ఐస్‌క్రీమ్ మార్కెట్ మీద దృష్టి పెట్టింది. అందులో భాగంగానే



కరిగించే కబుర్లు

ప్రస్తుతం ఐస్‌క్రీమ్ ధరలు అందుబాటులోనే ఉన్నాయి. కొన్ని ఫ్లేవర్లు మినహాయిస్తే వీటి ధర 10 రూపాయల నుంచి 200 రూపాయల వరకు ఉన్నాయి. నాన్‌వెజ్ అయితే 400 రూపాయల వరకున్నాయి.

➡అమెరికా వారికి క్వాకర్ కొలోనిస్టులు ఐసుక్రీమును పరిచయం చేశారు.

➡1776లో మొట్ట మొదటి ఐస్‌క్రీమ్ పార్లర్ న్యూయార్క్ నగరంలో వెలిసింది.

➡బెన్ ఫ్రాంక్లిన్, జార్జ్ వాషింగ్టన్, జాఫర్‌సన్ వంటి వారు తరచుగా ఐసుక్రీమును ఆరగించేవారు. 1832 మధ్య ప్రాంతంలో ఆఫ్రికన్ అమెరికన్ చిరు వ్యాపారి రకరకాల ఐసుక్రీములను తయారు చేయడమే కాకుండా ఒక కొత్త పద్ధతిని కనుగొన్నాడు.

➡ఫిలడల్ఫియాకు చెందిన నాన్సీ జాన్సన్‌కు 1843లో మొట్టమొదటి సారిగా చేతితో పని చేసే చిన్న ఐస్‌క్రీమ్ ఫ్రీజర్‌కు పేటెంటు తీసుకున్నాడు.

➡బాల్టిమోర్‌కు చెందిన జాకోబ్ ఫస్సెల్, మేరీ లాండ్ మొట్టమొదటగా ఎక్కువ మొత్తంలో ఐసుక్రీమును తయారుచేశారు.

➡జాకబ్ ఫస్సెల్ 1851లో తన మొట్టమొదటి ఐసుక్రీము ఫ్యాక్టరీని పెన్సిల్వేనియాలో ఏడు లోయల్లో నిర్మించాడు.

➡ప్రాచీన పర్షియన్లు అప్పట్లోనే ప్రత్యేక పరికరాల్లో ఐసును నిల్వ చేసేవారు. అవి పొడవాటి గాలిపంకాలతో నడిచేవి. శీతాకాలంలో పర్వతాల నుంచి మంచును తెచ్చి వీటిల్లో భద్రపరిచేవారు. అది వేసవి కాలం వరకూ ఉండేది.



అందరికీ అందుబాటులో లోకల్ ఐస్‌క్రీములు

ఎండా కాలం వచ్చిందంటే ఐస్‌క్రీములకు డిమాండ్ పెరుగుతుంది. వేసవి తాపాన్ని తట్టుకోడానికి ప్రతి ఒక్కరూ ఐస్‌క్రీమ్ తినడానికి ఇష్టపడతారు. చిన్నారుల మొదలు వృద్ధుల వరకు ఐస్‌క్రీమ్ తినడానికి ఆసక్తి చూపుతారు. అయితే వీటి ధర చూస్తే ఆసక్తి కాస్త నీరుగారుతుంది. అదే సందర్భంలో మేమున్నామంటూ లోకల్ కంపెనీ ఐస్‌క్రీములు రాజధాని నగరంలో అందుబాటులో ఉన్నాయి. ఇవి అందరికీ అందుబాటులో సాధారణ రేట్లకే లభిస్తాయి. కొన్ని ప్రాంతాలు ఐస్‌క్రీములకు పేర్గాంచాయి. అటువంటిదే నగరంలోని మోజంజాహీ మార్కెట్. దీన్నే ఎంజె మార్కెట్ అని కూడా అంటారు. ఇక్కడ రూ.5 నుంచి రూ.150 వరకు ధర ఉండే ఐస్‌క్రీములు లభిస్తాయి. ఇక్కడ లభించే ఐస్‌క్రీములు బ్రాండెడ్ వాటికంటే ధర చాలా తక్కువగా ఉంటాయి. ఉదాహరణకు ఇక్కడ వెనిల్లా ఐస్‌క్రీం ఒకటి రూ.40 ఉంటే అదే బ్రాండెడ్ రూ.130 వరకు ఉంటుంది. స్థానిక ఐస్‌క్రీమ్‌లు నాణ్యత, రుచిలో బ్రాండెడ్‌కేమాత్రం తీసిపోవు. అందుకే వీటికి ఆదరణ ఎక్కువ. ఇక్కడ ఐస్‌క్రీమ్‌లు తినడానికి అన్ని వర్గాల ప్రజలు వస్తూంటారు. నగరంలో దిల్‌సుఖ్‌నగర్, కూకట్‌పల్లి, పాతబస్తీ...ఇలా వివిధ ప్రాంతాల వారు కుటుంబ సమేతంగా ఇక్కడికొస్తుంటారు. వీరే కాదు నగరం చూడ్డానికొచ్చే బయటివారు కూడా ఓ సారి ఇక్కడి ఐస్‌క్రీమ్‌ల రుచి చూడందే వెళ్లరు. సినీ ప్రముఖులు కూడా వస్తుంటారంటే వీటి ప్రత్యేకత గురించి చెప్పనవసరంలేదు. ఈ మార్కెట్ నిజాం కాలంనాటి భవనంలో వెలసింది. ఈ భవనం ఇక్కడికొచ్చే ప్రజలకు ప్రత్యేక అనుభూతిని అందిస్తుంది. చల్లని ఐస్‌క్రీమ్‌తో పాటు చక్కని అనుభూతి పొందడానికి ప్రజలు ఇక్కడికి రావడానికి ఎక్కువగా ఇష్టపడతారు.

- గణేష్, కాచిగూడ.

ఇటీవల 'మూ' పేరుతో కాల్షియం అధికంగా ఉన్న ఐస్‌క్రీమును ప్రారంభించింది. మరికొన్ని కంపెనీలు కొవ్వుశాతాన్ని తగ్గించి ఐస్‌క్రీంను తయారుచేస్తామంటున్నాయి.

కోన్ ఐస్‌క్రీమ్

19వ శతాబ్దం నుండి కోన్ ఐస్‌క్రీములు వచ్చాయి. 1904లో సెయింట్ లూయిస్ వరల్డ్ ఫెయిర్ జరిగిన దగ్గరి నుండి అవి ప్రాచుర్యంలోకి వచ్చాయి. వరల్డ్ ఫెయిర్‌లో ఒక వ్యాపారి ఐస్‌క్రీమ్ అమ్మడానికి చెక్క గిన్నెలు కొనుక్కొచ్చాడట. దాంతో ఆయనకు చాలా లాసొచ్చిందట. ఒక ఐస్‌క్రీమ్ బూత్ పక్కనే వాఫిల్ బూత్ ఉండేదట. దాని యజమాని వాఫిల్స్‌ను కోన్‌లా చుట్టడంతో అవి బాగా అమ్ముడుపోయాయట. అది చూసిన ఐస్‌క్రీమ్ వ్యాపారులు కోన్ ఐస్‌క్రీములను తయారుచేయడం మొదలు పెట్టారు.

నైట్రోజన్ ద్రావణంతో...

నైట్రోజన్ ద్రావణంతో ఐస్‌క్రీమును తయారుచేసే పద్ధతి పాతదే అయినా ఇప్పటికీ దాన్ని ఉపయోగిస్తున్నారు. ఈ పద్ధతిలో ఐస్‌క్రీమ్ మేకర్ అవసరం లేకుండానే నైట్రోజన్ ద్రావణం ఐస్‌క్రీమ్ త్వరగా గడ్డకట్టేలా చేస్తుంది. ఈమధ్య నుంచే ఆ పద్ధతిని వాణిజ్యపరంగా కూడా ఉపయోగిస్తున్నారు. ఆ విధంగా చేసిన ఐస్‌క్రీము నుంచి ఆవిర్లు వస్తుంటాయి. అలా వస్తున్నప్పుడు తింటే ప్రమాదం. అందుకే అవి పూర్తిగా పోయేవరకు ఆగి తినడం మంచిది. ఒక్కోసారి ఐస్‌క్రీమ్ పాత్రకు గడ్డకట్టి ఉంటుంది. దాన్ని కరగబెట్టుకుని తినాలి. ఈ పద్ధతిలో ఐస్‌క్రీమ్ త్వరగా గడ్డ కట్టడం వల్ల చాలా మృదువుగా ఉంటుంది. దీనివల్ల తక్కువ పాలకొవ్వు ఉన్నా ఐస్‌క్రీమ్ మృదుత్వం తగ్గదు. ఎక్కువ శ్రమ పడాల్సిన అవసరమూ ఉండదు.

దేని మజా దానిదే

ఐస్‌క్రీమ్ తింటుంటే కలిగే ఆ ఆనందమే వేరు. అందులోనూ ఒక్కో రకం ఒక్కో మజానిస్తుంది. రకరకాలవారి రుచులను బట్టి, జీవన శైలిని బట్టి వివిధరకాల ఐస్‌క్రీములు దొరుకుతున్నాయి. అధిక బరువున్న వారూ తినతగ్గ ఐస్‌క్రీములను కూడా తయారుచేస్తున్నారు. 6.5, 4 శాతం కంటే తక్కువ కొవ్వు పదార్థాలు గల ఐస్‌క్రీములు కూడా దొరుకుతున్నాయి. అయితే ఇంతకుముందు తక్కువ కొవ్వు పదార్థంగల ఐస్‌క్రీమ్‌లలో రుచి లోపించేది. ఆధునిక టెక్నాలజీ వచ్చిన తరువాత ఆ బాధ కూడా లేదు. గిలాటో ఐస్‌క్రీమ్ మిగతావాటి కన్నా మృదువైనదని చెప్తుంటారు. నాణ్యతలోనూ అనేక రకాలు లభ్యమవుతున్నాయి. అయితే దానికి తగ్గట్టే ధరలు కూడా ఉంటాయి. వాటిని కొన్ని ప్రత్యేకమైన షాపుల్లో మాత్రమే అమ్ముతుంటారు.

ఎన్ని రకాలో...

మండు వేసవిలో చల్లని ఐస్‌క్రీములు అలా అలా గొంతులో జారుతుంటే పొందే ఆ అనుభూతి ఎంతో మధురం. ఎంతటి వేడినైనా మరిపింపజేసేది ఐస్‌క్రీమేనంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదేమో! వెనిల్లా, చాకొలెట్ చిప్, స్ట్రాబెర్రీ, కాఫీ, మింట్ చాకొలెట్, నియోపాలిటన్, పీనట్ బటర్ కప్, చెర్రీ, చాకొలెట్ మార్షమల్లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు అందరూ ఇష్టపడే ఫ్లేవర్లలో కొన్ని. అయితే ఇప్పటికీ అందరూ ఎక్కువగా ఇష్టపడే ఫ్లేవర్లలో వెనిల్లా ఒకటి. ఎందుకంటే ఇది ఏ ఇతర ఫ్లేవర్‌లోనైనా చాలా త్వరగా ఇమిడిపోతుంది. రకరకాల టేస్టులను ఎంజాయ్ చేయగలిగిన వారు మాత్రమే వాటి వైపు వెళ్లడం మంచిది. వివిధ ఆహార పదార్థాల్లో మొక్కజొన్నలు చేరుతున్నట్లే ఐస్‌క్రీములోనూ ఆ ఫ్లేవర్ చేరిపోయింది. అలాగే నూడుల్ ఐస్‌క్రీమ్. మీరు కాస్త సాహస వీరులైతే లాబ్‌స్టర్ ఐస్‌క్రీమ్‌కి ఆర్డరివ్వండి. లేకపోతే దాని జోలికి పోకండే! చాలా నిరుత్సాహంగా ఉండి ఇంద్రియ శక్తి కోల్పోతున్నట్లనిపించే సమయంలో కోకోనట్ ఐస్‌క్రీమ్‌ను తిన్నారంటే ఇక చూస్కోండి, పోయిన సత్తువంతా తిరిగి వచ్చిన అనుభూతి కలుగుతుంది. అప్పటి వరకూ తిన్నవాటిలో ఇదే చాలా బాగుందనిపిస్తుంది. ఈ ఐస్‌క్రీమ్ పైన కోకోనట్ అటుకులను జల్లుతారు. హనీ విత్ స్పైస్ ఫ్లేవర్డ్ ఐస్‌క్రీములో గుడ్లు, తేనె, మీగడ, లవంగాలు, దాల్చిన చెక్క వంటివి ఉపయోగిస్తారు. గుమ్మడి కాయ, అల్లం, బబుల్‌గమ్ వంటి ఫ్లేవర్లు కూడా ఉన్నాయి. ఇంతగా ఇష్టపడుతున్న ఐస్‌క్రీమ్‌లలో మాంసాహారం కూడా వచ్చి చేరింది. ఫిష్, మటన్ ఫ్లేవర్లలో వస్తున్నరకాలు నాన్‌వెజ్ ప్రియులను నోరూరిస్తున్నాయి. కొందరు ఐస్‌క్రీముల్లో నాన్‌వెజ్ ఏంటని అనుకోవచ్చు. కానీ వీటికి డిమాండ్ తక్కువేమీ లేదు. ఎంత ఇష్టమైనా సరే డయాబెటిస్ పేషంట్లు ఐస్‌క్రీమ్ తినాలనే తమ కోరికను అణుచుకుంటారు. కానీ ఇప్పుడు వారు ఎంచక్కా తమకిష్టమొచ్చినన్ని ఐసక్రీములను లాగించెయ్యొచ్చు. ఎందుకంటే షుగర్ ఫ్రీ ఐస్‌క్రీములు వచ్చేశాయి. షుగర్ పేషంటులను దృష్టిలో పెట్టుకుని వివిధ రకాల వయసులవారికి తగినట్టుగా ఐస్‌క్రీములను తయారుచేస్తున్నారు.

- సంధ్య

కొత్త పుస్తకాలు

మహాకవి మహత్తర కృషి చిత్రం

తెలుగు సాహిత్యాన్ని గొప్పగా ప్రభావితం చేసినవాడు శ్రీశ్రీ. 'తెలుగు సాహిత్యం ఇప్పటివరకూ నన్ను నడిపించింది. ఇక నుండి నేను నడిపిస్తాను. ఈ శతాబ్దం నాది' అన్నా ఎవరూ గట్టిగా బదులు చెప్పలేనంతటి సాహిత్యనాయకత్వం శ్రీశ్రీది. మహాకవికి అంతటిశక్తి ఎలా వచ్చింది? మొత్తంగా సాహిత్యాన్ని తన ధోరణితో మరోవైపుకు మళ్ళించే అంత యుక్తి ఎలా సాధ్యమయ్యింది? ఈ ప్రశ్నలు మనం వేసుకుంటే కొన్ని సమాధానాలు తడతాయి. కానీ, మరింత నిర్దిష్టంగా మనం అవగాహన చేసుకోవాలంటే కోడం కుమారస్వామి పిహెచ్‌డి పుస్తకం 'శ్రీశ్రీ కవిత్వం ప్రాచ్య పాశ్చాత్య ప్రభావాలు' చదవాలి. ఈ పరిశోధనా పుస్తకంలో ఆధారసహిత వివరణలు పాఠకుడికి ఆసక్తిని కలిగిస్తాయి. శ్రీశ్రీ సాహిత్యం గురించి, నేపథ్యం మీదా ఇప్పటికే చాలా సాహిత్యం వచ్చింది. అనేక కోణాలలో శ్రీశ్రీని అనేకమంది విశ్లేషించారు. శ్రీశ్రీపై ప్రభావాల గురించి వాటిలో కొన్ని వివరాలు ఉంటాయి కూడా. అయితే ఈ పుస్తకం నిర్దిష్టంగా శ్రీశ్రీ మీద ప్రభావాల గురించి చర్చించడం గనుక ఒకచోట సమాచారం మనకు లభిస్తుంది. శ్రీశ్రీ తన జీవితకాలంలో ఆసియా, యూరప్, అమెరికా, ఆఫ్రికా దేశాలకు చెందిన సుమారు 70 మంది రచయితల రచనలను తెలుగులోకి అనువదించారు. ఈ విషయం తెలిసినప్పుడు మరెంతమంది రచయితలను చదివి ఉంటారో, మరెన్ని ఇతర ఇంగ్లీషు పుస్తకాలు చదివి వుంటారో అనే ఆలోచన రాకుండా ఉండదు. ఇంత విస్తారంగా ప్రపంచ సాహిత్యాన్ని పరిచించిన శ్రీశ్రీకి తనమీద తనకి అచంచల విశ్వాసం, నమ్మకం ఉండడంలో ఆశ్చర్యం లేదు. అంతకుమించి బాల్యం నుండీ సంప్రదాయ ప్రాచీన సాహిత్యపఠనం ఉండనే ఉంది. శ్రీశ్రీ సాహిత్యజీవితంలో ఈ రెండుకోణాలూ కీలకపాత్ర పోషించాయి. ఆ విషయాన్ని శాస్త్రీయంగా ఈ పుస్తకంలో రచయిత విశ్లేషిస్తాడు. అయితే ఈ రెండు కోణాలకు పరిమితం అయితే శ్రీశ్రీలో జరిగిన రసాయనిక చర్యను పూర్తిగా చెప్పినట్టు కాదు. భావజాలాలకు ప్రేరణ కలిగించే తాత్వికదృక్పథం గురించి ప్రస్తావించినప్పుడే అది పూర్తవుతుంది. ఈ పుస్తక రచయిత ఆ పనికూడా చేశాడు. శ్రీశ్రీ విషయంలో ప్రాచ్యపాశ్చాత్య ప్రభావాలతో పాటు అంతకుమించి మార్క్సిస్టు తత్వశాస్త్ర ప్రభావం ఉంది. శ్రీశ్రీలోని విషయ ప్రతిభకు శ్రమజీవుల సిద్ధాంతం తోడవటంతో సరైన రసాయనిక చర్యకు అవకాశం ఏర్పడింది. అప్పుడు శ్రీశ్రీలోని ఉవ్వెత్తున ఎగిసిన భావోద్వేగానికి అక్షరరూపం ఏర్పడి సాహిత్యసంచలనంగా మారింది.

ప్రాచీన సంస్కృత, ఆంధ్రకావ్యాలైన వసుచరిత్ర, మనుచరిత్ర, శ్రీమద్భాగవతం వంటి గ్రంథాల పఠనం, 'అప్పకవీయం' వంటి సంప్రదాయ సాహిత్య అలంకార, లాక్షణిక శాస్త్రాల అవగాహన మహాకవికి ఎంతగానో తోడ్పడ్డాయి. ప్రాచీనసాహిత్యంపై ఇంచుమించు సాధికారంగా పట్టుకలిగిన ఆధునిక కవి మరో మార్గం వైపు నిర్భయంగా మళ్ళాడు. దేశవిదేశాల సాహిత్యపఠనం శ్రీశ్రీకి కవిత్వాన్ని కొత్తపుంతలు తొక్కించడాన్ని నేర్పించింది. శ్రీశ్రీ పలు కవిత్వ ప్రయోగాలు చేసేలా పురికొల్పింది. శ్రీశ్రీ చదివిన పలు ఇంగ్లీషు రచయితల రచనలను ఈ పుస్తక రచయిత ఉటంకిస్తూ శ్రీశ్రీ వాటికి చేసిన అనువాదాల గురించి చక్కటి విశ్లేషణ చేస్తాడు. అల్లన్ పో రాసిన 'ద బెల్స్' కవితను ఇంగ్లీషులో మొత్తంగా ఇస్తూ ఆ కవితకు శ్రీశ్రీ చేసిన అనువాదాన్ని విశ్లేషించారు. ఈ అనువాదంలో శ్రీశ్రీ అద్భుత ప్రతిభను ప్రశంసించకుండా ఉండలేదు రచయిత- 'పట్టణాలలో, పల్లెటూళ్ళలో/బట్టబయలునా, పర్వతగుహలా/ఎడారులందూ, సముద్రమందూ/అడవుల వెంటా, అగడ్తలంటా/ ప్రపంచమంతా ప్రతిధ్వనిస్తూ/గంటలు!/గంటలు!/గంటలు!గంటలు!/గంటలు!గంటలు!" అంటూ శ్రీశ్రీ చేసిన తెలుగు అనువాదాన్ని చదివి రచయితతో పాటు పాఠకుడు కూడా ఆశ్చర్యానందాలకు లోనవుతాడు.

శ్రీశ్రీ కవిత్వం
ప్రాచ్యపాశ్చాత్య ప్రభావాలు
(ఎం.ఫిల్ సిద్ధాంత గ్రంథం)
రచయిత: కోడం కుమారస్వామి
పేజీలు:138, వెల: రూ. 80/-,
ప్రతులకు: కోడం భగవద్గీత,
ఇం.నెం. 2-3-69,
శివాలయం వీధి, జనగామటౌన్,
వరంగల్-506 167,
సెల్: 9848362803,
9989250876



శ్రీశ్రీ శతజయంతి సంవత్సరానికి ఇటీవలే వీడ్కోలు పలికినా ఇంకా ఆ పరిమళం పోలేదు. ఈ కాలంలో శ్రీశ్రీ మీద విస్తృత చర్చ జరిగినంతగా గతంలో ఎప్పుడూ ఏ రచయిత మీదా జరగలేదు. తెలుగునాట శ్రీశ్రీ ప్రభావానికి శ్రీశ్రీ శతజయంతి సంవత్సరం మరోసారి అద్దం పట్టింది. శ్రీశ్రీ తన ప్రతీ అక్షరాన్ని పెట్టుబడిదారీ సమాజానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టాడు. వర్తమానకాలంలో పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభాన్ని చూస్తున్నాం. ఆ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి పాలకవర్గాలు సామాజిక సంక్లిష్టతలను పెంచుతున్నారు. ప్రజల్లో అయోమయాన్ని సృష్టిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నయమైన సోషలిజం మార్గం వైపు ప్రజలు మళ్ళకుండా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి సమయంలో సోషలిస్టు సమాజాన్ని ప్రచారం చేసిన మహాకవి సాహిత్యం గురించి మాట్లాడుకోవడం ఒక అవసరం. ఈ సందర్భంలోనే శ్రీశ్రీ సాంప్రదాయ నేపథ్యాన్ని, ఆధునిక ప్రపంచ సాహిత్యం శ్రీశ్రీపై చూపిన ప్రభావాన్ని తెలియపరిచే మంచి పుస్తకం రావడం ఆనందం కలిగించే విషయం. ఈ పుస్తక రచయిత కోడం కుమారస్వామికి అభినందనలు.

- వొరప్రసాద్

పుస్తకారం



విద్యా హక్కు చట్టం
కేంద్రప్రభుత్వ మోడల్ స్కూల్
యుటిఎఫ్ ప్రతిపాదనలు
వెల : 10/-,
పేజీలు : 52



కథ

టీనేజ్

- తమ్మడి ప్రదీప్

"నువ్వసలు మనిషివేనా? ఏం చేశాడని నా కొడుకును కటకటాల వెనక్కి తోశావు?"

పోర్టికోలో కారు పార్కు చేసి, గుమ్మంలో అడుగు పెడుతున్న భర్త శ్రీనివాస్‌పై తోకతొక్కిన తాచులా లేచింది రాధ. ఫైల్స్, ల్యాప్‌టాప్ సోఫాసెట్‌లో పడేసి, తన గదిలోకి వెళ్లిపోయాడతను భార్య మాటలు పట్టించుకోకుండా. నీడలా అతని వెనకే వెళ్లింది. మూడు రోజుల క్రితం వరకు కళ్లముందున్న కొడుకు ఇప్పుడు కటకటాలపాలయ్యాడంటే ఆమె జీర్ణించుకోలేకపోతోంది. పేగు తెంచుకు పుట్టిన ఆ బంధం కోసం పరితపిస్తోంది. అంతకు మించి కన్నతండ్రే ఇలా చేశాడన్న నిజం ఆమె మనసును రంపంలా కోస్తోంది. "మరేం చెయ్యమంటావ్? నీ కొడుకు చేసిన ఘనకార్యానికి తెచ్చి నెత్తిమీద కూర్చోబెట్టుకోమంటావా?" అరిచినంత పని చేశాడు శ్రీనివాస్ అప్పటి వరకు పంటి బిగువున అదిమి పట్టిన కోపాన్నంతా వ్యక్తపరుస్తూ.

"వాడు చేసింది మామూలు తప్పుకాదు. ఓ అమ్మాయి జీవితాన్ని నాశనం చెయ్యాలని చూశాడు"

నిశ్శబ్దంగా ఉన్న ఆ గదిలో అతని మాటలు బాంబులా పేలాయి. ఆ మాటలకు రాధ శిలాప్రతిమలా నిలబడిపోయింది. ఆశ్చర్యంతో పెద్దవైన ఆమె కళ్లలో విభ్రాంతి. శ్రీనివాస్ వైపు తీక్షణంగా చూస్తోన్న ఆమెకు–"వాడు చేసింది మామూలు తప్పు కాదు.' ఓ అమ్మాయి జీవితాన్ని నాశనం చెయ్యాలని చూశాడు" అన్న మాటలే పదే పదే వినిపిస్తూ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.

✤✤✤

అది శ్రీభార్గవ కళాశాల ప్రాంగణం. ఫ్రెండ్స్‌తో మాట్లాడుకుంటూ ఇంటికి వెళ్తున్న సంధ్యకు తనను ఎవరో పిలుస్తున్నట్టు వినిపించి వెనక్కు చూసింది. దూరంగా ప్రమోద్ పరుగున వారి వైపే వస్తున్నాడు. అతను సంధ్య క్లాస్‌మెట్.

దగ్గరికొచ్చాక ఆయాసపడుతూ–"ఐలవ్‌యూ సంధ్యా" అన్నాడు.

ఊహించని ఈ పరిణామానికి సంధ్య అవాక్కయ్యింది. వాళ్లిద్దరి పరిచయానికి మూడు నెలలు మాత్రమే నిండాయి. అంతలోనే అతన్నుంచి ఇలాంటి ప్రపోజల్ వస్తుందని ఆమె కలలో కూడా ఊహించలేదు.

"నువ్వూ నన్ను ప్రేమిస్తున్నావనుకో. ఆ మాట నీ నోటిగుండా చెబితే సంతోషిస్తా" చెప్పడం పూర్తి చేసి సమాధానం కోసం తలెత్తి సంధ్య వైపు చూశాడు. సంధ్య భృకుటి ముడిపడింది.

"నేను నిన్ను ప్రేమిస్తున్నానా? అలా అని నీతో ఎప్పుడైనా చెప్పానా? లేదే?"

"చూడు ప్రమోద్ ఇన్ని రోజులు నీతో మాట్లాడింది కేవలం ఓ ఫ్రెండ్‌గానే. కానీ నువ్వలా ఊహించుకోవడం నాతప్పు కాదు. నాకంటూ ఒక లక్ష్యం ఉంది. దాన్నొదిలేసి ప్రేమా, దోమా అంటూ తిరగడం నాకిష్టం లేదు. మా అమ్మా, నాన్నా నాపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఓ కూతురిగా వారి ఆశలను వమ్ము చేయలేను. నువ్వూ నాలా ఆలోచించు. వస్తాను బై" అంటూ అక్కడి నుంచి కదిలింది.

అప్పుడు సంధ్య ప్రమోద్ కళ్లలోకి చూసుంటే తనపై అతను పెంచుకున్న కసి కనిపించేది. అతన్నుంచి తనకు ఏదో ప్రమాదం ఉందని గ్రహించేది. కానీ అలా చూడలేదు.

✤✤✤

ల్యాప్‌టాప్ ఇంట్లోనే మరిచిపోవడంతో ఉదయాన్నే ఆఫీసుకెళ్లిన ప్రమోద్ తండ్రి శ్రీనివాస్ మళ్లీ తిరిగొచ్చాడు. కారు బయటే ఉంచి ఇంట్లోకొచ్చాడు. మెట్లు ఎక్కి, తన గదిలోకెళ్తుండగా ఓ కాగితం గాల్లో ఎగురుకుంటూ వచ్చి అతని కాళ్లపై పడింది. చిత్తు కాగితమనుకుని పట్టించుకోకుండా లోపలికెళ్లాడు. ల్యాప్‌టాప్ తీసుకుని బయటకొచ్చాడు. కాగితం మళ్లీ అక్కడే ఉండటంతో డస్ట్‌బిన్‌లో పడేద్దామని తీసుకున్నాడు. పడేయబోతున్నవాడల్లా ఏదో ప్లానింగ్‌లా ఉందని విప్పి చూశాడు. అంతే అతని కళ్లు పెద్దవయ్యాయి. వెన్నులోకి రక్తం వేగంగా ప్రవహించింది.

ప్రమోద్, అతని ఫ్రెండ్స్ శ్రీరామ్, ఉదయ్ కాలేజ్‌మెట్ సంధ్యపై యాసిడ్ దాడి చేయాలని నిర్ణయించుకున్నారని తెలుసుకుంటాడు. "సాయంత్రం కాలేజ్ వదిలాక ప్లాన్ అమలు చేస్తారు. ప్రమోద్, ఉదయ్ కాలేజ్ వద్ద రహస్య ప్లేస్‌లో ఉంటారు. శ్రీరామ్ యాసిడ్ తీసుకుని ఘటనకు 10 నిముషాల ముందు అక్కడికి చేరుకుంటాడు" అని ఆ లేఖలో ఉంది. తన ప్రేమను తిరస్కరించినందుకు ప్రమోద్ ఈ దారుణానికి పథకం రచించాడు.

చివరగా టైం చూసిన అతని గుండె వేగం పెరిగింది.

వారు పాల్పడబోయే ఘాతుకానికి కేవలం 20 నిముషాలు మాత్రమే టైముంది. జరగబోయే దారుణాన్ని ఎలాగైనా ఆపాలనుకుని వెంటనే ప్రమోద్ సెల్‌కు ఫోన్ చేశాడు. రింగ్ అవుతుంది కానీ ఎత్తడు. శ్రీనివాస్ ఆలోచనలో పడ్డాడు. ఇంటి నుంచి కాలేజ్‌కు వెళ్లాలంటే అరగంట సమయం పడుతుంది. కానీ ఉన్నది 20 నిముషాలే. అందులో రెండు నిముషాలు గడిచిపోయాయి. అలా ఆపడం వీలుకాదు. పోనీ పోలీసులకు ఫోన్ చేద్దామన్నా ఫలితం ఉండదు. ఎందుకంటే స్టేషన్ ఊరికి 15 కిలో మీటర్ల దూరంలో ఉంది. వారొచ్చే సమయానికి జరగాల్సిన దారుణం జరిగి తీరుతుంది. ఆలోచనలతో శ్రీనివాస్ బుర్ర వేడెక్కుతోంది. కిందకు దిగి, కారును రాజీవ్ సెంటర్ వైపు దూకించాడు.

శ్రీ భార్గవి కళాశాలకు వెళ్లాలంటే పట్టణంలోని ఏదారి గుండా వచ్చినా అక్కడి నుంచే వెళ్లాలి. అక్కడికెళ్తే శ్రీరామ్‌ను పట్టుకోవచ్చని అతని ఆలోచన.

10 నిముషాలు ప్రయాణించాడో లేదో "ఢాం" అన్న శబ్దం అతని విచలితుడిని చేసింది.

వేగం తగ్గడంతో కారును లెఫ్ట్ సైడ్‌లో ఆపి, దిగి చూశాడు. వెనక టైర్ పగిలిపోయింది. లోకంలో ఉన్న నిస్సత్తువంతా తననే ఆవరించినట్టు ఫీలయ్యాడు. ఆలస్యం చేయకుండా పరుగు లంకించుకున్నాడు.

రాజీవ్ సర్కిల్ పది అడుగుల దూరం ఉందనగా సడెన్ బ్రేక్ వేసినట్టు ఆగిపోయాడు.

అతని కళ్ల ముందు ఓ బైక్ వాయు వేగంతో 'రయ్'మని వెళ్తోంది.

దానిపై శ్రీ రా మ్

అతని చేతిలో యా సి డ్ బా టి ల్

రింగ్‌టోన్ వినిపించడంతో జేబులో చేయిపెట్టి సెల్‌ను అసహనంగా బయటికి తీశాడు ప్రమోద్. నంబరు కొత్తది. ఏదైనా అవసరముండి శ్రీరామ్ చేశాడేమోనని లిఫ్ట్ చేశాడు.

"హలో ఎవరు" అన్నాడు.

"నేను సంధ్యని" శ్రావ్యమైన గొంతు మృదువుగా పలికింది.

ఆ పేరు వినగానే ప్రమోద్ చేయి రిసీవర్‌పై

బిగుసుకుంది.

"ఎవరూ" మళ్లీ రెట్టించాడు.

"ప్రమోద్ నేను సంధ్యని. నీ ప్రేమను కాదన్నందుకు ఐయామ్ వెరీ సారీ. నన్నింతగా ఇష్టపడుతున్న నిన్ను వద్దనుకోవడం నా మూర్ఖత్వమే అవుతుంది. ఐలవ్‌యు ప్రమోద్. ఐలవ్‌యూ సోమచ్" అని ఫోన్‌లోనే ముద్దు పెట్టింది.

ఆ మాటలకు ప్రమోద్ మొహం విప్పారింది. సంధ్యను ప్రేమిస్తున్నానని ఫ్రెండ్స్‌తో మొదటి సారి చెప్పినప్పుడు అతని ముఖంలో కలిగిన భావమే ఇప్పుడూ కలిగింది.

"ప్రమీ వెంటనే నిన్ను చూడాలనుందిరా. ఆలస్యం చేయకుండా పార్కుకు వచ్చెయ్" అవతలి వైపు ఫోన్ కట్ అయిన శబ్దం. ప్రమోద్ సెల్ చేతిలో పట్టుకుని గట్టిగా అరుస్తూ గాల్లో ఎగిరాడు. చంటి పిల్లాడికి బొమ్మ దొరికినంత సంబరపడ్డాడు.

"ఫోన్‌లో ఎవరురా?"ప్రశ్నించారు శ్రీరామ్, ఉదయ్.

"సంధ్యరా. నా ప్రేమను ఒప్పుకుంది. నన్ను చూడాలంట. వెంటనే పార్కుకు రమ్మంది" అంటూ బైక్‌ను పార్కువైపు దూకించాడు.

అక్కడికెళ్లగానే-"సంధ్య నేనొచ్చేశా. నువ్వెక్కడున్నావ్?" సంతోషం పట్టలేక అరిచాడు.

ఎవరో తరుముతున్నట్టు అడుగుల శబ్దం వినిపించి వెనక్కి తిరిగి చూశాడు. అంతే పక్కలో బాంబు పడ్డట్టు అదిరిపడ్డాడు. రక్తం పిండేసినట్లు అతని ముఖం తెల్లగా పాలిపోయింది. చేతుల్లో పొడవాటి గన్‌లతో పోలీసులు అతణ్ణి చుట్టు ముట్టారు.

✤✤✤

అరెస్టు చేసిన మరుసటిరోజే ప్రమోద్‌ను కోర్టులో హాజరుపరిచారు. తనను అరెస్టు చేయడం అటుంచితే తమ ప్లాన్ ఎవరికి తెలిసింది? ఎలా తెలింది? సంధ్యకు ఎవరు చెప్పారు? వంటి ప్రశ్నలే అతణ్ణి తొలుస్తున్నాయి. విచారణ ప్రారంభమైంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నేరం తెలిపి, సాక్ష్యులను ప్రవేశపెట్టాల్సిందిగా కోరాడు.

"శ్రీనివాస్... శ్రీనివాస్... శ్రీనివాస్" బంట్రోతు మాటలు కోర్టు ఆవరణలో అలలు అలలుగా వినిపించాయి. ఆ పేరు వినగానే ప్రమోద్ సన్నగా వణికాడు.

"సాక్షి మా నాన్న కాదుగా" అనుకున్నాడు లోపల.

అంతలోనే అతని ముఖ కవళికల్లో మార్పు. తన అనుమానే నిజమైంది. సాక్షి తన తండ్రే.

"ప్రమోద్ తన ప్రేమను కాదన్నందుకు సంధ్య అనే అమ్మాయిపై యాసిడ్‌తో దాడి చేయాలనుకున్నాడు. అందుకు అతని ఫ్రెండ్స్ శ్రీరాం, ఉదయ్‌ల సహకారం తీసుకున్నాడు. ఈ దాడిని విఫలం చేసేందుకు కాయిన్ బాక్స్ నుండి నేను ఈ నెల 11న సాయంత్రం 5 గంటలకు ప్రమోద్‌కు ఫోన్ చేశాను. సంధ్యలా గొంతు మార్చి నేను నిన్ను ప్రేమిస్తున్నానని మాట్లాడాను. అందుకు సంబంధించిన ఎవిడెన్స్ ఇవిగో" అంటూ ప్లాన్ కాగితాన్నీ, తన మాటలు రికార్డ్ చేసిన సెల్‌నూ, తనను మిమిక్రీ ఆర్టిస్టుగా గుర్తిస్తూ ప్రభుత్వం జారీ చేసిన పత్రాలనూ కోర్టుకు అప్పగించాడు. ఫ్రెషర్స్ డే రోజు కళాశాల ఫంక్షన్‌కు హాజరైన శ్రీనివాస్‌ను సంధ్య గొంతు ఆకర్షించింది. దాంతో వెంటనే అనుకరించడం నేర్చుకున్నాడు.

బలమైన సాక్ష్యాధారాలుండటంతో నేరం రుజువైంది. ప్రమోద్, శ్రీరాం, ఉదయ్‌లను కోర్టు దోషులుగా గుర్తించింది. ఐపిసి 120 బి చట్టం ప్రకారం ఒక్కొక్కరికి రెండేళ్ల చొప్పున శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.

జడ్జి వెళ్తుండగా-"సర్ మాట్లాడేందుకు నాకు ఐదు నిముషాలు టైం ఇవ్వండి. అలాగే కోర్టు బయట ఉన్న శ్రీభార్గవి కళాశాల విద్యార్థుల తల్లి దండ్రులను లోనికి అనుమతించాలి" కోరాడు శ్రీనివాస్.

విద్యార్థుల తల్లిదండ్రులను కోర్టు వద్దకు తీసుకరమ్మని క్రితం రోజే శ్రీనివాస్ ప్రిన్సిపాల్‌ను అభ్యర్థించాడు. అతని అభ్యర్థన మంచిదనిపించడంతో ప్రిన్సిపాల్ ఫోన్ చేసి అందరినీ పిలిపించాడు.

"డియర్ పేరెంట్స్! అందరికీ నమస్కారాలు. నా పేరు శ్రీనివాస్. ఎదురుగా బోనులో ఉన్న అబ్బాయికి తండ్రిని. నేనో గవర్నమెంట్ ఉద్యోగస్తుణ్ణి. నా భార్య కూడా జాబ్ చేస్తోంది. ఏ చీకూ, చింతా లేని కుటుంబం. ఒక్కడే కొడుకు కావడంతో అడిగినవన్నీ క్షణాల్లో అతని ముందుంచా. చిన్నప్పుడు వాడు బ్యాటరీ కారు కొనివ్వమంటే నేను రిమోట్ కారు కొనిచ్చా. ఆడుకోడానికి రోజూ గ్రౌండ్‌కెళ్తానంటే ఇంట్లోనే గ్రౌండ్ ఏర్పాటు చేయించా. కానీ ఈ రోజు తనను కాదన్నందుకు ఓ అమ్మాయిని చంపాలని చూశాడంటే నిజంగా నమ్మకలేకపోయా. అలా ఎందుకు మారాడని? నా పెంపకంలో ఎక్కడ లోపముందని? నాలో నేను ప్రశ్నించుకున్నా.

చిన్నప్పటి నుండి అడిగినవన్నీ ఇప్పించడంతో తను కోరుకున్నది దక్కితీరుతుందని ఫిక్సయిన అతని మెంటాలిటీకి మొదటిసారి సంధ్య రూపంలో వ్యతిరేకత ఎదురవడం ఒక కారణమైతే... అమ్మా, నాన్నా, అక్కా, చెల్లీ, తమ్ముడూ వంటి బంధాల విలువ తెలీక పోవడం మరొకటి.

మేం ముగ్గురుం కుటుంబ సభ్యులమైనా.. నెలలో ఒక్క రోజూ కలిసి గడపం. కారణం మారిన పరిస్థితులు. రాత్రిళ్లు లేటుగా రావడం వల్ల నా భార్య రాధ త్వరగా లేవదు. నేను కాల కృత్యాలు తీర్చుకుని, పేపర్ చదివే వరకు తొమ్మిదవుతుంది. వంట మనిషి చేసిన టిఫిన్ తిని ప్రమోద్ అప్పటికే కాలేజ్‌కు వెళ్లిపోతాడు. అత్యవసరమై ఏదైనా మాట్లాడాల్సి ఉన్నా సెల్‌ఫోన్స్ మేమున్నామంటున్నాయి. రోజుల తరబడి ఇంటికి రాకుండా ఉండి చూడాలనిపించినా ల్యాప్‌టాప్స్ మేమందుకు తీసిపోమంటున్నాయి. ఈ నేపథ్యంలో బంధాల గురించి, మంచి చెడుల గురించి ప్రమోద్‌కు తెలిసే దారేదీ?

మీ కుమారులూ ప్రమోద్‌లా కోర్టులో ముద్దాయిల్లా నిలబడాల్సి రాకూడదంటే నాదో మనవి. టీనేజ్ ఓ కోర్కెల చౌరస్తా. ఊహల సామ్రాజ్యం. సందేహాల లోగిలి. తప్పటడుగేసినా... తడబడినా.. పునాది పడేదిక్కడే. మీ కుమారుడు బైక్ అడిగితే కొనివ్వండి. కానీ... వేగంగా వెళ్తే ప్రమాదమని చెప్పడం మరిచిపోకండి. బాధపడితే "నేనున్నాను" అంటూ భరోసా ఇవ్వండి. సంతోషపడితే అందులో పాలు పంచుకోండి. కనీసం వారానికోసారి వారితో గడపండి. ఇష్టా-ఇష్టాలు తెలుసుకోండి. బంధాల అనురాగాల్ని, మంచి-చెడుల సమాహారాల్ని విడమర్చి చెప్పండి. ప్రేమానురాగాలు కరువై మోడుబారిన వారికి కావాల్సింది సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు కాదు. చొరవ. అంతకు మించి ఆప్యాయత. తప్పుచేస్తే పెద్దరికం చూపి విలన్ కాకండి. సున్నితంగా మందలించి వారి మనసులో స్థానం సంపాదించుకోండి. వారిలో నేర ప్రవృత్తిని పెంచి పోషిస్తున్న టీవీ ఛానళ్లను నిలదీయండి. అప్పుడు మీ పుత్ర'రత్నాలు' విషపు గుళికలుగా మారే అవకాశ ముండదు. లేదంటే సమాజంలో యువతరం మనుగడ ప్రశ్నార్థకమౌతుంది" ఆ మాటలకు హాలంతా చప్పట్లతో మారు మోగింది. మాట్లాడేందుకు అవకాశమిచ్చిన జడ్జికి కృతజ్ఞతలు తెలిపి, బయటికొచ్చాడు శ్రీనివాస్.

ఆఫీస్ పనిమీద రెండు రోజులు టూర్‌వెళ్లిన రాధ రాగానే శ్రీరాం, ఉదయ్‌ల తల్లిదండ్రులు శ్రీనివాస్ మీద కోపంతో "అబ్బాయి ఏదో తెలీక ప్రేమిస్తున్నానని అమ్మాయి వెంట పడ్డాడట. ఆ విషయాన్ని ఇంట్లో మాట్లాడుకోవాలేగాని ఇలా రచ్చకీడ్చడం ఏమైనా బావుందా" అని అసలు విషయాన్ని కప్పిపుచ్చి, లేనిపోనివి చెప్పారు. అదే నిజమని నమ్మిన రాధ భర్తను నిలదీస్తుంది. చివరికి నిజం తెలిసి నిర్ఘాంతపోతుంది. స్నానం చేసి వచ్చాక కూడా రాధ అలాగే ఉండటాన్ని చూసి కరిగిపోయాడు శ్రీనివాస్.

దగ్గరకు తీసుకుని-"పిచ్చిదానా వాడు నీ ఒక్కదానికేనా కొడుకు? నాకు కాడా? వానిమీదేదో కోపంతో నేనీ పనిచేయలేదు. తప్పు చేస్తే శిక్ష పడుతుందని తెలియజేయడానికే. ఇప్పుడు నేను వాణ్ణి ఈ కేసు నుండి తప్పిస్తే వాడు మరో తప్పు చేసే అవకాశముంది. ఇప్పుడు ఆ ఛాన్సు లేదు" అంటూ తల నిమిరాడు. అంత వరకు పొంగుకొస్తున్న దుఖాన్ని ఇక ఆపుకోలేనంటూ శ్రీనివాస్ భుజంపై ముఖం వాల్చి భోరున ఏడ్చేసింది రాధ.

★

సాహిత్యోపజీవికి పాఠకుడు కావాలి. కథారచయిత, వ్యాసరచయిత ఎదురైనా తన రచన నలుగురూ చదవాలని పాఠకులనుద్దేశిస్తారు. కవిగారికి అదనుగా శ్రోత కావాలి. నాటక రచయితకూ ప్రదర్శనమూ, ప్రేక్షకుడూ కావాలి. మొత్తానికి అంతా ఒక గుర్తింపు కాంక్ష.

నాకోసం నేను రాసుకుంటున్నానన్నవాడైనా తన రచన తన దగ్గరే వుంచేసుకోడు. తప్పనిసరిగా ఒకరికి చూపించడమో, చూసేలా చేయడమో చేస్తాడు. అది రచయిత నైజం. అందులో తప్పు పట్టాల్సిందేమీ లేదు. సిరా తడి ఆరకుండానే అచ్చుకు పంపే రచయితలు కొందరైతే కాలానికి ఆగి తనది తానే చదువుకుని అవసరమైతే చిత్రికలు పెట్టుకుని బహిర్గతం చేసుకునేవారు ఇంకొందరు. అచ్చులో తన పేర రచన చూసుకోవడం ఎప్పటికీ రచయితలకు ఇష్టమే. అది చదివి పాఠకులు మెచ్చితే సంతోషపడనిదెవ్వరు? గుటెన్‌బర్గ్ అచ్చుయంత్రాన్ని కనుక్కున్నాడు కనుక సరిపోయింది. భావ వినిమయ సాధనమైన భాష లిపిగా అక్షరాకృతి దాలుస్తుంది. సృజన సాహిత్యం, సామాజిక పరిణామ ప్రక్రియల భావజాలం 'పత్రిక' రూపున ముద్రణ రూపంలోకి వచ్చేదాక జరిగిన పరిణామాలు చారిత్రాత్మకమైనవి.

పత్రికల ముద్రణా విస్తృతి లేని కాలంలోనూ భావ వినిమయాభిలాషను తీర్చడంలో, తమ భావాలను నలుగురికీ అందచేయడంలో ఉత్సాహభరితంగా జరిగిన వ్యాప్తులు అనేకం. ఉత్తరాలు రాసుకోవడం, కరపత్రాలు పంచుకోవడం, గోడమీది రాతలు ఇవన్నీ ఒకప్పటి బలీయమైన మాధ్యమాలు. తమ భావ ప్రచారానికి, సృజన శక్తుల వినిమయానికి, స్వీయ అనువాదానుభూతులకు, పదుగురిలో ప్రత్యేకతకు ఒక అందమైన సాధనంగా తోడ్పడిందే 'లిఖిత పత్రిక'.



లిఖిత పత్రికలు

చేతిరాతతో పత్రికలు నిర్వహించడం ఎప్పటినుండో వుంది. గోడ పత్రికలు అంటే ఆ గోడ దగ్గరకు వెళ్ళి నిల్చుని చదవాలి. లిఖిత పత్రిక అంటే కాగితాల మీద రూపొందించింది కాబట్టే నలుగురి చేతులు మారుతూ అంతా చదువుకునే వీలుండేది. అచ్చులో రాకున్న లిఖిత పత్రికలో తమ రచన నలుగురూ చదువుతారన్న మౌలిక ఆనందం వాటిని నిర్వహించేవారికీ, అందులో రచన చేసే వారికీ కలుగుతుంది.

దేశ స్వాతంత్ర్య పోరాటకాలంలో, సామాజిక పరిణామ ప్రక్రియలకు దర్పణంగా, తమ దేశ భక్తి, భావదీప్తుల ప్రచోదిత మార్గంగా లిఖిత పత్రికలను వెలువరించినవారున్నారు. రహస్య లిఖిత ప్రతులను బట్వాడా చేసిన అజ్ఞాత విప్లవ మూర్తులూ వుండేవారు. అచ్చు పత్రికలున్నా అందరికీ, అందునా సృజనశీలురైన కవులూ, రచయితలు అందరికీ అవి వేదికలు కావడం, అన్ని రకాల రచనలనూ ప్రోత్సహించడం అనుకున్నంత సులువేమీ కాదు. అందుకే సృజనశీలురైన కవులు, రచయితలు కొందరు లిఖిత పత్రికలు నిర్వహించేవారు.

కవిత్వమో, కథో తమకు రాసే అలవాటులేకున్నా అందమైన చేతిరాత గల కొందరు సంపాదకులుగా, మిత్రులను సమీకరించి వారు రాసే కథలు, కవితలు, వ్యాసాలతో, చిత్రకారుల బొమ్మలతో లిఖిత పత్రికలు నడిపేవారు. మరీముఖ్యంగా చిన్నప్పటినుంచే సాహిత్యాభిరుచిని, రచనాభిలాషను పెంపొందింపచేయడానికి కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు తరగతి విద్యార్థుల రచనలతో ఇలాంటి లిఖిత పత్రికలను రూపొందించేవారు. అలాగే ఆసక్తిగల సాహిత్య యువబృందాలు తమ రచనలతో అలంకరిస్తూ లిఖిత పత్రికలు తెచ్చేవారు. ఒక వార్షిక సంచికగానో, నిర్దుష్ట వ్యవధిని నిర్దేశించుకునో అలా లిఖిత పత్రికా నిర్వహణం చేసిన వారున్నారు. అయితే ఎవరెవరు ఏయే లిఖిత పత్రికలను రూపొందించిందీ ఈనాడు చెప్పడం చాలా కష్టం. ఆ సంచికలను భద్రపరచడం కూడా వారివారికి అందరికీ సాధ్యమైన విషయం కాకపోవచ్చు. లిఖిత ప్రతులు తొందరగా చినిగిపోయి, చెరిగిపోయే ప్రమాదం, కాగితాలకు అవి సిరాతో రాసినవి కనుక వెలసిపోయి అక్షరాలు స్ఫుటంగా కనబడలేని స్థితి కలగడం సహజం.

తమ గురించి, తమ అనుభవాలు జ్ఞాపకాల గురించి వారు రాసుకున్నప్పుడు, స్వీయ చరిత్రలు, జీవిత చరిత్రలు అచ్చు రూపంలో వెలువడినప్పుడు వాటిల్లో ప్రస్తావించివుంటే వారి అభిరుచులు, ఆయా లిఖిత పత్రికల వైనం తెలిసే వీలుంటుంది. అయితే భవదీయ వ్యాసరచయిత స్వయంగా లిఖిత పత్రికలను నడపడం, జంట నగరాల లిఖిత పత్రికల సమాఖ్య నెలకొల్పి నిర్వహించారు కనుక, తెలిసిన మేరకు కొన్ని అలాంటి ఆసక్తికర అంశాలను ఉటంకించడమే ఇక్కడ ఉద్దేశ్యం.

ఒక్క తెలుగులోనే కాదు. ఇతర భాషల్లోనూ ఇలాంటి లిఖిత పత్రికలు వున్నాయి. సాహిత్యాభిలాషతో ఎందరో వాటి నిర్వహణలో భాగస్వాములయ్యారు. అయితే ఎక్కువగా లిఖిత పత్రికలు సాహిత్యాసక్తిగల పిల్లలు, వర్ధిష్ణు రచయితలైన యువకులు నిర్వహించినట్లు తెలుస్తోంది. అలా లిఖిత పత్రికలనుండి ఎదిగి అనంతర కాలంలో లబ్ద ప్రతిష్టులైన రచయితలు, వివిధ రంగాల ప్రముఖులు ఎందరో వున్నారు.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీతలైన ప్రముఖుల్లో 'అజ్ఞేయ్' పేరున ప్రసిద్ధి చెందిన సచ్చిదానంద్ హీరానంద్ వాత్స్యాయన్ తన పదకొండవ ఏటనే 'ఆనంద బిందు' అనే లిఖిత పత్రికను 1921లో నిర్వహించారు. అలాగే జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన అస్సామీ రచయిత బీరేంద్ర కుమార్ భట్టాచార్య జోర్హాట్‌లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతుండగా తోటి మిత్రులు నడిపిన లిఖిత దినపత్రికలో, లిఖిత మాస పత్రికలో రచనలు చేస్తూ అప్పట్లో బాల రచయితలకై నిర్దేశించిన బంగారు పతకం పొందారు. 1973లో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కన్నడ కవి ఆ ఏటి అవార్డును ఒరియా రచయిత గోపీనాథ్ మహంతితో పంచుకున్నారు. ఆ కన్నడ కవి అయిన డా॥ దత్తాత్రేయ రామచంద్ర బేంద్రే ధార్వాడ్‌లో 18 ఏళ్ల ప్రాయంలో 'కర్ణాటక మిత్ర' అనే హస్త లిఖిత పత్రిక నడుపుతూ 1919లో 'వాగ్భూషణ' పత్రికా సంపాదకులయ్యారు. ఆ మాటకు వస్తే 1897లోనే జార్జ్ హెండర్ సన్ థామస్ జాన్‌స్టోన్ చేతిరాతతో క్విల్ అనే లిఖిత పత్రికను లెదర్ బైండింగ్ చేయించి వెలువరించాడట!

'కవిత్వమొక తీరని దాహం' అని శ్రీశ్రీ అన్నట్లు సాహితీ పిపాసులకు లిఖిత పత్రికలు ఆ దాహం తీరిన తృప్తినిచ్చేవని చెప్పుకోవచ్చు. తెలుగు రచయితలూ, కవులూ ఎందరో లిఖిత పత్రికలతో ముడిపడినవారున్నారు. వివిధ కళారంగాల ప్రముఖులూ లిఖిత పత్రికలతో సంబంధితులై వుండేవారు.

రాజమండ్రిలో వీరేశలింగం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులైన శ్రీ జయంతి గంగన్న (1884-1962) కళాసమితి అనే చిన్న వాఙ్మయ సంఘం స్థాపించి 1926లో ఒక రాత పత్రికను బయలుదేరదీసి రాసిన వ్యాసాలను బైండు చేసే వాళ్లం అని సాహితీవేత్త టేకుమళ్ల కామేశ్వరరావు గారు రాశారు. 'అయ్యో కోయొడ' అనే హాస్య జానపద గీతం జయంతి గంగన్న గారు రాసిందేనట. ఆచుటవెంకట సాంఖ్యాయన శర్మ (1864-1934) ఒక లిఖిత పత్రిక నిర్వహించారని, అనంతరం ఆయన వెలువరించిన సంజనమోదిని(1903), కల్పలత(1921), పత్రికల్లో కేవలం ఆయన రచనలే ముద్రించుకునేవారనీ

తెలుస్తోంది.

వుత్సాహవంతులైన యువకులు తమ సాహితీ ప్రియత్వానికి లిఖిత పత్రికలను బాసట చేసుకుని రచనలు వెలువరించేవారు. వాటిల్లో సచిత్ర లిఖిత పత్రికలూ వుండేవి. అందమైన బొమ్మలు, ముత్యాల కోవలాంటి చేతిరాతతో స్నేహబృందాలనూ, గ్రంథాలయ పాఠకులనూ అలరించిన లిఖిత పత్రికలుండేవి. కుల పత్రికలు కూడా వెలువడినట్లు తెలుస్తోంది.



1960-70 దశకంలో తెలుగులో అచ్చు పత్రికలు ఎన్నివుండేవో అంతకు మించి లిఖిత పత్రికలూ వుండేవి. హైదరాబాద్ మలక్‌పేట ప్రభుత్వోన్నత పాఠశాలలో ఏడవ తరగతిలో వుండగానే తరగతి విద్యార్థులం 'విజ్ఞానజ్యోతి' అనే లిఖిత పత్రికను 1961లో నిర్వహించాం. విద్యార్థుల చిట్టికథలు, గేయాలు, వచ్చీరాని బొమ్మలు అందులో వుండేవి. ఆంధ్ర బాలానంద సంఘం నల్లకుంట విద్యానగర్ శాఖ విశ్వకవి విజ్ఞానకేంద్రంగా వ్యవహరింపబడుతూ దాని నిర్వాహకులైన జె. పూర్ణ చంద్రరావుగారు ఓ లిఖిత పత్రిక నడిపేవారు.

సుధామగా కలంపేరు పెట్టుకుని నేను సంపాదకునిగా ప్రముఖ స్త్రీవాద కవయిత్రి జయప్రభ భర్త అయిన నాటి విశ్వనాథ సూర్యనారాయణ ఉపసంపాదకునిగా 1967 మేలో 'యువమిత్ర' అనే లిఖిత పత్రిక ప్రారంభించాం. నేను పుట్టకముందే మద్రాసు త్యాగరాయనగర్‌లోని ఆంధ్రాభ్యుదయ సమితి వారు 26.1.1951న వెలువరించిన 'ఉదయ' అనే సచిత్ర మాస పత్రిక లిఖిత ప్రతి తొలి సంచిక నా కంటబడింది. బాలశౌరిరెడ్డి, సేతు మాధవరావు, కాశీరత్నం మొదలగు ఎనిమిది మంది సంపాదకవర్గంతో వచ్చిన ఆ సచిత్ర లిఖిత పత్రిక సంపాదకీయ స్వవిషయం వుత్తేజితుడిని చేసింది.

1967లో నేను ప్రారంభించిన 'యువమిత్ర' సచిత్ర లిఖిత మాసపత్రిక మధ్యలో స్వల్ప విరామాలు తీసుకున్నా దాదాపు పదేళ్లు నెలనెలా వెలువడింది. హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంలో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో, గాంధీ స్మారకనిధి గ్రంథాలయంలో, మలక్‌పేట అమర్ జవహర్ బాలానంద సంఘంలో ఆ లిఖిత పత్రిక ప్రతి వారం, పదిరోజులు వుంచి రొటేట్ చేసేవాళ్లం. సంచిక చివర ఒక చిన్న తెల్లకాగితాల పుస్తకం వుంచి పాఠకులను సంచికపై, సంచికలోని రచనలపై అభిప్రాయాలు రాయమనేవాళ్లం. 1974 నాటి జనవరి సంచికలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన నేటి డా॥ సి.నారాయణ రెడ్డిగారు "యువమిత్ర ముద్రిత పత్రికలు ముఖం చూసుకోదగిన అద్దం" అని ప్రశంసించడం, అలాగే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి కార్యదర్శిగా పనిచేసిన కీర్తిశేషులు ఇరివెంటి కృష్ణమూర్తిగారు "యువమిత్రను ఇంత అందంగా మలచగలిగిన మీ లేఖిని యంత్రాలను ఎగతాళి చేస్తుందని, కళా యంత్రబద్ధం కానంత వరకు తపస్సే" అనడం .వారి చేతిరాతతోనే ఆ లిఖిత పత్రిక సంచికలో నమోదు అయివున్నాయి. యువకులు, యూనివర్శిటీ హాస్టల్ విద్యార్థులు ఎందరో యువమిత్రను చదివేవారు. రచనలు పంపేవారు. తెలుగు విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, కవి డా॥ఎన్.గోపి, కవి, విమర్శకులు అమ్మంగి వేణుగోపాల్ యువకులుగా యువమిత్ర కార్యాలయానికి వచ్చి రచనలు ఇవ్వడం, అమ్మంగి రాసిన 'ఇరుకులు' అనే కథ లిఖిత పత్రికలో రాయడం ఒక స్మృతియే! అప్పట్లో మద్రాసులో క్యాలెండర్ కంపెనీలో పనిచేస్తూ క్యాలెండర్ బొమ్మలు రూపకల్పన చేసే కొలి ధర్మారావు 'యువమిత్ర' పత్రికను చూసి ముచ్చటపడి ప్రథమ వార్షికోత్సవ సంచికకు ఆయిల్ కలర్స్‌తో తాను ముఖచిత్రం వేశారు. మురళీ శంకర్ వంటి చిత్రకారులు బొమ్మలు వేశారు.

ఆ కాలంలోనే జంటనగరాల నుండి వి. మధుసూదనరావు 'యువతార', జీడిగుండు కామేశ్వరావు, వెంకట్రావుల 'యువసాహితి', 'యువబాల', వి. హనుమంతరావు, కన్నోజు లక్ష్మీకాంతంల 'సాహితీ లత', ఇంకా కళాబాల, కవిత, మెరుపు అలాగే యువభారతి సాహితీ సాంస్కృతిక సంస్థ 'యువభారతి' వంటి లిఖిత మాస పత్రికలు ఎన్నో వచ్చాయి. ప్రముఖ నటులు కొంగర జగ్గయ్య 'శోభ' అనే లిఖిత పత్రికను యువకులుగా నిర్వహించారట. దుర్గానంద్ కుమారులు అంబికానంద్, జి.వి. పూర్ణచంద్ కలిసి నూజివీడు నుండో, భీమవరం నుండో 'మేఘమాల' అనే లిఖిత పత్రిక తెచ్చారు. చొక్కపు వెంకట రమణ, జీడిగుంట రామచంద్రమూర్తి వంటివారు లిఖిత పత్రికల నిర్వహణ చేసినవారే!

జంట నగరాల్లో 1960ల కాలంనుండీ చాలా సంవత్సరాలు వెలువడిన లిఖిత పత్రికలన్నింటినీ ప్రతిఏటా పరిశీలించి ఆ ఏడాది వచ్చిన పత్రికల కథల్లో ఉత్తమమైన వాటికి యువమిత్ర సారథ్యం వహించి జంటనగరాల లిఖిత పత్రికల సమాఖ్య నెలకొల్పి బహుమతులిచ్చేది.

లిఖిత పత్రికల నిర్వహణం, ఆసక్తి, ఉత్సాహం అభినివేశం ప్రత్యేకంగా సాగేవే. మంచి చేతిరాత లిఖిత పత్రికకు ముఖ్య ఆకర్షణ. కవితలు, కథలు, బొమ్మలు, సీరియల్స్‌తో అచ్చుపత్రికలకు తీసిపోని విధంగా లిఖిత పత్రికలుండేవి. కొన్ని, 1990 ప్రాంతాల్లో కూడా సెయింట్‌జోసెఫ్ పబ్లిక్ స్కూల్ తరగతి విద్యార్థులు లిఖిత పత్రిక నడిపిన వార్త వుంది. కొన్ని కాగితాలు, రంగులు, తీరిక సమయం సద్వినియోగం చేయడం ఇవే ప్రధానమైన పెట్టుబడులు. సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేసే కుతూహలం గల వారెవరైనా కొందరు కలిసి లిఖిత పత్రికలను నిర్వహించడం జరుగుతుండేది. కార్బన్ పేపర్లు పెట్టి రాసి రెండు మూడు ప్రతులు చేసేవారు కొందరైతే, ఆ తరువాత సైక్లోస్టయిల్ మిషన్ వచ్చాక సైక్లోస్టయిల్ లిఖిత పత్రికలు వచ్చాయి. 1980ల్లో శ్రీ పద్మాంజలి నవ్యకళావాహిని 'మానవత' అనే సచిత్ర మాస పత్రికను సైక్లోస్టయిల్ కవితా సంకలనంగా, సైబ పరంధాములు చేతి రాతతో, బొమ్మలతో, కవిత్వంతో ఎ.సూర్యప్రకాష్, వెన్ను గంగాధర్, స్వాతి శ్రీపాదలతో 'చౌరస్తా' అనే సంకలనం వెలువరించారు. అది ఒక సంచలనమే నాడు.

లిఖిత పత్రికలకు పాఠకుల సమాచారణ ఎంతగా వుండేదంటే యువమిత్ర లిఖిత మాస పత్రికలోని కథ ఒక దానిని ఆ రచయితే నాడు విజయవాడనుండి వెలువడే 'ప్రగతి' వార పత్రికకు పంపగా, వారది ముద్రించగా మరుసటి వారం పాఠకుడొకరు అది కాపీ కథ అనీ, యువమిత్ర లిఖిత మాస పత్రికలో అంతకుముందే వచ్చిందనీ ప్రగతికి లేఖ రాయడం, వారు దానిని ప్రచురించడం ఒక విశేషం! సైక్లోస్టయిల్ మాస పత్రికలు కూడా లిఖిత పత్రికల వంటివే. అయినా ప్రతులు ఎక్కువ తీసుకునే వీలుండేది రంగుల్లో లేకపోయినా. మాక్జిమ్ గోర్కి 'మదర్'ను అమ్మ పేరిట నవలగా అనువదించిన క్రొవ్విడి లింగరాజుగారు 1922లోనే మార్చి 22న 'ఆంధ్ర యువజని' పేర సైక్లోస్టయిల్ లిఖిత మాస పత్రిక వెలువరించగా మద్దూరి అన్నపూర్ణయ్యగారి సంపాదకత్వాన 1929 మార్చి 16న 'కాంగ్రెస్' అనే తెలుగువార పత్రిక లిఖిత సైక్లోస్టయిల్ పత్రికగా వచ్చింది. రాజమండ్రి నుండి 1938లో 'నవశక్తి' పేరిట తొలి వామపక్ష పత్రిక తొలుత లిఖిత పత్రికగానే మొదలయింది.

ఇంకా వెలుగులోకి రాని లిఖిత పత్రికల సమాచారం ఎంతగానో వుండేవుంటుంది. పరిశోధక విద్యార్థులెవరైనా పూనుకుని 'లిఖిత పత్రిక'ల గురించి సిద్ధాంత గ్రంథమే వెలువరించవచ్చు. సాహిత్యాభిలాష, పఠనాభిలాష, రచనా ప్రతిభ, చేతిరాత అభివృద్ధికి లిఖిత పత్రికలు పోషించిన పాత్ర అవిస్మరణీయమైనది. సాహిత్య, చైతన్యశీలమైన ఆనాటి బాల, యువ ప్రజాశక్తిలో లిఖిత పత్రికల ఉనికి గణనీయమైనది. చారిత్రాత్మకమైనది.

- సుధామ

సర్టిఫికెట్‌ను తెలుగులో ఏమంటాం?

హాయ్ చిన్నారులూ! ఈ పజిల్ మీకు నచ్చిందా? ఈవారం మేం అడిగే ఇంగ్లీషు పదం కోసం రెడీగా ఉన్నారా? మేం కూడా ఇంకో పదంతో సిద్ధంగా వున్నాం. ఇవాళ మీరు ఆ పదానికి వెంటనే సమాధానం చెప్పాలి మరి. ఇవాళ్టి పదం... సర్టిఫికెట్ (certificate) దీనికి తెలుగులో అర్థం మీకు తెలుసా? తెలియకపోతే వెంటనే జవాబు చూడకండి. కాసేపు ఆలోచించండి. అయినా తట్టకపోతే డిక్షనరీలో వెతకండి. దాంతోపాటు మరికొన్నిటికి అర్థాలు తెలిసే అవకాశముంటుంది. ఒకవేళ తెలిస్తే జవాబు చూసి మీ సమాధానం సరైనదో కాదో తెలుసుకోండి.

వీరివీరి గుమ్మడి పండు వీరి పేరేమి?

నేస్తాలూ...పక్కనున్న ఫొటోలో వున్నది ఎవరో తెలుసా! ఎవరీ గిరిజాల జుట్టు బుడతడు అనుకుంటున్నారా? మన రాష్ట్ర రాజకీయ, సినీ చరిత్రలో ఈయనకి ప్రత్యేక స్థానం వుంది. ఎవరో గుర్తొచ్చారా? తెలీకపోతే పుస్తకం తిప్పి చూడండి. ఎవరో తెలిసిపోతుంది.

పూలబుట్ట

హాయ్ ఫ్రెండ్స్! వారం వారం మేం చెప్తున్న క్రాఫ్ట్ చేసేస్తున్నారా? అయితే మనం ఇవాళ ఒక పూలబుట్టను తయారు చేయడమెలాగో చూద్దాం. మీరు ఎంచక్కా పూలు కోసేప్పుడు అది ఉపయోగించుకోవచ్చు. ఇంకా మీ చిన్న చిన్న వస్తువులు అందులో పెట్టుకోవచ్చు.

కావలసిన వస్తువులు

బెలూన్,

న్యూస్ పేపర్,

తెలుపు రంగు గమ్ (లేదా మైదాతో చేసిన లై),

పెయింట్,

పెయింట్ బ్రష్.

తయారు చేసే పద్ధతి

ముందుగా బూరలోకి గాలిని ఊదండి. తరువాత న్యూస్ పేపర్‌ను ఒక అంగుళం వెడల్పు ఉండేట్టు ముక్కలుగా చేసుకోవాలి. ఇప్పుడు వాటిని గమ్‌తో బూర సగభాగానికి అంటించాలి. అలా నాలుగు పొరలు అంటిస్తే చాలు. మిగతా సగభాగంమీద కాగితం ముక్కలను రెండు వరుసలుగా అంటించండి. ఇది బుట్ట కాడ అన్నమాట. పూలబుట్టను పట్టుకోవడానికి హ్యాండిల్ కావాలికదా. అయితే దీనికి రెండు పొరలు అంటిస్తే సరిపోతుంది. దాన్ని ఒక రోజు ఎండబెట్టాలి. ఇప్పుడు బెలూన్‌లోని గాలిని తీసేసి కాగితాలు అంటించుకున్న దాని ప్రకారం బూరను కత్తిరించుకోవాలి. తరువాత దానికి మనకిష్టమైన రంగులను (ముదురు గులాబీ, నారింజ, కలగలిసిన నీలం, ఎరుపు రంగులు బాగుంటాయి. 'పెయింట్' బ్రష్‌తో వేసుకోవాలి. అంతే పూల బుట్ట రెడీ అయిపోయినట్టే.



ఫన్ క్విజ్

తియ్యగలరా?



ఒక సీసాలో ఓ రూపాయి బిళ్ల ఉంది. కార్కుతో ఆ సీసా మూతి మూసి ఉంది. అయితే మీరు కార్కును బయటకు లాగకుండా, సీసాను పగలగొట్టకుండా అందులోంచి రూపాయి బిళ్ల తియ్యగలరా?

చెప్పగలరా?

నేను గుర్రాలు, జీబ్రాలు, అడవి కుక్కలు, అడవి పిల్లుల మీద స్వారీ చేస్తాను. వాటి మీద స్వారీ చేసే సమయంలో ఎటువంటి ఆయుధాలనూ ఉపయోగించను. నేను చాలా ధైర్యవంతురాలిని. నాకు అడవి జంతువులన్నా భయం లేదు. ఎందుకో మీరు చెప్పగలరా?

ఎందుకని?

కిరణ్ వాళ్ల అమ్మానాన్నలు ఇంట్లోకి కావలసిన సామాన్లు కొనుక్కురావడానికి బయటికి వెళ్లారు. ఆ సమయంలో కిరణ్‌కి ఆకలేసింది. ఆమ్లెట్ వేసుకుని తినాలనుకున్నాడు. నిచ్చెన ఎక్కి షెల్ఫులో నుంచి గుడ్డును తీస్తుంటే చేతిలోంచి జారింది. అది ఒక మీటరు ఎత్తునుంచి కింద పడినా పగలలేదు. ఎందుకని?

తియ్యగలరా?: కార్కును సీసాలోకి నెట్టి దాన్ని తలకిందులుగా విదిల్చండి. అంతే! రూపాయి కింద పడిపోతుంది.
ఎందుకని?: ఆ నిచ్చెన ఎత్తు 2 మీటర్లు. గుడ్డు 2 మీటర్లు కిందికి వచ్చాక పగులుతుంది.
చెప్పగలరా?: ఎందుకంటే ఆ జంతువులన్నీ కలపతో చేసినవి కనుక!

జనా

డా...డాల్ఫిన్లు

- మిగతా జంతువులతో పోలిస్తే డాల్ఫిన్లు ఎక్కువ తెలివైనవి.
- ఇవి మాంసాహారాన్నే భుజిస్తాయి.
- వేట తిమింగలం ఒక రకమైన డాల్ఫిన్ జాతికి చెందినదే.
- సీసా ఆకారంలో ముక్కు ఉండే డాల్ఫిన్లు సాధారణమైన డాల్ఫిన్లు.
- 12 డాల్ఫిన్లు కలిసి ఒక్కో తరగతిగా ఉంటాయి.
- డాల్ఫిన్లు నీటిలో ఎగురుతుంటాయి. అలలను ఈదుతుంటాయి. ఒక్కోసారి పోట్లాడుకుంటాయి. అప్పుడప్పుడూ మనుషుల్లాగా ఈదుతుంటాయి.
- వాటి తలపై ఉన్న రంధ్రం ద్వారా శ్వాస తీసుకుంటాయి.
- డాల్ఫిన్లకు చూపు, వినికిడి శక్తి బాగా ఉంటుంది. శబ్దాలను బట్టి ప్రదేశాలను, వస్తువులను గుర్తుపడతాయి.
- అవి ఈలల ద్వారా, శబ్దాల ద్వారా మాట్లాడుకుంటాయి.



రంగులు అద్దేద్దాం



హ్హా...హ్హా

అగ్గిపుల్ల

తండ్రి: ఇంటికి నిప్పంటుకుంటే ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేయాలి కానీ దేనికోసం వెతుకుతున్నావ్?

రాము: అగ్గిపెట్టె కోసం నాన్నా.

తండ్రి: నిప్పునార్పడానికి నీళ్లు కావాలి కానీ అగ్గిపెట్టెందుకు?

రాము: ముల్లును ముల్లుతోనే తీయాలని, వజ్రాన్ని వజ్రంతోనే కోయాలని మీరేగదా అన్నారు.

భవిష్యత్తు

టీచర్: లోకేష్! "నేను ఒకతన్ని చంపాను" అనే వాక్యానికి భవిష్యత్తు కాలంలో చెప్పు.

విద్యార్థి: "మీరు జైలుకు వెళ్తారు"

కుక్క కనబడుటలేదు

రవి తన కుక్క పోయిందని పోలీసు స్టేషన్‌లో కంప్లెయింట్ చేయడానికి వెళ్లాడు.

పోలీసు ఇన్‌స్పెక్టర్: న్యూస్ పేపర్‌లో ప్రకటన ఇవ్వకపోయావా?

రవి: భలే చెప్తున్నారు సర్! నా కుక్క చదవలేదు కదా.

మాటల కోట - 2

రూపకల్పన : వెంకట సుబ్బారావు కావూరి

1	2		*	3	4	*	5	6
7		*	8			*	9	
	*	10	11		*	12	*	
*	13			*	14		15	*
16			*	*	17			*
18		*	19	20			*	21
*	22	23			*	*	24	
25	*		*		*	26		
27			*	28				*

<u>అడ్డం</u>

1. ప్రకృతి కాదు (3)
3. మరొక. మజ్జిగన్నం అని కూడా (2)
5. ఆ..తెలుగు సినీ హాస్యనటుడు (2)
7. రాయి. కొందరికి హృదయం స్థానంలో ఇది ఉందని నింద (2)
8. కూలివాడి కండలలో ధనమున్నదిరా... సినీగేయ రచయిత. శ్రీశ్రీ మేనల్లుడు (3)
9. గారె. తమిళనాడు నుంచి దిగుమతయింది. ఇడ్లీ జత (2)
10. పరిసరమే. ఒకటి అడ్డంకు విరుద్ధం (3)
13. ధర్మరాజు (3)
14. అబ్రకదబ్రలా వినికిడి. ఇదో లోహ (3)
16. సమరానికి అన్న. స్వాతంత్ర్య సమరంలో ఓ ప్రధాన ఘట్టానికి హేతువు. వంటలో ఇది ముఖ్యమే (3)
17. మార్పు తడబడింది (3)
18. వనం. తోట (2)
19. పసోళ్లకి అవీ, ఇవీ తెలియదంటాడు మహాకవి శైశవగీతికలో (4)
22. ఒకనాడు కథ చెప్పేవాడు. ఇప్పుడు రాసేవాడు (4)
24. ఎక్కువ మంది ఒకేసారి నోళ్లు తెరిస్తే ఇదే. తిరగబడిన ఇది లేకుండా పిల్లలెలా అవుతారు? (2)
27. మెట్ట కాదు. ద్రవించిన భూమి (3)
28. విల్లు పట్టినవాడు. రాసినవాడు కాదు సుమా. తారుమారైతే (4)

<u>నిలువు</u>

1. 'తీసుకోండి ఒక చిన్న బ్రేక్' అంటే ఇదే (3)
2. గ్రంథం, కావ్యం, పుస్తకం (2)
3. కోతి. కానీ కొందరు భక్తితో ఇలానే పిలుస్తారు. సంజయ్‌గాంధీకి ఈ పేరుతో విడదీయరాని బంధం (3)
4. శివుడు. కోపిష్టి (2)
5. వంటింట్లో ఉండవూ ఆవాలే తోక తెగింది (2)
6. రానా ఆరంగేట్రం దీంతోనే (3)
8. రూపం (3)
10. కొందరు రెండు కాళ్లతో, మరికొందరు వాహనంపై చేసేది. అన్నట్లు ఈ పేరుతో తెలుగులో విలక్షణ సినిమా కూడా వచ్చింది (3)
12. ఆడవే మయూరి, నటనమాడవే మయూరి ...పాట గాయక బాలుడు (4)
13. ప్రపంచం (4)
14. విశ్రాంతిలో ఏమోగానీ కొందరికి కూర్చున్నా ఇది తప్పదు (3)
15. ఛీ!ఛీ!. ముక్కులు మూసుకోందే ముందుకు పోలేం (2)
16. ప్రేమకోసమై పాపం పసివాడు దీన్లో పడ్డాడని పాతాళభైరవి గీతం. ఇక్కడ తలకిందులయిన దాంట్లో చేపలు, జంతువులు కూడా పడతాయి పాపం (2)
19. మిఠాయి తయారీలో ఇదే ముందు. జంతువుల నడక. మనిషి కూడా చేస్తాడు (2)
20. మీకు అత్యంత ఆప్తుడు 'పండు' మీనోట (4)
21. ఉత్తమ ఎద్దు జాతి.ప్రకాశం పంతులుగారి ఊరు (3)
23. భూమి (3)
24. తల తిరిగి బహువచనమయింది. తెగి తలకు చేరుతుంది. చెవిలో పెడితే నిరసన (3)
25. ఆవిడగారు, ఆమెకో అత్తగారు, ఆమెకో భర్తగారు... ఆవిడ భర్తగారి స్థానం నుంచి ఆయన్ని పిలవండి (2)
26. కష్టజీవికి ఇరువైపులా ఉండేవాడే (2)

మాటలకోట -1 జవాబు :

1 ఆ	ట	*	2 క	3 ల	4 క	త్తా	*	5 ఆ
మ	*	6 పా	ల	కో	వా	*	7 బా	వ
8 డ	9 జ	ను	*	*	తు	10 బా	*	కా
*	ల	*	11 కా	లం	*	ల	*	య
12 మా	య	దా	రి	*	13 ది	*	*	*
*	జ్ఞం	*	మె	*	ద్దు	14 ము	*	*
15 వ	*	*	16 అ	మీ	బా	*	17 చె	18 ద
ర	*	19 పా	*	*	టు	*	20 రు	క్కు
21 ద	శ	కం	రు	డు	*	22 చె	వు	లు

తెనాలి రామకృష్ణుడు వంకాయ కూర

శ్రీకృష్ణదేవరాయలు విజయనగర సామ్రాజ్యాన్ని పాలించే కాలం నాటి సంగతి. ఆయన తోటలో వంగ చెట్లుండేవి. వంకాయలు విరగకాసేవి. వాటితో చేసిన కూర భలే రుచిగా వుండేదని చెప్పకునేవారు. దాంతో సామాన్యులకే కాదు, కోటలో పనిచేసే మంత్రులకు, అధికారులకు కూడా ఆ వంకాయల పట్ల విపరీతమైన ఆసక్తి వుండేది. కూర తినే అదృష్టం లేకపోయినా కనీసం దూరం నుంచి తోటనైనా చూద్దామని జనం తండోపతండాలుగా వచ్చేవారు. దాంతో వంగతోటకు దిట్టమైన కాపరిని ఏర్పాటు చేశారు. అతని అనుమతి లేనిదే ఎవ్వరూ లోపలికి పోవడానికి వుండేదికాదు.

ఓసారి శ్రీకృష్ణదేవరాయలవారు తన ఆస్థానంలో పనిచేసే ముఖ్యులకు విందు ఇచ్చారు. అందులో ప్రధాన ఆకర్షణ వంకాయ కూర. అతిథులంతా లొట్టలు వేసుకుంటూ వంకాయ కూరను లాగించారు. తెనాలి రామలింగడుకు కూడా ఆ కూర ఎంతగానో నచ్చింది. ఆ రుచిని మర్చిపోలేక... ఇంటికెళ్లాక భార్యకు కూడా చెప్పాడు. వంకాయల గురించి, ఆ కూర రుచి గురించి అంత వివరంగా విన్నాక ఆవిడ ఆగలేకపోయింది. తను కూడా ఎలాగైనా రాయలవారి వంకాయ కూర రుచి చూడాల్సిందేనని పట్టుపట్టింది. అది అసాధ్యమని ఎంతగా చెప్పినా వినలేదు. దాంతో రామకృష్ణుడికి పెద్ద చిక్కే వచ్చిపడింది. రాయలవారి వంకాయలు సంపాదించడమెలా? అనే ఆలోచనతో అలా కూర్చుండిపోయాడు. చివరకు ఎలాగో ఒక ఉపాయం వేసుకొని బయలుదేరాడు. రామకృష్ణుడు తలచుకున్నాక సాధ్యంకానిది వుంటుందా? తెల్లవారుఝామున వంగతోటలోకి దూకి గబగబా ఒక పెద్ద వంకాయ కోసుకొని పైపంచలో చుట్టుకొని వడివడిగా ఇల్లు చేరుకున్నాడు.

భార్య చాలా సంతోషంగా వంకాయ కూర వండింది. భోజనాల దగ్గర భర్తకు, కుమారుడికి కూడా వంకాయ కూర వడ్డించబోయింది. దానికి రామకృష్ణుడు అడ్డుతగిలి...

"ఈ కూర పిల్లవాడికి పెట్టడం అంత మంచిది కాదు. వాడికి కూడా ఆ కూర నచ్చి... బయట ఎవరితోనైనా అన్నాడంటే మన ప్రాణాలు పోతాయి. అందుకని నువ్వు ఒక్కదానివే తిను" అంటాడు.

దానికి భార్య ఒప్పకోదు. ఇంతగా కూర వండుకొని పిల్లవాడికి పెట్టకుండా ఎలా? అంటూ తను కూడా తినకుండా కూర్చుంటుంది.

చేసేదిలేక తెనాలి రామకృష్ణుడు దానికి కూడా ఒక ఉపాయం ఆలోచిస్తాడు. ఆరోజు రాత్రి పిల్లవాడు మిద్దెమీద నిద్రపోతుంటాడు. ఒక బకెట్ నిండా నీళ్లు తీసుకెళ్లి పై నుంచి పిల్లవాడిమీద పడేట్లు పోస్తాడు. వాడు వర్షం వచ్చిందనుకుని లేచి కూర్చుంటాడు. రామకృష్ణుడు వాడిని లోపలికి తీసుకెళ్లి బట్టలు మార్చి అన్నం తినమంటాడు. భార్య వాడికి వంకాయ కూర వడ్డిస్తుంది. తిని చాలా బావుందంటాడు.

♦♦♦

ఆ మరుసటి రోజు రాయలవారి తోటమాలి తోటలోని చెట్లన్నీ చూచి, కాయ ఒకటి తగ్గినట్టు గుర్తిస్తాడు. ఎందుకంటే అతడు ప్రతిరోజు ఏ చెట్టుకి ఎన్ని కాయలు, పూలు వున్నాయో లెక్కిస్తుంటాడు. దాంతో ఒక్క కాయ తగ్గినా వెంటనే గుర్తించగలిగాడన్నమాట. తోటలో దొంగతనం జరిగిన వార్త రాయలవారి వరకు వెళ్లింది. 'రాజుగారి తోటలో దొంగతనమా?' అని అంతా ఆశ్చర్యపోయారు. అయితే మంత్రి అప్పాజీకి మాత్రం ఎందుకో తెనాలి రామలింగడి మీదే అనుమానం. ఇలాంటి సాహసాలు అతనే చేయగలడని అప్పాజీ నమ్మకం. వెంటనే రాయలవారి చెవిలో ఇదే ఊదాడు. కానీ దాన్ని ఎలా రుజువు చేయాలో ఇద్దరికీ అర్థంకాలేదు. గతంలో రామకృష్ణుడు ఇలాంటి చిలిపిపనులెన్నో చేసి దొరక్కుండా తప్పించుకున్న సంఘటనలు అనేకం వుండడంతో వారికి మార్గం బోధపడదు. చివరికి రాయలవారికే ఒక ఉపాయం తట్టింది. రామకృష్ణుడైతే తప్పించుకుంటాడుగానీ అతని కుమారుణ్ణి పిలిపిస్తే నిజం బయటపడుతుందని భావిస్తాడు. పిల్లవాడు కనుక నిజం చెప్పేస్తాడని అనుకుంటాడు. వెంటనే పిలిపిస్తారు.

రాత్రి తిన్న కూర గురించి అడుగుతారు. వాడు వంకాయ కూర తిన్నానని, ఎంతో రుచిగా వుందని చెప్తాడు.

దానికి రామకృష్ణుణ్ణి సమాధానం చెప్పమని రాయలవారు అడుగుతాడు.

"మహారాజా! పిల్లలన్నాక పెందలాడే నిద్రపోతారు. ఎన్నో కలలు కంటారు. అందులో వర్షం వస్తుంది. వంకాయ కూర తింటారు. అదే మావాడు మీకు చెప్పాడు. కావాలంటే వాడిని అడగండి. రాత్రి వర్షం వచ్చిందని కూడా చెప్తాడు" అంటాడు.

తీరా పిల్లవాణ్ణి రాత్రి వర్షం వచ్చిందా అంటే...

"అవును మహారాజా! చాలా పెద్ద వర్షం వచ్చింది. నా బట్టలన్నీ తడిచిపోయాయి" అంటాడు.

రామకృష్ణుడు ఏదో నాటకం ఆడుతున్నాడని రాయలవారికి బోధపడుతుంది. అదే సమయంలో తను చేసిన తప్ప కూడా అర్థమౌతుంది. అసలు అంతమంది ఇష్టపడే వంకాయను అలా గోప్యంగా ఎందుకుంచాలి? అందరికీ అందుబాటులోకి వచ్చేలా చేస్తే ఈ తిప్పలు, తీర్పుల అవసరం వుండదుకదా" అనుకుంటాడు. అనుకోవడమే కాదు. జనాలందరికీ వంగ మొక్కలు పంపిణీ చేస్తాడు. ప్రజలంతా సంతోషంగా వాటిని స్వీకరిస్తారు.

- చూటీ



వరి వి'చిత్రాలు'

పక్కనున్న ఫొటోలు చూశారా? చాలా బాగున్నాయి కదా! ఇవేవో పెయింటిగ్స్, సీనరీసో అనుకుంటే మీరు బురదలో కాలేసినట్టే మరి. ఎందుకంటే ఇవి రైతులు చేసిన 'చిత్రాలు'. ఇంతకూ వాటిని ఎలా వేశారో తెలిస్తే మీరు ఎంతగానో ఆశ్చర్యపోతారు తెలుసా? వరి మొక్కలను కావలసిన ఆకారంలో నాటి! జపాన్‌లోని ఇనాకడేట్ అనే గ్రామంలోని రైతులు ఈ చిత్రాలను వేసి తమ ప్రతిభను, సృజనాత్మకతను చాటారు. ఇందుకు వారు రకరకాల రంగుల (ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నారింజ) వరి మొక్కలను ఎంచుకున్నారు. ఈ విచిత్రమైన కళను చూసేందుకు సందర్శకులు వేలసంఖ్యలో వస్తున్నారట. అయితే వీటిని కింది నుంచి మామూలుగా చూస్తే ఆ చిత్రాల అసలు రూపాలు సరిగా కనపడవు. అందుకే వాటిని పూర్తిగా వీక్షించడానికి వీలుగా ఒక టవర్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ చిత్రాలను రూపొందించడానికి ముందుగా వారు వేయదలచుకున్న బొమ్మ నమూనాను ఒక పేపర్ మీద గీసుకుంటారు. దాని ప్రకారం రైతులు కావలసిన షేడ్ వరి మొక్కలను భూమి మీద నాటుతారు.